ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 164 పేజీలు: 8+4 వెల: 6.50

షాబాద్ హత్యల కిరాతకుడు ఆత్మహత్య 2లో
పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి 5లో


సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, సభకు హాజరైన అభిమానులు, ప్రజలు

# వచ్చే మార్చికి 'పోలవరం' పూర్తి

## ఆగస్టు 14న అనకాపల్లికి గోదావరి జలాలు

### రెండేళ్లలో 15% పనులు పూర్తి చేశాం: సిఎం చంద్రబాబు

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 13:** పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆగస్టు 14న అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేసి అఖండ హారతి నిర్వహిస్తామని వెల్లడించారు. పోలవరం పనుల పురోగతిని ప్రతి నెల ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం, మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాధాన్యత సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. సెప్టెంబర్‌లో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు మొత్తం పనుల్లో 89 శాతం పూర్తయ్యాయని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగా, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే 15 శాతం పనులు పూర్తి చేసి రూ.7,100 కోట్ల వ్యయం చేసిందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుపై 136 సార్లు సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పనులు ప్రణాళిక ప్రకారమే స్పిల్‌వే, రేడియల్ గేట్లు, కాఫర్ డ్యాం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్1లో 40శాతం, గ్యాప్2లో 30శాతం, గ్యాప్3లో 100శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కుడి కాల్వ ఎర్త్‌వర్క్ పూర్తిగా, ఎడమకాల్వ ఎర్త్‌వర్క్ 99 శాతం పూర్తయిందన్నారు. ఎడమ, కుడి ఇరిగేషన్ టన్నెల్లు 100 శాతం పూర్తయ్యాయని వివరించారు. 7.2 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుందని, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని సీఎం తెలిపారు. 28.5లక్షల మందికి తాగునీరు, >>2

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

- రెండేళ్లలో ఇరిగేషన్‌కు రూ.24వేల కోట్లు ఖర్చు
- పవన్‌ను, కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు
- పనులు ప్రారంభించిన సిఎం చంద్రబాబు
- వచ్చే జూన్ నాటికి గేట్ల బిగింపు పూర్తి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 13 ప్రభాతవార్త:** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్‌కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి ఆరాతీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని, >>2

# గ్రామాలకు కొత్త రూపు

## నరసన్నపేట నియోజకవర్గంలో రూ.4.33 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


సోమవారం పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం/నరసన్నపేట,జులై 13 ప్రభాతవార్త:** గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. సోమవారం నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులు బగ్గు రమణ మూర్తితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గొల్లలవలస చెరువు నుంచి డీపీఎన్ రోడ్డు వరకూ కోటి రూపాయలతో నిర్మించిన బీటీ రహదారి, 12.98 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్, దీర్ఘాశి నుండి గొల్లలవలస వరకు 80 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డు, కొల్లివలస మబగాం వరకు 1.90 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లను, ఖాన్ సాహెబ్ పేట వద్ద మబగాం నుండి కాంచీపేటకు 50 లక్షలతో సిసి రోడ్డు, జలజీవన పథకం కింద కాంచీపేటకు 15 లక్షల రూపాయలతో రక్షిత మంచి నీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. మబగాం కాలనీ 21.10 లక్షలతో జలజీవన మిషన్ కింద రక్షిత మంచి నీటి పథకానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ క్లినిక్ కు సంబంధించి ఆబా కార్డు గూర్చి డిఎంహెచ్ఓను మంత్రి అడుగగా ఆబా కార్డులకు సంబంధించి డిఎంహెచ్ఓ మంత్రికి వివరించారు. ఆసుపత్రికి ఫర్నిచర్ కోసం అడిగి తెలుసుకున్నారు. గొల్లలవలస, దీర్ఘాశి, మబగాం గ్రామాలు రావడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. నాన్నగారైన స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఉన్నప్పటి నుంచి మమ్మల్ని అందరిని ఆదరించి మీ గుండెల్లో పెట్టుకొని మీరందరూ ఎంతో ఆదరణ, ఎంతో ప్రేమ, ఎంతో అభిమానం మాకు ఎల్లప్పుడూ కూడా చూపిస్తున్నందుకు గ్రామస్తులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మాకు కూడా మీ తాలూ కారుణం తీర్చుకోవాలనే >>2

### బోటు ప్రమాద మృతదేహాలు

# నేడు అప్పగింత

## ఏర్పాట్లు పర్యవేక్షిస్తోన్న మంత్రి కొండపల్లి

**విజయవాడ. జులై 13 ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం సముద్ర తీరంలోని ఫు క్వాక్ సముద్రతీరంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వియత్నాం నుంచి వస్తోన్న విమానం మంగళవారం ఉదయం 7.20 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందని మంత్రి తెలిపారు. మంత్రి కొండపల్లి సోమవారం రాత్రి 8గంటల నుంచే ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను మృతుల స్వస్థలాలకు తరలించేందుకు ఏపీఎన్నార్టీ అధికారులు ప్రత్యేక ఆంబులెన్స్‌లు సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మనదేశ ఎంబసీతో పాటు వియత్నాం ఎంబసీతో మాట్లాడి మృతదేహాలు త్వరగా ఇండియాకు వచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇక ఏపీ ఎన్నార్టీ అధికారులు మృతుల కుటుంబాలకు అండగా సాయం అందిస్తు >>2

# మరో 175 మెడికల్ సీట్లు

## పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100, విజయవాడ సిద్దార్థకు 75 సీట్లు కేటాయింపు



### 4 కాలేజీల్లో అదనంగా 325 సీట్లు

### ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనంగా 505 సీట్లు

### ప్రైవేట్‌కు 550 సీట్లు అదనం

**విజయవాడ.జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణలో మరో కీలక ముందడుగు పడింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) రాష్ట్రంలోని రెండు ప్రభుత్వ వైద్యకళాశాల(పిడుగురాళ్ల, విజయవాడ)ల్లో 175 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా లభించిన సీట్ల సంఖ్య 325కు చేరింది. పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 202627 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో ప్రవేశాలు జరిపేందుకు ఎన్ఎంసి అనుమతినిచ్చింది. అదేవిధంగా విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లను ఎన్ఎంసి మంజూరు చేసింది. ఈ మేరకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసి) లెటర్ ఆఫ్ పర్మిషన్లను సోమవారం జారీ చేసింది. ఇప్పటికే కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు 75, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 25 సీట్ల పెంపునకు ఎన్ఎంసి ఆమోదం తెలిపింది. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 అదనపు ప్రవేశాలు జరుగనున్నాయి. దీంతో ఈ ఒక్క విద్యా సంవత్సరంలోనే రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు లభించినట్లైంది. 2024-25 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 505 సీట్లు అదనంగా లభించాయి. ఎంబీబీయస్ సీట్లు భారీగా పెరగడంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న నీట్ మెరిట్ విద్యార్థులకు ఊరటనిస్తోంది.

**మంత్రి సత్యకుమార్ నిరంతర కృషి:** ఈ ఫలితాల వెనుక రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేసిన నిరంతర కృషి కీలకంగా నిలిచింది. ఎన్ఎంసి అనుమతులు పెండింగ్‌లో ఉన్న ప్రతి కళాశాల పురోగతిని స్వ యంగా సమీక్షిస్తూ, ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ,ఎన్ఎంసి ఉన్నతాధికారులతో >>2

# గోదావరి 'సంగమం'


పట్టిసీమ నుంచి ఇబ్రహీంపట్నం ,చేరుకున్న గోదావరి జలాలు

### డెల్టా రైతాంగం హర్షాతిరేకాలు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** గోదారమ్మ బిలబిలమంటూ పరుగులు దీస్తూ వచ్చి తన సోదరి కృష్ణమ్మను ముద్దాడింది. నల్లనమ్మను ఎర్రనమ్మ కలిసిన దృశ్యం చూపరులకు కనువిందు చేస్తోంది.సాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న డెల్టా రైతాంగానికి ఈ పరిణమం ఆనందన్నా పంచుతుంది.పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి విడుదలైన నీరు పోలవరం కుడి ప్రధాన కాల్వ ద్వారా సుమారు 175 కిలో మీటర్లు నాలుగు రోజుల పాటు ప్రయాణించి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో కలిసింది. ఖరీఫ్ సీజన్‌లో నెలకు సుమారు 12 టీఎంసీల చొప్పున మొత్తం 48 టీఎంసీల గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, సాగునీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని పంటలను విజయవంతంగా సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానానికి ప్రతీకగా నిలిచిన పట్టిసీమ పథకం మరోసారి తన ప్రాధాన్యాన్ని చాటుకుంటూ, డెల్టా ప్రాంతంలో వ్యవసాయానికి భరోసాగా నిలుస్తోంది. వరుసగా 12వ ఏడాది కూడా పట్టిసీమ ఎత్తిపోతల పథకం కృష్ణా డెల్టాకు వరంగా >>2

## ముగింపు దశకు

# ఓటర్ల జాబితా సవరణ


సిఇఒ వివేక్ యాదవ్

### గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన ఎపి సిఇఒ

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో జాబితా సవరణ ముగింపు దశకుచేరుకుంది. ఈ క్రమంలో ఓటర్ల గడువు పొడిగించాలని సీఈసీకి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ సీఈవో లేఖ రాసారు. రాష్ట్రంలో పూర్తయిన 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ చనిపోయినట్లుగా 14 లక్షల మందికి పైగా ఓటర్ల గుర్తింపు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 12 లక్షలకు పైనే ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) గత నెల రోజుల నుంచి జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అయితే, వివిధ రాజకీయ పార్టీల వినతుల మేరకు ఈ ప్రక్రియ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో నెల రోజుల నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. పంపిణీ చేసిన వాటిలో ఇప్పటివరకు 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అంటే మొత్తంగా 88 శాతం మంది ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఇంకా 1.67 శాతం ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సర్వేలో పలు అంశాలు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644లక్షలమంది ఓటర్లు >>2

### మాజీ మంత్రి కుమారుడు

# పోలీసులకు లొంగుబాటు

## బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి మరణించిన కేసు

**పలాస(శ్రీకాకుళంజిల్లా),జులై 13 ప్రభాత వార్త:** శ్రీకాకుళం జిల్లాలో సంచలనం రేపిన బైక్ ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. న్యాయవాదితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆరవ్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఈ నెల 10న జరిగిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం తెలి సిందే. ఈ ప్రమాదంలో అతివేగంగా బైక్ నడిపిన ఆరవ్ కారణమని పోలీసులు గుర్తిం చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడుతున్నారు.

**దానయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్:** >>2

# ఇక 'షార్ట్' హజ్ యాత్ర



## ఆప్షన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి ఫరూక్

**విజయవాడ,జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర మక్కా హజ్ యాత్ర లో కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. తక్కువ రోజుల వ్యవధి తో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని అమరావతిలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ 2027లో దాదాపు 20 రోజులకు కుదించబడిన ప్రణాళికతో షార్ట్ హజ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నదన్నారు. ఈ ప్యాకేజీలో మదీనాలో 2 లేదా 3 రోజుల బస కూడా చేర్చబడిందన్నారు. ప్రస్తుతం 3545 రోజుల వ్యవధితో హజ్యాత్రకు, 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు. 2027 హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి ఈ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు. 20 రోజుల వ్యవధితో షార్ట్ హజ్ కోరుకునే వారు తమ హజ్ దరఖాస్తును ఆన్ లైన్ లో సమర్పించేటప్పుడు, అందులో ఇచ్చిన షార్ట్ హజ్ ప్యాకేజీ ఆప్షన్ ను ఎంచుకోవాల్సి ఉంటుందని తెలి పారు. ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా షార్ట్ హజ్ ను పొందుపరిచిన అనంతరం, ఆన్ లైన్ లో దరఖాస్తు సమర్పించిన అనంతరం ప్యాకేజీ మార్చుకోవడానికి అవకాశం ఉండదని మంత్రి తెలిపారు. షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులను లాటరీ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. హజ్ కు ఎంపికై షార్ట్ హజ్ కు ఎంపిక కాని వారికి ఆటోమేటిక్ గా సాధారణ హజ్ పాకేజ్ (3545 రోజులు) వర్తిస్తుందని తెలిపారు. ఒక కవర్ లోని యాత్రికులందరూ ఈ షార్ట్ హజ్ ఆప్షన్ ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఒకే కవర్ లో రెండు ప్యాకేజీలు అనుమతించబడవని పేర్కొన్నారు. కాగా షార్ట్ హజ్ యాత్ర ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్, కోల్ కతా, అహ్మదాబాద్ నుండి మాత్రమే నిర్వహించ బడుతుందన్నారు. హజ్ 2027 కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 20వ తేదీన ముగుస్తున్నందున, గడువుకు ముందుగానే ఆన్ లైన్ ద్వారా హాజీలు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.



సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, దుర్గేష్ అనగాని, ఎమ్మెల్యేలు తదితరులు

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

>> 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.325కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని విమర్శించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం:** ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. 201419 మధ్య 72 శాతం పనులు పూర్తయితే, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్‌కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నామని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**అభివృద్ధిసంక్షేమమే కూటమి లక్ష్యం:** రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జబ్బతో శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీలేకుండా హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారన్నారు. స్టూడియోలు పెట్టిస్తున్నారని, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, ఎంఎల్‌ఏ లు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలకు కొత్త రూపు

>> ఆలోచనతో గొల్లలవలసకి ప్రాధాన్యత ఇస్తూ, గొల్లలవలస గ్రామం తాలూకా సమస్యల్లో ప్రభుత్వం తాలూకా పాత్ర పూర్తిగా మీ అందరికీ కూడా సహకరించే విధంగా గతంలో 2014-19 లో కూడా చాలా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. తిరిగి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్ళీ గ్రామంలో అభివృద్ధి అనడానికి ఒక ఉదాహరణగా కొన్ని కార్యక్రమాలు జరిగినట్లు చెప్పారు. ఇప్పుడు కూడా మీరు చూసుకుంటే పోలాకి వరకు, డోల వరకు ఉన్నటువంటి రోడ్డు 1 కోటి రూపాయలతో రోడ్డు ఈరోజు మనం ఏర్పాటు చేయడం జరిగింది. 1.20 కోట్లు తోటాడ రోడ్డు కూడా మనం కేటాయించడం జరిగినట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్నటువంటి హెల్త్ వెల్నెస్ సెంటర్ భవనానికి కూడా సుమారు మరొక 13 లక్షలు కేటాయించి బ్రహ్మాండంగా గ్రామంలో ఉన్నటువంటి వ్యక్తులందరికీ కూడా ఆరోగ్యం బాగుండాలనే ఆలోచనతో ఈ భవనాన్ని పూర్తి చేసుకున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ల పెంపిణీ కార్యక్రమం 3000 నుంచి 4000 రూపాయలు. అలాగే తల్లికి వందనం కార్యక్రమం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ 15,000 రూపాయలు ఇచ్చామన్నారు. స్త్రీ శక్తి కింద మహిళలు ఎక్కడికి బస్సు ఎక్కి వెళ్ళాలన్నా ప్రయాణం ఉచితం చేసి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వాళ్ళకి చేశామన్నారు. అన్నదాత సుఖీభవ కింద సంవత్సరానికి 20,000 రూపాయలు రైతన్నల అకౌంట్లలో నేరుగా వేసే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ రెండు సంవత్సరాలు మీరు చూశారు, మళ్ళీ ఊపిరి పోసుకున్నట్టుగా అయిందన్నారు. గృహాలు లేనటువంటి వారు ఎవరైతే ఉన్నారో, వాళ్ళందరికీ కూడా గృహాలు కేటాయించి, ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి గృహాలు కట్టించే కార్యక్రమం అతి త్వరలోనే కూటమి ప్రభుత్వం చేపట్టబోతుందని స్పష్టం చేశారు. అత్యంత అవసరమున్న నిరుపేదలు ఎవరైతే ఉన్నారో వాళ్లందరికీ గృహాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెన్షన్లు కూడా అదనంగా ఎవరైతే అర్హులు ఉన్నారో వితంతు పెన్షన్ కావచ్చు, వికలాంగ పెన్షన్ కావచ్చు, ఇవన్నీ కూడా కొత్త పెన్షన్లు ఏవైతే ఉన్నాయో అన్ని సర్వే చేసి సిద్ధంగా ఉన్నాయన్నారు. ముందు తల్లికి వందనం కార్యక్రమం చేయాలనేది చంద్రబాబు నాయుడు ఆలోచనని, అది అయిన వెంటనే కొత్త పెన్షన్లు కూడా ఎవరెవరైతే అర్హులు ఉన్నారో వాళ్లకి కొత్త పెన్షన్లు అతి త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం కూడా చంద్రబాబు నాయుడు చేస్తున్న కార్యక్రమాలు మూడు సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి ఇవన్నీ కూడా నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన కార్యక్రమాలు కూడా చేయడానికి చంద్రబాబు నాయుడు, మన ప్రభుత్వం, పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి మోదీ అందరి సహకారం తీసుకొని మిగిలిన కార్యక్రమాలన్నీ కూడా చేస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వ వాటాతో ఇంటింటికి కొళాయి కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మీ అందరికీ కూడా మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామన్నారు. ఇంటింటికి కొళాయి కూటమి ప్రభుత్వం తాలూకా హామీ అని, ఆ హామీ ప్రకారం మన నరసన్నపేట నియోజకవర్గంలో కూడా పథకం మంజూరు చేసి, నిధులు కూడా దానికి కేటాయించినట్లు చెప్పారు. పనులు త్వరితగతిన పూర్తి చేసుకొని గ్రామంలో ఇంటింటికి కూడా కొళాయి ఇవ్వాల్సినటువంటి కార్యక్రమం ఇంకా ఉందన్నారు. ఎరువులు ఎక్కడా కూడా ఇబ్బంది లేదని కలెక్టర్ ప్రతి రోజు తెల్లవారి మొట్టమొదట ఈ జిల్లాలో చేసే కార్యక్రమం ఒకటి సాగునీరు సరిగ్గా అందుతుందా, ఎరువులు ఎలాగ ఉన్నాయని ప్రతి రోజు జిల్లా నలుమూలల నుంచి ప్రతి ఒక్క రైతాంగం నుంచి కూడా ఆయన రైతుల నుండి అభిప్రాయం సేకరణ చేస్తున్నట్టు చెప్పారు. మీ మీ గ్రామాల్లో ఎరువుల సమస్యలు ఉంటే చెప్పండి, ఆయన కూడా ఇక్కడున్నారు కాబట్టి పరిశీలన చేసి ఎరువులఎక్కడా కొరత లేకుండా చూసుకునే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు. రైతులందరికీ కూడా తెలియజేస్తున్నాం. విత్తనాలు గాని, ఎరువులు గాని, మళ్ళీ రేపు మనమందరం చక్కగా పంట పండించుకొని కొనుగోలు చేసి, మళ్ళీ మీ అందరికీ 48 గంటల్లో రైతు అకౌంట్లలో డబ్బులు వేయించే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు.



పోలవరం ప్రాజెక్టును ఏరియల్ సర్వే చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

# వచ్చే మార్చికి 'పోలవరం' పూర్తి

>> పరిశ్రమలకు 23.44 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు.

**నిర్వాసితులకు పూర్తి న్యాయం:** ప్రాజెక్టు కోసం 94,152 ఎకరాల భూమిని సేకరించామని, అక్టోబర్ 2026 నాటికి భూసేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు 17,500 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించామని, 2027 మార్చి నాటికి మిగిలిన వారందరికీ పునరావాసం పూర్తి చేస్తామని చెప్పారు. 17,118 ఆర్‌అండ్‌ఆర్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ముందుగా అనకాపల్లికి, అనంతరం విశాఖకు గోదావరి జలాలను అందిస్తామని, తర్వాత గోదావరి-నాగావళి నదుల అనుసంధానాన్ని చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**జలధార-జలహారతికి రూ.3,300 కోట్లు:** జలధార-జలహారతి కార్యక్రమాన్ని రూ.3,300 కోట్లతో చేపడుతున్నామని, సర్దుబాటు పనుల కోసం ప్రతిజిల్లా కలెక్టర్‌కు రూ.2 కోట్లు అదనంగా కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని పేర్కొన్న ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేసి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## గోదావరి 'సంగమం'

>> మారి, దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గడం, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించడం రైతులకు ఊరటనిచ్చింది. గత బుధవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని విడుదల చేయగా, ఆ జలాలు నాలుగు రోజుల ప్రయాణం అనంతరం శనివారం రాత్రి పవిత్ర సంగమానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఇబ్రహింపట్టణం ఫెర్రీ సంగమం వద్ద గోదావరి ఎర్రటి జలాలు, కృష్ణా నదీ నల్లని రంగు జలాలు కలిసిన దృశ్యం చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే కృష్ణా డెల్టాకు సాగునీటి విడుదల ప్రారంభమైంది. ప్రస్తుతం పులిచింతల బ్యాలెన్సింగ్ జలాశయం నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, అక్కడ కేవలం 32 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇందులో 9 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉండటంతో మిగిలిన నీటినే సాగు అవసరాలకు వినియోగించాల్సి వస్తోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి రావడం డెల్టా రైతులకు ఎంతో ఊరటనిస్తోంది. వరుసగా 12 సంవత్సరాలుగా పట్టిసీమ ద్వారా సాగునీరు అందుతుండటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 'సుప్రీం'లో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

**విజయవాడ.జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:**పోలవరం ప్రాజెక్టు,అనుసంధాన బనచర్ల పథక ప్రాతిపదనపై తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో లోపాలున్నాయంటూ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వానికి తక్షణ నోటీసులు, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం తోసిపుచ్చింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి నీటి వినియోగం, పోలవరంబనకచర్ల అనుసంధానం వంటి అత్యంత కీలకమైన అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వివాదాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల లింకేజీలపై నెలకొన్న వివాదాలు కొనసాగుతున్న సమయంలో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే ఏపీ ప్రభుత్వానికి తక్షణమే నోటీసులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది.

## షాబాద్ హత్యల కిరాతకుడు ఆత్మహత్య

### గడ్డిమందు తాగి మరణించినట్లు పోలీసులు వెల్లడి

**షాద్‌నగర్/షాబాద్ జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ "ఆరు హత్యల" కేసు నిందితుడు రాజ్ కుమార్ ఎట్టకేలకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పెంజెర్ల గ్రామంలో రాజ్ కుమార్ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమందించారు. స్థానికులు రాజ్ కుమార్ మృతదేహం దగ్గర క్రిమిసంహారక మందు (పాయిజన్) బాటిల్‌ను గుర్తించారు. రాజ్ కుమార్ మేనమామ ఊరిలో రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాబాద్‌లో రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురుని నరహంతకుడు రాజ్‌కుమార్ వరుసగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఈ మారణహోమాన్ని సృష్టించిన రాజ్ కుమార్ ఆచూకీ కోసం పోలీసులు 14 బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు నిందితుడిని పట్టిస్తే రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోక్సో కేసులో బెయిల్ పొంది యథేచ్ఛగా తిరుగుతున్న రాజ్‌కుమార్ పగబట్టి చేసిన ఈ ఘాతుకం కలకలం రేపింది. రెండు గంటల్లో ఏకంగా ఆరుగురిని హతమార్చడం రాజధాని శివారులోని షాబాద్‌ను కుదిపేసింది. కేసు పెట్టిన బాధిత బాలిక కుటుంబాన్ని, ప్రశ్నించిన తన కుటుంబాన్ని సైతం ఆ ఉన్మాది గొంతులు కోసి హతమార్చడం రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది.



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

**స్థానికుల సమాచారంతో..** పెంజర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొత్తూరు పోలీసులకు 100 డయల్ ద్వారా సమాచారం స్థానికులు అందజేశారు. దీంతో పోలీసుల రంగ ప్రవేశం చేశారు. గ్రామంలో సిల్వర్ చైన్ రియల్ వెంచర్ పక్కన కల్వకోలు పెంటయ్య రాజులకు సంబంధించిన భూమిలో ఓ గోడ పక్కన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు రాత్ కుమార్ పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు. అతని వద్ద ఓ సెల్ఫోన్ గడ్డి మందు బాటిల్ ను కనుగొన్నట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం హుటాహుటిన చేరుకోవడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సెల్ఫోన్లో షాబాద్ హత్యలకు ముందు రోజు వీడియోను చిత్రీకరించాడు. ఆ యొక్క దృశ్యాలను అతను మాట్లాడిన వైనాన్ని స్థానిక మీడియా ముందు పోలీసులు ప్రదర్శించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు జరిపిన అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు మీడియాకు తెలిపారు.

**మృతుడు రాజ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు:** ఆ కుటుంబం తనను మోసం చేసిందని వారి కోసం ఎంతో డబ్బు ఖర్చు చేశానని అయినా తనపై పోక్సో కేసు పెట్టారని ఆ వీడియోలో మృతుడు రాజ్ కుమార్ చెప్పడం గమనార్హం. ఆ అమ్మాయిని నమ్మి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసినట్లు వీడియోలో పేర్కొన్నారు. అమ్మాయి కుటుంబానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలయ్యానని చెప్పారు. అమ్మాయి కుటుంబం తనను తీవ్రంగా మోసం చేసిందని, తన బిడ్డలకు కూడా భూమి లేకుండా మొత్తం అమ్మేశానని జీవితంపై విరక్తి పుట్టి వారిని చంపాలనుకున్నా అంటూ రాజ్ కుమార్ తన వాంగ్మూలాన్ని వీడియోలో రికార్డ్ చేశాడు. తనపై ఫోక్సో కేసు పెట్టడంతో విరక్తి చెంది ఆ అమ్మాయి కుటుంబాన్ని చంపినట్లు ఆ వీడియోలోని సారాంశం.

**రాజ్ కుమార్ ఆత్మహత్యతో సంచలనం:** షాబాద్ ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కుమార్ నియోజకవర్గం లోని కొత్తూరు మండలంలో ఆత్మహత్యకు పాల్పడడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రాజ్ కుమార్ ఈ ప్రాంతంలో నిన్ననే కనిపించినట్టు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పగా ఎవరు నమ్మలేదు. అయితే మృతుడి అమ్మమ్మ స్వగ్రామం మండలంలోని పెంజర్ల గ్రామం కావడంతో అతను ఈ ప్రాంతంలోనే గత రెండు మూడు రోజులుగా తల దాచుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగు చూడడంతో సంచలనం రేకెత్తించింది. పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తో పాటు డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్షీ ్మనారాయణ, జిల్లాకు చెందిన మరికొంతమంది పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నారు. పెంజర్ల గ్రామంలో మృతుడు రాజ్ కుమార్ మేనమామలు మాజీ ఉపసర్పంచ్ లుంగారి లక్ష ్మయ్య, గోపాల్, జగన్ లు ఉన్నారు. అయితే ఈ సంఘటన నేపథ్యంలో అతను తన మేనమామల కోసం ఈ గ్రామానికి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పోక్సో కేసు అయినప్పుడు అతను ఇక్కడే తలదాచుకున్నట్లు కూడా తెలుస్తుంది. రాజ్ కుమార్ మృతదేహం గ్రామాల్లో లభ్యం కావడంతో గ్రామస్తులు కూడా భయాందోళనకు గురయ్యారు.



సోమవారం ముంబయిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శిస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

## డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మహారాష్ట్ర సిఎం

**విజయవాడ,జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం ముంబైలోని ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడ్నవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలు కీలక విషయాలపై మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేస్తున్నారు.



సోమవారం పలాసలో దానయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

# పోలీసులకు లొంగుబాటు

>> పలాసలో దానయ్య కుటుంబాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీతరపున రూ.10లక్షల ఆర్థిక సాయం మంత్రి ప్రకటించారు. బాధితకుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దానయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలాసలో విషాద ఘటనపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# మరో 175 మెడికల్ సీట్లు

>> పలుమార్లు సంప్రదించి రాష్ట్ర ప్రతిపాదనలకు ఆమోదం వచ్చేలా మంత్రి సమన్వయం చేశారు. అధికారులు గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసేలా ప్రత్యేక దృష్టి సారించడంతో వరుసగా ఫలితాలు వస్తున్నాయి. అత్యంత కీలకమైన పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల విషయంలో సాంకేతిక అంశాలు అడ్డంకిగా మారిన సమయంలో మంత్రి స్వయంగా వ్యవహారాన్ని పర్యవేక్షించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, పరికరాల కల్పనను వేగవంతం చేయడంతో ఎన్ఎంసి 100 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి మంజూరు చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలోనే అక్కడ తొలిబ్యాచ్ విద్యార్థులు అడుగుపెట్టనున్నారు. అదనపు ప్రవేశాలతో రాష్ట్రానికి అవసరమైన వైద్యులు అందుబాటులోకొస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026-27లో సీట్ల పెంపును గమనిస్తే నెల్లూరు25 ,పాడేరు50, కడప 75 విజయవాడ75, పిడుగురాళ్ల 100 మొత్తం325పెరిగాయి. కూటమి ప్రభుత్వ హయాంలో 1055 అదనపు ఎంబిబియస్ సీట్లు. 2024-25 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 505, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 550 అదనపు ఎంబిబియస్ ప్రవేశాలకు అనుమతులు లభించాయి. ఎన్ఎంసి నియమాల మేరకు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అదనంగా 50 శాతం సీట్లు గవర్నమెంట్ కోటాలో (కన్వీనర్ కోటా) 275 సీట్లు విద్యార్థులకు దక్కుతాయి. మొత్తమ్మీద...2024 25 నుండి కూటమి ప్రభుత్వ హయాంలో 1055అదనపు ఎంబిబియస్ సీట్లకు అనుమతులొచ్చాయి. ఈ అదనపు సీట్లతో రాష్ట్రంలో మొత్తం ఎంబిబియస్ సీట్ల లభ్యత 7090కి పెరిగింది. ఇందులో 15 శాతం సీట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో లభించాయి.

# నేడు అప్పగింత

>>న్నారు. వియత్నాం బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం సర్కిల్‌పేటకు చెందిన గెల్లి జయశ్రీ, కడపకు చెందిన శ్రీధర్,సత్యసాయిజిల్లా హిందూపురం నల్లపేటకు చెందిన రవితేజ మృతి చెందారు.

## ఓటర్ల జాబితా సవరణ

>> చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇది మొత్తం ఓటర్లలో 3.41 శాతంగా ఉంది. అలాగే, ఉపాధి, ఇతర కారణాల వల్ల శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన (షిఫ్ట్ అయిన)ఓటర్లు కూడా భారీగానే ఉన్నారు. ఇలాంటి వారు 12,14,994 లక్షలు ఉన్నట్లు సర్వేలో తేలింది.బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లినప్పటికీ కొందరు అందుబాటులో లేరు. ఇలా సుమారు 7,26,425 లక్షల (1.75 శాతం) ఓటర్లు దొరకలేదని అధికారులు పేర్కొన్నారు. చనిపోయిన ఓటర్లను పక్కన పెడితే, ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇంకా 9 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగుస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. గడువును పెంచాలని కోరుతూ సీఈవోకు వినతిపత్రాలు సమర్పించాయి. దీనికి తోడు కొన్ని పట్టణ (అర్బన్) ప్రాంతాల్లో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాల కలెక్టర్లు సైతం గడువు పొడిగింపునకు సూచనలు చేశారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. గడువు పెంచాలని ఆ లేఖలో ఆయన ఈసీని కోరారు.

## వారం - వర్జ్యం

14-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
● అమావాస్య మ.3.16
పునర్వసు రా.12.11
వర్జ్యం : మ.1.31-మ.2.57
దు.ఉ.8.18-ఉ.9.10
2) రా.11.57-రా.12.49
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

**వృషభం:** ఇంటా బయట సమస్యలు ఎదురై అధిగమిస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:**ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కర్కాటకం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**సింహం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. విధినిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు. స్థిరాస్తుల కొనుగోలును వాయిదా వేయడం మంచిది.

**తుల :** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. ఆర్థికంగా మెరుగు పడతారు.

**వృశ్చికం:** స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి. ఒక్కసారిగా అనేక అవకాశాలు మీ ముందుకు వస్తాయి.

**ధనుస్సు:** పెట్టుబడుల విషయంలో మెలకువతో వ్యవహరించండి. ఇంటర్వ్యూలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. వస్త్రలాభం.

**కుంభం:** ప్రజలతో సంబంధాలు మెరుగు పరుచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. స్వల్ప ధనలాభం కలదు.

**మీనం :** హోమియోపతి వైద్యం పట్ల మక్కువ చూపుతారు. రుచికరమైన ఆహారాన్ని స్వీకరించాలని మనస్సు కోరుకుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




# ఎఐ కెమెరాలతో నేరగాళ్లకు చెక్

## చోరుల పాలిటి సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360

- వాహనాల రికవరీనే కాదు క్లిష్టమైన కేసుల్లోనూ
- గుంటూరులో ఒకే ఒక అలెర్టుతో 7 వాహనాల స్వాధీనం
- ఎన్టీఆర్ జిల్లాలో మరికొన్ని వాహనాల గుట్టు విప్పిన సిసిటివిలు
- నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారం
- మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ ఏఐ ఆధారిత వ్యవస్థ దోహదం

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వాహన చోరుల పాలిటి సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 మారింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణలకు, బహుళ ప్రయోజనాల ఆశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ప్రస్తుతం 14,750 సిసి కెమెరాలున్నాయి. వీటిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారితంగా పనిచేసేలా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అనే వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ ఇప్పుడు పోలీసులకు కేసుల దర్యాప్తులో అత్యంత సహాయకారిగా, కీలక సాధనంగా మారుతోంది. పలు కేసులు ఛేదించడంతో పోలీసులకు కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తోంది.

**వాహనాల దొంగల ఆటకట్టు:** వాహనాలను చోరీ చేసే దొంగల పాలిట ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ఇప్పుడు సింహస్వప్నంలా మారుతోంది. రాష్ట్రంలో దొంగలు ఎక్కడ వాహనాల చోరీలకు పాల్పడినా, ఆ వాహన వివరాల ఆధారంగా చోరీకి గురైన వాహనాలను సిసికెమెరాల ద్వారా ఆర్‌టిజిఎస్ గాలించి, ఆ వాహనాల ఆచూకీ గురించి పోలీసులకు రియల్ టైమ్‌లో సమాచారం చేరవేస్తోంది. దీంతో ఈ కేసులను పరిష్కరించడం పోలీసులకు చాలా సులభంగా మారుతోంది.

**4 నెలల్లో 80 వాహనాల స్వాధీనం:** నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారించింది. మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ దోహదపడుతున్న ఏఐ ఆధారిత వ్యవస్థ గురించి పోలీసుశాఖ సమాచార పత్రాన్ని విడుదల చేసింది. ఈ సమాచారాన్ని అనుసరించి ఈ నెల ఒకటో తేదీ బాపట్ల జిల్లా చీరాల. చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగించే తల్లి. తన ఆరునెలల చంటిబిడ్డను పొత్తిళ్లలు పెట్టుకుని ఫుట్‌పాత్ మీద ఓ దుకాణం ముందు నిద్రిస్తోంది. తెల్లవారుజామున ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఓ ఆగంతకుడు ఆమె చంటిబిడ్డను ఎత్తుకెళ్లాడు. ఆమె కన్నీరు మున్నీరైంది. బాపట్ల పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. బిడ్డను ఎత్తుకెళ్లిన నిందితుడ్ని పట్టుకోవడానికి ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. బిడ్డను ఎత్తుకెళ్లిన వ్యక్తి కదలికలను ఎఐ ఆధారిత కెమెరాల ద్వారా జల్లెడపట్టి 24 గంటల్లోపే నిందితుడ్ని పట్టుకునేలా ఆర్‌టిజిఎస్ రియల్ టైమ్ అలెర్టులను పోలీసులకు పంపింది. అపహరణకు గురైన బాబును పోలీసులు తీసుకొచ్చి మళ్లీ ఆ తల్లి ఒడికి చేర్చారు. బిడ్డకోసం తల్లడిల్లిన ఆ తల్లి మళ్లీ పొత్తిళ్లలో తన బిడ్డను చూసి మురిసిపోయింది. ఆనందాశ్రువులు కార్చుతూ పోలీసులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది. గుంటూరు నగరం పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవలే ఒక హోండా యాక్టివా స్కూటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎంత అన్వేషించినా దొరకలేదు. చివరకు పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. పోలీసులు అందించిన ఆ వాహనం వివరాల ఆధారంగా మ్యాట్రిక్ సిసి కెమెరాల ద్వారా వాహన కదలికలను అన్వేషించారు. జూన్ 17వ తేదీన ఆ స్కూటర్ గుంటూరులోని ఓ ప్రధాన కూడలి వద్ద తిరుగుతుండగా పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపారు. వెంటనే పోలీసులు నిందితుడ్ని పట్టుకుని విచారించగా, ఆ స్కూటర్‌తో పాటు మొత్తం ఏడు వాహనాలు చోరీ చేసినట్లు చెప్పడంతో ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

సురక్షిత ఏపి సాధన దిశగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ పనితీరుకు పైరెండు సంఘటనలు ఒక చిన్న ఉదాహరణలు మాత్రమమే అని పోలీసుశాఖ పేర్కొంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అందించిన ఏఐ ఆధారిత సాంకేతిక సహకాం ద్వారా గత నాలుగు నెలల కాలంలో పోలీసులు 80కి పైగా చోరీకి గురైన వాహనాలను కనుగొని స్వాధీనం చసుకోగలిగారు. అదృశ్యమైన 73 మంది ఆచూకీని ఈ వ్యవస్థ కనిపెట్టగలిగింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 52 మంది నేరస్థుల ఆచూకీ కూడా కనుగొని వారిని పోలీసులు పట్టుకోవడానికి దోహదపడింది.

**ఎన్నో ఉదాహరణలు:** విజయవాడ టు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో తన వాహనం చోరీకి గురైందని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఆ వాహన ఆచూకీ కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సహకారాన్ని పోలీసులు కోరారు. దీంతో సిసికెమెరాల ద్వారా ఆ వాహన కదలికలపై పోలీసులకు ఆర్‌టిజిఎస్ ఎప్పటికప్పుడు అలర్టులు పంపడంతో ఆ వాహనాన్ని పట్టుకోగలిగారు. కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్తే ఆ వాహనాన్ని అపహరించినట్లు విచారణలో తేలింది. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మోటారు సైకిల్‌ను చిల్లకల్లువద్ద పటుకోగలిగారు. ఏ.ఎస్.నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇలాగే చోరీకి గురైన వాహనాన్ని ఈ సాంకేతిక సహకారంతో పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు.

విస్సన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వాహన చోరీ కేసు సుదీర్ఘకాలం పెండింగులో ఉంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ద్వారా పోలీసులు ఈ కేసును ఇటీవలే ఇట్టే పరిష్కరించగలిగారు. ఈ పరిధిలోనే చోరీకి గురైన మరో వాహనాన్ని కూడా పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. మదనపల్లె టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏప్రిల్ 27న నమోదైన ద్విచక్ర వాహన చోరీ కేసును కూడా అక్కడి పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సాంకేతిక సహకారంతో ఛేదించగలిగారు.

మనుషుల అదృశ్యం కేసుల్లోనూ ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. మైలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యం కేసు నమోదైంది. ఎంత గాలించినా ఆమె ఆచూకీ తెలీక చాలా కాలంగా ఆ కేసు పెండింగులో ఉంది. దీంతో పోలీసులు ఈ కేసు పరిష్కారం కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం అడిగారు. ఫేషియల్ రికగ్నిషన్ విశ్లేషణ ద్వారా ఆ మహిళ ఆచూకీని కనుగొని పోలీసులకు అలర్టులు పంపారు. దీంతో పోలీసులు ఆమెను పట్టుకుని ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఈ కేసు పరిష్కరించగలిగారు. అదే రోజు ఎస్.ఆర్.పేటలో ఒక బాలిక అదృశ్యమైందనే కేసు నమోదైంది. అదృశ్యమైన బాలిక ఆ చూకీని అదే రోజు కొన్ని గంటల్లో కనుగొని ఆమెను ఆ కుటుంబ సభ్యులకు అప్పగించడంలో ఈ వ్యవస్థ సహకారం అందించింది. రెడ్డిగూడెంలో కూడా ఇటీవలే అదృశ్యమైన ఓ వ్యక్తి ఆచూకీని ఇలాగే కనుగొనగలిగారు. అదృశ్యమైన వ్యక్తి వాహన కదలికలను కెమెరాల ద్వారా పసిగట్టి ఆయన్ను కనుగొనేలా ఈ వ్యవస్థ దోహదపడింది.



## అందరికీ సంస్కృతం.. అకాడమీ లక్ష్యం

### తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్‌చంద్ర

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** పండితులు మాత్రమే సంస్కృతం అధ్యయనం చేయగలరన్న అపోహను దూరం చెయ్యాలి అన్న లక్ష్యంతో సంస్కృత అకాడమీ పనిచేస్తుంది, అందుకు తగ్గ మార్గనిర్దేశం చేయాల్సిందిగా వడ్డేశ్వరంలోని తెలుగు, సంస్కృత అకాడమీలో సోమవారం నిర్వహించిన సంస్కృత మేధావుల సదస్సును ఉద్దేశించి ఛైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర అన్నారు. దేశం భిన్నకులాలు, మతాలుగా విడిపోయిన ఈ సంధికాలంలో దేశం మొత్తాన్ని కలిపి ఉంచగలిగే శక్తి సంస్కృత భాషకు ఉందని విల్సన్ అన్నారు. 'అమృతం మధురమైంది. సంస్కృతం అంతకంటే మధురమైంది' అంటూ సంస్కృత వ్యాక్యాన్ని ఉదహరిస్తూ 'అమృతం మధురం సమ్యక్ సంస్కృతం హితతోదక్షం' అన్నారు. ఈ విశ్వం సంస్కృత భాషతో సామన్వితమై వుంది అనేది వైదిక వాక్కు అని గుర్తు చేశారు. ప్రాచీనకాలంలో దేశంలో సంస్కృత భాష కేవలం స్పష్టంగా ఉండడమే కాదు అది మన జ్ఞానానికి తల్లిగా ఉంది. కానీ ఈ ఆధునికాలంలో ఈ భాష కేవలం ధార్మిక విషయాలకే పరిమితమైందనే అభిప్రాయం జనాల్లో వుంది అని శరత్ చంద్ర గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంస్కృత పండితులు పలు సూచనలు చేశారు. అకాడమీ నేతృత్వంలో సంస్కృత సప్తాహ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సంస్కృత భాష వ్యాప్తి కోసం చిన్న చిన్న పుస్తకాలు వేసి విద్యార్థుల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. అందులో నీతి కథలూ, జాతీయ భావనలతో కూడినవి ఉండాలి అన్నారు. 'సంస్కృతం.. తెలుగు భాషలు తల్లి.. బిడ్డల్లు' లాంటివి అని ఆచార్య దీక్షితులు అన్నారు. సంస్కృత అకాడమీ యూ ట్యూబ్ ఛానల్ ద్వారా భాష అభివృద్ధికి దోహదం చెయ్యాలి అన్నారు. ఆచార్య దోర్బల ప్రభాకర్ శర్మ మాట్లాడుతూ ప్రపంచంలో మెదట పుట్టిన భాష సంస్కృతమే అన్నారు. హెబ్రూ భాష కంటే ప్రాచీనమైనదన్నారు. ఆచార్య రమణ శాస్త్రి మాటాడుతూ రాష్ట్రములో ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కలిపిస్తే సంస్కృతంలో ఒరియాంటేషన్ క్లాసులు నిర్వహిస్తాం అన్నారు. సమావేశంలో ఆచార్యులు పిటిజివి రంగా చార్యులు, డాక్టర్. పాలపర్తి శ్యామలా నంద, డాక్టర్ దివి నరసింహ దీక్షితులు, డాక్టర్ వందన రావు, డాక్టర్ రమణ మూర్తి, ఆచార్య మారుదూరి నరసింహాచార్యులు, పిన్నమనేని భవాని, తిరుపతి సంస్కృత యూనివర్సిటీ ఆచార్యులు నందన్ రావు, డాక్టర్ కనపాల కుమార్, విజి చంద్రన్‌లతో పాటు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరి, డాక్టర్ ఎస్.వి టి.రాజ్యలక్ష్మి, డాక్టర్ గ్లోరీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయన బాధను బయటకు వ్యక్తం చేయరు'



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్‌కు ఇటీవల కుడి భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ క్రమంలో ఆయన సతీమణి అన్నా పవన్ కల్యాణ్ కొణిదెల 'ఎక్స్' వేదికగా తన మనస్సులో మాటను పంచుకున్నారు. 'పవన్ తన జీవితంలో శారీరక నొప్పి కంటే తీవ్రమైన ఎన్నో భారాలను మోశారు. ఎంతటి కష్టమైనా ఫిర్యాదు చేయని ఆయన, నొప్పి భరించలేని స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే తన బాధను బయటపెడతార్లు' అని ఆమె భావోద్వేగంగా తెలిపారు. ముంబైలోని ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పరామర్శించిన ఫొటోను అన్నా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం తన దృష్టంతా పవన్ ఆరోగ్యంపైనే ఉందని తెలిపారు. 'ఇప్పుడు నా పని ఒక్కటే.. ఆయన్ను జాగ్రత్తగా చూసుకోవడం. ఆయన సురక్షితంగా ఉన్నారనే నమ్మకం కల్పించడం. ఒక్కో రోజు ముందుకు సాగుతూ ఆయన పూర్తిగా కోలుకుంటార్లు' అని ఆమె భావోద్వేగంగా రాశారు. జులై 11న పవన్ కల్యాణ్‌కు ముంబైలోని ఆసుపత్రిలో కుడి భుజానికి ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. రోటేటర్ కఫ్‌లోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ టెండన్లకు తీవ్ర గాయం కావడంతో పాటు భుజం ఎముకలో ఫ్రాక్చర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని ఆసుపత్రి ప్రకటించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యంగా కోలుకుంటున్నారని, కొంత విశ్రాంతి అనంతరం ప్రత్యేక రిహాబిలిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైద్యులు తెలిపారు. సుమారు నాలుగు నెలల్లో భుజం పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశం ఉందని ఆరోగ్య బులెటిన్‌లో పేర్కొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

### పాత పెన్షన్ విధానం ఎంచుకునేందుకు మరో చాన్స్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జిఒ ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సిపిఎస్ నుంచి ఓపిఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జిఒ జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపిఎస్ లేదా సిపిఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా సిపిఎస్ పరిధిలోనే కొనసాగుతారని జిఒలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జిఒ ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

## భార్యను వేధించిన కేసులో భర్తకు యేడాది జైలు

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం భరత్‌నగర్‌కు చెందిన వై.సిమోన్ సుదర్శన్(32)కు చిత్తూరు 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. చిత్తూరు భరత్‌నగర్‌లో మౌనిక ప్రియదర్శిని తన భర్త వై.సిమోన్ సుదర్శన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు బెదిరిస్తున్నారని 28 నవంబర్ 2020న చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి మహిళా స్టేషన్ ఎస్ఐ నిత్యానందం పిళ్ళై ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు పూర్వపరాలను విచారించిన జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. సుదర్శన్‌పై నేరం రుజువైందని, ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఎ2 నుండి ఎ8 వరకు వున్న నిందితులను కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది.

## 'సర్' గడువును 3నెలలు పొడిగించాలి

- అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేసే వరకు వదిలిపెట్టేది లేదు
- రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌కు సిపిఐ వినతి

**సచివాలయం, జులై 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనగుతున్న 'సర్' ప్రక్రియ గడువును తక్షణమే మరో మూడు నెలల పాటు పొడిగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించే బాధ్యతను ఎన్నికల కమీషన్ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జగదీష్ కలసి క్షేత్రస్థాయిలో అక్రమాలు, ఇబ్బందులపై సుదీర్ఘంగా వివరించి. సవివరమైన వినతి పత్రాన్ని సమర్పించారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు విషయంలో కమీషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించకూ దదని, తక్షణమే స్పందించిన నిర్థష్టమైన కాల వ్యవధితో గడువును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి

- 'సర్' ప్రక్రియ మరింత వేగవంతం
- కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్



'సర్' ప్రక్రియను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** నిర్ధేశించిన గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సోమవారం చిత్తూరు నగర పరిధిలోని దొడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ 14, గాయత్రినగర్ పోలింగ్ స్టేషన్ 132ల్లో 'సర్' ప్రక్రియ ఎలా సాగుతుందనే విషయంపై బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటా సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘ కార్యదర్శి జిల్లాలో 'సర్' ప్రక్రియ ఎలా జరుగుతున్నది! ఎంత మేరకు పూర్తయ్యింది! పెండింగ్‌లో వున్న దరఖాస్తుల స్థితి! ఎమైనా ఫిర్యాదులు వున్నాయా! తదితర అంశాలపై పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం ఎస్ఎస్ఆర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం సుమారు 40వేల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, వీటిలో కొన్నింటిని సత్వరం పరిష్కరించ గలుగుతామని, మరికొన్నింటిని అవసరమైన ధృవీకరణ అనంతరం నిర్ణయం తీసకుంటామన్నారు. జిల్లాలో ఎవరికైనా 'సర్' దరఖాస్తులకు సంబంధిచి సమస్యలు, సందేహాలు వుంటే బిఎల్ఓలను సంప్రదించాలని, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

సర్ ప్రక్రియను పారదర్శకంగా, కచ్చిత త్వంగా నిర్వహిస్తున్నామని, 2002 జాబితాలో ఓటు లేకపోయినా, ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి ఎన్యుమరేషన్ ఫారంతో పాటు బిఎల్ఓలకు అందించాలన్నారు. ఈ నెల 21న ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అందులో పేర్లు లేకపోయినా ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి బిఎల్ఓలకు అందజేస్తే తుది ఓటరు జాబితాలో పేరును చేర్చడం జరుగుతుందన్నారు. 'సర్'లో అర్హుల ఓట్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు.

ఈ కార్యక్రమంలో అర్డీఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఐరాల, చిత్తూరు నగర తహసిల్దారు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసులో అప్రూవర్‌గా సిఐ స్నేహితుడు సురేష్



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ప్రైవేటు వ్యక్తి అయిన సురేష్ పాత్రే ప్రధానంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టుకు సమర్పించిన మెమోలో సైతం సిట్ అధికారులు సురేష్‌ను నిందితుడిగా చేర్చారు. అతన్ని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు చూపించలేదు. ఇప్పటికే పలు పర్యాయాలు సురేష్‌ను కృష్ణలంకకు పోలీసులు పిలిపించి విచారించారు. సోమవారం కూడా పోలీసులు అతడిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సిట్ అధికారుల విచారణలో సురేష్ అనేక కీలక విషయాలు వెల్లడించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సురేష్ ఈ కేసులో అప్రూవర్‌గా మారే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాల సమాచారం. సురేష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సిట్ అధికారులు కృష్ణలంక పిఎస్ సిబ్బందిని విచారిస్తున్నారు. అయితే, తాము విచారించినప్పుడు తమకేమీ తెలియదని కొందరు సిబ్బంది తప్పించుకునే ప్రయత్నం చేసారంటున్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో తాము డ్యూటీలో లేమని, బయట ఉన్నామని మరికొందరు చెప్పారు. దీంతో అధికారులు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. స్టేషన్ సిబ్బంది కాల్ డేటా రికార్డులను (సిడిఆర్) సేకరించి విశ్లేషిస్తున్నారు. అయితే ఈ కేసులో సాయికృష్ణపై థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని, అయితే గట్టిగా లాఠీతో కొట్టిన సందర్భంలో అతను ఎదురు తిరిగి, ఒక బాలిక విషయంలో సిఐ నాగరాజు బూటు కాలితో అతని మర్మాంగాలపై తన్నారని, దాంతో అతను బిగ్గరగా కేకలు వేస్తుంటే అక్కడ వదిలివెళ్ళారని, తరువాత సాయికృష్ణ చనిపోయాడని కొందరు చెప్పినట్లు సమాచారం. అయితే సిట్ అధికారులు ఈ అంశాన్ని ధ్రువీకరించలేదు. అయితే పోలీసులు అదుపులో ఉన్న సురేష్ సిఐ నాగరాజుకు అత్యంత సన్నిహితుడు అని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సురేష్ చెప్పిందే వేదంగా సాగేది. స్టేషన్‌లో అనధికారికంగా పెత్తనం అంతా అతడే చేసేవాడని విచారణలో తేలింది. ఈ సాన్నిహిత్యంతోనే సాయికృష్ణ వ్యవహారంలో సురేష్‌కు అంతా తెలుసని దర్యాప్తులో బయటపడింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతడు మృతి చెందడం, ఆ తర్వాత శవాన్ని మాయం చేయడం వరకు ప్రతి అంశంలో సురేష్‌కు ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## బుచ్చి పోలీస్‌స్టేషన్‌పై వేటు

- సిఐ మాతంగి శ్రీనివాసరావు రేంజి విఆర్‌కి
- ఎస్ఐ సతోష్‌రెడ్డి జిల్లాలో విఆర్‌కి
- 21 మంది కానిస్టేబుల్స్ పై బదలీ వేటు




**బుచ్చి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** జిల్లా చరిత్రలో ఇంత వరకు ఎప్పుడు జరగని విధంగా ఒక పోలీస్‌స్టేషన్ మొత్తంపై వేటు పడిన సంఘటన బుచ్చి పోలీస్‌స్టేషన్‌కి జరిగింది. ఇటీవల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి హత్య కాగా దానిని తప్పుదోవ పట్టించినందుకు పర్యావసనం ఇది. జిల్లా ఎస్‌పి అజితా వేజండ్ల నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. సూపర్ ఎస్‌పి అంటు ప్రశంసిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి చెందిన రోజు మినగల్లుకి వెళ్లిన ప్రతి ఒక్కరికి మృతదేహాన్ని చూస్తేనే అర్థం అవుతుంది ఇది ముమ్మాటికి హత్యేనని కాని కుటుంబ సభ్యులు మౌనం అందర్ని కట్టి పడవేసింది. మౌనం వెనుక ఆంతర్యం అర్థంకాక అందరి మనస్సులు బరువెక్కాయి. చేతికి గ్లౌజులు వేసుకుని శ్రీహరి బాడిమొత్తాని పరిశీలించిన సిఐకి అర్థమైనా విచారణ చేపట్టకుండా గుండెపోటు అంటు మౌనం వహించడంతో కేసు తప్పుదోవ పట్టింది. మృతుడు శ్రీహరి మొదటి భార్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడంతో జిల్లా ఎస్‌పి అజెండ్ల శ్రీకేసుపై దృష్టిపెట్టారు. డిఎస్‌పి ఘంటా శ్రీనివాస రావుకి కేసును విచారించమని ఆదేశించడంతో అసలు కథ బయట పడింది. సొంత బావమరిదే మరో ఇద్దరితో కలిసి ఇంతటి ఘాతకానికి ఒడి కట్టాడని, ఇది ముమ్మాటికి హత్యేనని విచారణలో తేలడంతో జిల్లా ఎస్‌పి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ మాతంగి శ్రీనివాసరావుని రేంజి విఆర్‌కి బదలీ చేశారు. అలాగే ఎస్ఐ సంతోష్‌రెడ్డిని జిల్లాలో విఆర్‌లో ఉంచారు. 21 మంది కానిస్టేబుల్స్‌ని బదలీ చేసి జిల్లా ఎస్‌పి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీంతో పోలీస్ శాఖ ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

## ఎఇఇ నియామకాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు లేదు

### ఎపిట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పవర్ యుటిలిటీస్‌లో 629కు పైగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి 2026 జూన్ 25న విడుదల చేసిన నియామక నోటిఫికేషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తున్నదని ఎపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పిస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుల గడువు పొడిగింపుపై సామాజిక మాధ్యమాలు, ఇతర అనధికారిక వేదికల్లో ప్రచారంలో ఉన్న వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వసించ వద్దని ఆయన అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. నియామక నోటిఫికేషన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని, దరఖాస్తుల సమర్పణకు 2026 జులై 20 చివరి తేదీగా నిర్ణయించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ గడువులో ఎలాంటి మార్పు ఉండదని, దరఖాస్తుల స్వీకరణకు అదనపు గడువు ఇవ్వబడదని స్పష్టం చేశారు. చివరి రోజుల్లో సాంకేతిక రద్దీ లేదా ఇతర కారణాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ఇంకా దరఖాస్తు చేయని అర్హులైన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించి, దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్ష కూడా నోటిఫికేషన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే 2026 ఆగస్టు 22 నుంచి ప్రారంభమవుతుందని, పరీక్ష తేదీల్లో కూడా ఎలాంటి మార్పు ఉండదని సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షల షెడ్యూల్‌పై ఎలాంటి సందేహాలకు తావులేకుండా తమ సన్నాహాలను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలని సూచించారు. నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారం సంబంధిత వెబ్‌సైట్ ద్వారానే విడుదల చేయబడుతుందని, అందువల్ల అభ్యర్థులు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు. సామాజిక మాధ్యమాలు లేదా ఇతర అనధికారిక వేదికల ద్వారా ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారం, వదంతులు లేదా నిర్ధారణలేని వార్తలను నమ్మి అయోమయానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నోటిఫికేషన్‌లో పేర్కొన్న షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, సూచనలు, నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ చంద్ కోరారు.

## కరాటే పోటీల్లో సత్యవేడు విజేతలు 8 మందికి 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్




**సత్యవేడు, జులై 13 ప్రభాతవార్త:** గోవా బోసోటర్ పంచాయతీ కమ్యూనిటీ హాలులో 2026 నేషనల్ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ ఆధ్వర్యంలో జులై 11,12 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే వీరులు 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆంధ్రప్రదేశ్ కరాటే మిషన్ సత్యవేడుకు చెందిన జి.భువనేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ కోచ్ కిరణ్ పర్యవేక్షణలో జాతీయ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ నిర్వహించారు. కరాటే కాంపిటీషన్‌లో 320 ఈవెంట్లు జరగగా ఆంధ్రప్రదేశ్ 33 బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలుసాధించి విజేతలుగా కరాటే వీరులు అదరగొట్టారు. ఈ నేపథ్యంలోనే సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే విజేతలు కట్ట, కుమతే విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ క్రమంలో అండర్–14 బాలికల విభాగంలో టీం కట్ట విభాగంలో విజేతలుగా లక్షిక, ప్రియ, నాజియా భాను గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అండర్–14 బాలుర టీమ్ కట్ట విభాగంలో విజేతలుగా ఆరిఫ్ బాబ, మోహిత్, రిత్విక్ యాదవ్ పొంకం గోల్డ్ మెడల్ సాధించారు. సీనియర్ కేటగిరి అండర్–17 ఇయర్స్ పవిత్ర వ్యక్తిగతంగా గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అలాగే అండర్–14 బాలుర విభాగం కట్టాలో ఆరిఫ్ బాబా గోల్డ్ మెడల్ మోహిత్ గోల్డ్ మెడల్, రిత్విక్ యాదవ్, సిల్వర్ మెడల్ సాధించగా వీరిని అందరూ అభినందించారు.

వార్త

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

- బెర్ట్రండ్ రస్సెల్


# కరిగిపోతున్న ఖరీఫ్!

తన వ్యవసాయ క్షేత్రంలో విత్తు నాటితే, అది మొలకెత్తి మొక్క ఉనికిని బాహ్య ప్రపంచానికి కనబడేటట్లు పెరుగుతున్న కొద్దీ రైతులో సంతోషం వెల్లివిరుస్తుంది. అది పెరిగే కొద్దీ దాని వైభవం చూస్తూ పొంగిపోతాడు. కానీ ఎల్‌నినో పుణ్యమా అని దేశవ్యాప్త రైతుల్లో అలాంటిదేమీ కనబడుట లేదు. వర్షం వస్తుందోరాదో తెలియని ఆందోళనతో రైతు దిగాలు పడిపోయాడు. ఇతరత్రా గాలివానలు, తుఫాను బీభత్సాలవల్ల కలిగే భయోత్పాతం ఒకలా ఉంటే ఇప్పుడు చూస్తున్న ఎల్‌నినో క్షణక్షణం రైతును కృంగదీస్తోంది. ఓ రెండు, మూడుమాసాల పాటుసూపర్ ఎల్‌నినో పేరిట మరెన్నో కష్టనష్టాలు తెచ్చిపెట్టేలాంటి సంకేతాలే ఉన్నాయి. వర్షాలు కురుస్తాయనుకున్న మృగశిర, ఆరుద్ర కార్తెల్లో తగిన వర్షం పడలేదు. ప్రస్తుతం పునర్వసు కార్తె కూడా శుభసంకేతాలను చూపడం లేదు. ఇదిగో వచ్చేసాయనుకున్న రుతుపవనాలు కూడా బలహీనపడటంతో వ్యవసాయదారుని నెత్తిమీద బండపడినట్లే ఉంది. వస్తాయనుకున్న వర్షాలు రాలేదని సాగు మానాలా, రేపెపుడో వర్షాలు కురుస్తాయిలే అని ధైర్యంతో ముందుకెళ్లాలా అన్న మీమాంసల మధ్య కొందరు రైతులు ఒకడుగు ముందుకే వేయాలనినిర్ణయించారు. కానీ నారు మొలవక కురిసే చినుకును ధ్యానిస్తూ రైతు ఆకాశం కేసి చూస్తున్నాడు. పశ్చిమ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో ఎల్‌నినో ప్రభావం బాగాబలపడుతోంది. ప్రపంచ వాతావరణ సంస్థ తాజా హెచ్చరికల ప్రకారం ఈ జులై నెల నుంచి సెప్టెంబరుల మధ్య ఎల్‌నినో బలీయంగా ప్రభావం చూపిస్తుంది. ఈతరుణంలో వ్యవసాయం, తాగునీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యం, విద్యుత్ వినియోగం వంటి అన్ని రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ముందు ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. ప్రస్తుతమైతే ఎల్‌నినో పరిస్థితులు బలపడుతున్నాయనే చెప్పాలి. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో వాతావరణం ఒకేసారివస్తే మంచిదేనని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కానీ ఒకదానికొకటి ముడిపడని సందర్భాలు అందుకే రైతు దిక్కుతోచక సతమతమవుతున్నాడు. ఎల్‌నినో ఎప్పుడెంత స్థాయిలో ప్రభావం చూపినా నవంబర్ నెలదాక వ్యవసాయం వంటి అన్ని రంగాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఏదైనా వ్యవసాయరంగానికి ఎల్‌నినో సవాలే. సాధారణంగా బలహీన వాతావరణ పరిస్థితులు చూడొచ్చు. ప్రధానంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు, వర్షాధార పంటలుగా సాగు చేసే రైతులకు దినదినగండంలా ఉంటుంది. ఒకప్పుడు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుందనే అనుకునేవారం. కానీ ఇప్పుడు తీవ్ర ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు, నీటి కొరత ఆరోగ్య సమస్యలు, ఆహార కొరత, వీటన్నిటి కారణంగా విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. వర్షపాతం ఏమాత్రం తగ్గినా పండే పంటలపై ప్రభావం చూపుతోందన్న గాభరాతో ప్రభుత్వం రైతులకు అనేక అంశాలలో జాగ్రత్తలు పాటించమని చెబుతూనే ఉంది. భారత్‌లో వ్యవసాయధారిత దేశం కనుక రుతుపవనాలపై సాగు ఆధారపడి ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలుతగ్గితే సాగునీటి ప్రాజెక్టులపై ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం అధికమవడం వంటి తీవ్ర పరిణామాలు కలుగుతాయి. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించుకోవడమొక్కటే మనకుశక్యం. జాగ్రత్తలు పాటించి ముందుచూపుతో వ్యవహరించాలి. అప్పుడే సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడగలం. తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి చాలారోజులైంది. ఎందరో రైతులు విత్తులు నాటినా మొలకల్లేక నిరాశతో ఎదురుచూస్తున్నారు. సాగు పనులు లేక వ్యవసాయ కూలీల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. భూగర్భజలాలు అడుగంటి వివిధ పంటలనాట్లు కోసం సిద్ధం చేస్తున్న విత్తనాలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఎన్నో జిల్లాలలో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. గ్రామీణ వ్యవస్థ బాగా దెబ్బతింది. ఈ విషయాలపై భారత్ వాతావరణ సంస్థ 'సెంట్రల్ వాటర్ కమిషన్ తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలపై కూడా. పెద్ద ప్రమాదం జరుగుతుంది. నైరుతి రుతుపవనాల బలహీనపడడంతో వర్షపాతం లోటు ఏర్పడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి ప్రధాన పంట. అదీ వ్యవసాధారమే. ఆంధ్రప్రదేశ్, గోదావరి డెల్టాలో వరిసాగు, రాయలసీమలో వర్షాధార పంటలు. ఉత్తరాంధ్రాలో వరి, జీడి, చెరకు, ఉద్యానపంటలు విస్తృతంగా సాగుచేస్తారు. బంగాళాఖాతంలో తుఫానుల ఒత్తిడి పెరిగి భారీ వర్షాలు కురిస్తే అవి కూడా వ్యవసాయాన్ని దెబ్బతీస్తాయి. పంట నష్టాలు రైతును ఇబ్బంది పెడ్తాయి. సాగ కష్టనష్టాలు తప్పవు. తెలంగాణలో ఇప్పటికే 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉంది. జూన్, జులై నెలలో సగటున 22 శాతం వర్షపాతం లోటు ఉంది కొన్ని ప్రాంతాల్లో రెట్టింపులోటు ఉంది. వర్షాలు ఆలస్యమయ్యే కొద్దీ మళ్లీ నాట్లు వేయాలి. దాంతో మళ్లీ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతాయి. రైతుకు ప్రభుత్వాలు ఎన్ని భరోసాలు కల్పించినా ఎల్‌నినో కల్పించే కష్టాల నుంచి నష్టాల తేరుకోగలడోలేడో. జులైలో ఉపందుకుంటాయనుకున్న వ్యవసాయ పనులు ఎక్కడిక క్కడ నిలిచిపోవడం విచారకరం. ఈ యేడాది ఇలాంటి వాతావరణ పరిస్థితుల రీత్యా గత యేడాది ఖరీఫ్ కన్నా సగం విస్తీర్ణంలోనే వరి సాగు జరిగే అవకాశం ఉంది. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం తప్ప రైతుకు వేరే గత్యంతరం లేదు.



విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.

డబ్ల్యు.ఎమర్సన్



అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూపోవాలి.

శ్రీ రమణ మహర్షి

# ప్రజావాక్కు



### మోడీతో భయమా!

టీవీలకు రాజకీయాలు ఉండరాదు. స్వతంత్రంగా పని చేయాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలి. ఆ మధ్య తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని అన్ని ఛానల్స్ ప్రతిరోజు అదేచర్చలు పెట్టి విసుగుపుట్టించాయి. కొన్ని రోజులు గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం చర్చలు మీద చర్చలు. మరి కొన్నాళ్ళు ప్రతి పక్షం వాళ్ళ అటవీభూములు ఆక్రమణమీద చర్చలు. ఒకవారం నుండి చర్చోపచర్చలు జరుగుతున్నాయి. అయితే అయోధ్య బాలరామాలయంలో హుండీలోకి చేరాల్సిన వేలకోట్ల రూపాయలుదొంగతనం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు హుండీ డబ్బులు లెక్కపెట్టేవారికి జేబు లు లేనీ చొక్కాలు వేసుకరమ్మని ఆదేశించారట. తిరుపతి లోఅక్రమాలు జరిగాయని తెగచర్చలు పెట్టినటీవీ ఛానల్స్ వారు, అయోధ్య రామాలయంలోజరిగినదొంగతనం మీదఎందుకు మౌనం వహిస్తున్నాయి? మోడీ తాట తీస్తాడని భయమా?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### దివ్యాంగుల దైవ దర్శనం ఏర్పాట్లు?

దివ్యాంగులకు వివిధ దేవాలయాలలో దైవదర్శనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలి. ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలి. దేవాలయాలలో వికలాంగుల దైవదర్శనం కోసం ప్రత్యేకమైన క్యూ ఏర్పాటు చేయాలి. సత్రాలలో ఉచిత సౌకర్యం కల్పించాలి. ఉచిత లడ్డు ఇవ్వాలి. దేవాలయాల వద్ద వికలాంగుల దైవదర్శనం వసతి కొరకు ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటుచేయాలి. స్వచ్ఛంద సంస్థలు. యువజనసంఘాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వికలాంగుల దైవదర్శనం కోసం ఆర్థికసహాయం చేయాలి. వికలాంగుల దైవ దర్శనం కోసం ఒక ప్రత్యేకమైన ట్రస్టును ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి, వెంకటేశ్వర్లు, నెక్కొండ

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రిమీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ, హైదరాబాద్

### పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలోఅయితేఅసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలో యధేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాల వేడిమి 30 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదంఉంది. పాశ్చాత్యదేశాలలో సూర్యకిరణాల వేడిమి, తీక్షణత 30-32 డిగ్రీల సెల్సియస్‌కు మించదు కాబట్టి అక్కడి ప్రజలు చిన్న దుస్తులు ధరించినా వారికి పెద్దప్రమాదం ఉండదు. ఎటొచ్చీ ఉష్ణమండల దేశమైన భారత్‌లో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలి.

- కె. వెంకట్, సికింద్రాబాద్

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈకోర్టుకేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటేనే భర్తీచేసి కేసులు వేగవంతం చేయాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### వ్యవస్థలలో మార్పులు రావాలి

మానవ సమాజంలో సాంకేతికత పెరుగుతున్న క్రమంలో దానికనుగుణంగా మనం నిరంతరంఅభివృద్ధిచెందుతూ ముందుకు సాగితేనే సమాజంలో నిలదొక్కుకోగలం. కావున సాంకేతికత వినియోగం పెంచుకుని ఆర్థికంగా ఎదగాలి. గ్రామ స్థాయి నుంచే సాంకేతికతను అభివృద్ధిపరచాలి. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'పచ్చని' ప్రయాణమే ప్రగతికి మార్గం

*సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరుగా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన, పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవసరంగా గుర్తించి, సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు అసలైన పునాది. మనం ఈ రోజు తీసుకునే ఒక్కో హరిత నిర్ణయం, రేపటి స్వచ్ఛమైన గాలికి ప్రాణ వాయువుగా మారుతుందని విస్మరించరాదు.*

వనకల్ల వీరప్ప

మానవజాతి సాధిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి ఒకవైపు జీవన ప్రమాణాలను అపారంగా పెంచుతుంటే, మరోవైపు ప్రకృతి సమతుల్యతను ఘోరంగా దెబ్బతీస్తోంది. భూగోళాన్ని పట్టిపీడిస్తున్న తీవ్ర వాతావరణ మార్పులు, శరవేగంగా పెరుగుతున్న కార్బన్ ఉద్గారాల నేపథ్యంలో పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. కేవలం ఇంధన ధరల భారాన్ని తగ్గించుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని, కాలుష్యరహిత పచ్చని వాతావరణాన్ని అందించడానికి విద్యుత్తు వాహనాలవిప్లవం ఒక చారిత్రక చైతన్యంగా నిలిచింది. సాంప్రదాయ పెట్రోలు ద్విచక్ర వాహనాల స్థానాన్ని పర్యావరణ అనుకూల ఈవీలు ఆక్రమిస్తున్న ప్రస్తుత తరుణంలో, తెలుగు రాష్ట్రాలు జాతీయ సగటును మించి ఈ హరిత మార్పుకు విప్లవాత్మకంగా స్వాగతం పలుకుతుండటం అభినందనీయం, సర్వత్రా ఆదర్శనీయం. ప్రస్తుత ఆధునిక కాలంలో నిత్యం పెరుగుతున్న ఇంధన ధరలు ఒకవైపు మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంటే, మరోవైపు వాహనాల పొగ వల్ల నగరాల్లో వాయుకాలుష్యం జీవన ప్రమాణాలను తీవ్రంగా క్షీణింపజేస్తోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు మహానగరాల రోడ్లపై కిలోమీటర్ల మేరసాగే వాహనాల రద్దీ, అవి వదిలే విషపూరిత వాయువులు వాతావరణాన్ని నరకప్రాయంగా మారుస్తున్నాయి. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు కాలుష్యం కారణంగా నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈపర్యావరణ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపించగల ఏకైక ప్రత్యామ్నాయ మార్గం విద్యుత్తు రవాణా వ్యవస్థ మాత్రమేనని ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. ఒకప్పుడు విద్యుత్తు స్కూటర్లను కేవలం ఒక విలాసవంతమైన ఆప్షన్‌గా లేదా సరికొత్త సాంకేతిక ప్రయోగంగా చూసిన వినియోగదారులు, నేడు పర్యావరణ హితాన్ని, సుదీర్ఘకాలంలో లభించే అత్యంత తక్కువ నిర్వహణ వ్యయ ప్రయోజనాలను స్పష్టంగా గుర్తిస్తున్నారు. పెట్రోలు ధరలు లీటరుకు వంద రూపాయలు దాటి సామాన్యుడి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్న తరుణంలో, ఈవీలు ఒక గొప్పవరంగా మారాయి. కేవలం పెట్రోలు ఖర్చులను ఆదా చేయడమే కాకుండా, శబ్ద కాలుష్యం, పొగ లేని స్వచ్ఛమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ఈవీల కొనుగోలుపై మక్కువ చూపుతున్నారు. ఇది కేవలం ఒకవాహనం మార్పిడి అనే ఆర్థికపరమైన ఎంపిక మాత్రమే కాదు, పర్యావరణ పరిరక్షణలో తాము కూడా నేరుగా భాగస్వాములం కావాలనే సామాజిక బాధ్యతతో కూడిన గొప్పఅడుగుగా భావించాలి. పర్యావరణ స్పృహతో హరిత రవాణాను అలవర్చుకోవడంలో దేశంలోని మిగతా ప్రాంతాల కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ముందువరుసలో నిలవడం మన తెలుగు ప్రజల ఆలోచనా విధానానికి నిలువెత్తు అద్దం పడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరపు అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా ద్విచక్ర విద్యుత్తు వాహనాల వ్యాప్తి సగటున 7.8 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 9.3శాతంగాను, తెలంగాణలో ఏకంగా 10.2శాతంగాను నమోదైంది. ఈ గణాంకాలు తెలుగు ప్రజలలో పర్యావరణహిత ఇంధన వనరుల పట్ల పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాలుష్య ప్రభావం ఎక్కువగాఉండే హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి పెద్ద నగరాల్లోనే కాకుండా, చిన్న పట్టణాల్లో సైతం ఈవీల వాటా పెరుగుతుండటం అత్యంత సానుకూల



పరిణామం. తెలంగాణలోని పెద్ద నగరాలలో ఈవీల వాటా 12శాతానికి చేరగా, రెండో శ్రేణినగరాలలో 11శాతం, చిన్న పట్టణాలలో కూడా 9.2శాతం మార్కెట్ వాటాను సాధించడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఇదే విధమైన పర్యావరణ చైతన్యం ప్రతిబింబిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఏపీలోని రెండో శ్రేణి నగరాల్లో ఈవీల ఆదరణ 7.5శాతం నుండి 10.2శాతానికి పెరగగా, మూడోశ్రేణి నగరాల్లో 6.2 శాతం నుండి 8.7శాతానికి వృద్ధిచెందింది. ఈ అద్భుతమైన వృద్ధిరేటు పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ, తృతీయశ్రేణి పట్టణ స్థాయికి కూడా శరవేగంగా విస్తరిస్తోందని స్పష్టం చేస్తోంది. పర్యావరణానికి మేలుచేసే వాహనాలు అందరికీ చేరాలంటే, వాటి ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. పర్యావరణ హితం ఎంత ముఖ్యమైనదైనా, సామాన్యుడికి ఆర్థిక లభ్యత లేనిదే ఏవిప్లవమైనా అర్థాంతరంగా ఆగిపోకతప్పదు. ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ పెట్రోలు స్కూటర్లకు, విద్యుత్తు స్కూటర్లకు మధ్య ఉన్నధరల వ్యత్యాసం క్రమంగా తగ్గుతుండటం శుభపరిణామం. ఈవీలలో అత్యంత కీలకమైన'బ్యాటరీ' తయారీ ఖర్చులు దేశీయంగా తగ్గడం, విడిభాగాలు స్థానికంగానే లభించడం ఇందుకు ప్రధాన కారణం. భవిష్యత్తులో బ్యాటరీ సాంకేతికత మరింత మెరుగై, స్థానిక ఉత్పత్తి పెరిగితే, పెట్రోలు స్కూటర్లతో సమానమైన ధరలోనే పర్యా వరణ అనుకూల ఈవీలు లభించే రోజులు ఎంతో దూరం లో లేవు. అయితే, స్కూటర్ల విభాగంలో కనిపిస్తున్న ఈ హరిత వేగం 'విద్యుత్తు మోటార్ సైకిళ్లు' (ఇ బైక్స్)విభాగంలో ఇంకా వెనకబడే ఉంది. మార్కెట్లో పెద్ద కంపెనీలు మొదట ఇస్కూటర్లనే అందించడం వల్ల, బైక్ ప్రియులు ఇంకా సాంప్రదాయ ఇంధన వాహనాలపైనే ఆధారపడుతున్నారు. మన దేశంలో, ముఖ్యంగా గ్రామీణ అర్ధ పట్టణ ప్రాంతాలలో బైకుల వినియోగం అత్యధికం. ఎక్కువ మైలేజీ, పటిష్టమైన బాడీ, నమ్మకమైన సాంకేతికతతోకూడిన ఇబైకులు అందుబాటులోకి వస్తే, కాలుష్యకారక బైకుల శకం కూడా ముగిసిపో తుంది. ఈవిషయంలో వాహన తయారీ కంపెనీలు పరిశోధనలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హరిత రవాణావైపు ప్రజలు పూర్తిగా మారడానికి మార్కెట్లో కొన్ని సహజమైన అపోహలు, మౌలిక సవాళ్లు అడ్డుపడుతున్నాయి. బ్యాటరీ మన్నిక ఎన్ని రోజులు ఉంటుంది? ఒకే చార్జింగ్‌పై వచ్చే అసలు మైలేజీ ఎం? దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు లభించే చార్జింగ్ మౌలిక వసతులు, రీసేల్ విలువపై వినియోగదారులలో అనేక సందేహాలున్నాయి. పర్యావరణ మార్పును కాంక్షించే కొనుగోలుదారులకు డీలర్లు, తయారీ సంస్థలుస్పష్టమైన వారంటీలు, బ్యాటరీ సామర్థ్యంపై పూర్తి నమ్మకాన్ని కలిగించాలి. ఏ థర్ ఎనర్జీ వంటి ప్రముఖ సంస్థలు ఈదిశగా వినియోగదారులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ మార్కెట్లో విశ్వసనీయతను పెంచుతున్నాయి. ప్రభుత్వాలు కూడా చార్జింగ్ స్టేషన్ల గ్రిడ్‌ను దేశవ్యాప్తంగా పెంచడానికిరాయితీలు ఇవ్వాలి. భారత ప్రభుత్వం దేశంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు 2030 నాటికి కొత్త వాహనాల విక్రయాలలో కనీసం 30శాతం వాటాను విద్యుత్తు వాహనాలుగా మార్చాలని ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ హరిత లక్ష్య సాధన దిశగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, పటిష్టమైన చార్జింగ్ వ్యవస్థ, సులభమైన సర్వీసింగ్ మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరుగా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన, పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవసరంగా గుర్తించి, సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు అసలైన పునాది. మనం ఈ రోజు తీసుకునే ఒక్కో హరిత నిర్ణయం, రేపటి స్వచ్ఛమైన గాలికి ప్రాణ వాయువుగా మారుతుందని విస్మరించరాదు. ●

# న్యాయవ్యవస్థపై విశ్వాసమే ప్రజాస్వామ్యానికి పునాది

తరిగోపుల నారాయణస్వామి

సుప్రీంకోర్టు ఇచ్చే ప్రతి తీర్పు చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత అనే సూత్రాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థపై విశ్వాసం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధ న్యాయపరమైన అవకాశాలను వినియోగించడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగమే. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు కేవలం ఒక పరీక్షకు సంబంధించినవి మాత్రమే కావు. అవి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ, విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల సేవా భద్రత, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా పరిపాలన వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల ఈ అంశాన్ని ఒక ఉద్యోగ వివాదంగా కాకుండా జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యా విధాన అంశంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ విద్యావ్యవస్థతో ముడిపడి ఉన్న ఈ అంశంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి చట్టబద్ధ అవకాశంపై సమాజానికి అవగాహన కల్పించడం కూడా ఒక ప్రజాస్వామ్య బాధ్యత. విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని నిరంతరం అభివృద్ధి చేయడం కూడా కాలానుగుణ అవసరమే. అయితే అదే సమయంలో టెట్ విధానం అమల్లోకి రాకముందే అప్పటి చట్టాలు, నిబంధనలు, అర్హతల ప్రకారం నియమితులై, అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితిని కూడా ప్రజాస్వామ్య దృష్టితో పరిశీలించాలి. విద్యా సంస్కరణలు ఎంత ముఖ్యమో, వాటి అమలులో న్యాయసముచిత, సమానత్వం, పరిపాలనా సౌలభ్యం, మానవీయ విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. క్యూరేటివ్ పిటిషన్ అనేది సాధారణ అప్పీల్ కాదు. సాధారణ రివ్యూ పిటిషన్ కూడా కాదు. అత్యంత అరుదైన పరిస్థితుల్లో, న్యాయం పూర్తిగా జరిగిందా లేదా రాజ్యాంగపరమైన ఏదైనా అసాధారణ అంశం పునఃపరిశీలనకు అర్హమా అనే ప్రశ్నను పరిశీలించేందుకు భారత న్యాయవ్యవస్థ గుర్తించిన చివరి రాజ్యాంగపరమైన అవకాశం. అందువల్ల క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయడం న్యాయవ్యవస్థను వ్యతిరేకించడం కాదు, రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ మార్గాన్ని గౌరవప్రదంగా వినియోగించడమే. ప్రజాస్వామ్యంలో చట్టం, న్యాయం, మానవీయ విలువలు పరస్పర విరుద్ధమైనవి కావు. అవి ఒకదానికొకటి పూరకాలు. చట్టం రూపొందించే సమయంలో ప్రతిభవిష్యత్ పరిస్థితిని ముందుగానే ఊహించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. విద్యావిధానాలు మారుతాయి. అర్హతలు మారుతాయి. కానీ ఇప్పటికే చట్టబద్ధంగా నియమితులై సేవలందిస్తున్న ఉద్యోగుల పరిస్థితి కూడా ఒక సామాజిక వాస్తవం. అలాంటి సందర్భాల్లో మార్పు కాలం, దశలవారీ అమలు, శిక్షణ, ప్రత్యేక విధానాలు వంటి అంశాలను పరిశీలించడం ప్రజా విధానాల పరిపక్వతకు సంకేతం. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ అంశంలో కూడా చర్చ జరగాల్సింది న్యాయస్థానాన్ని విమర్శించడంకాదు, రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై. విద్యా ప్రమాణాలను కాపాడుతూ, సేవలో ఉన్న ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన ఆందోళనలను సమతుల్యంగా పరిష్కరించేమార్గాలను అన్వేషించడంప్రభుత్వం, విధాన రూపకర్తలు, న్యాయ నిపుణులు, విద్యావేత్తల ఉమ్మడి బాధ్యత. అలాంటి సందర్భాల్లో క్యూరేటివ్‌పిటిషన్ వంటి రాజ్యాంగపరమైన అవకాశాలను పరిశీలించడం ప్రజాస్వామ్య బద్ధమైన, చట్టబద్ధమైన చర్యగా పరిగణించవచ్చు. అది ఏ తీర్పును ధిక్కరించడంకాదు, రాజ్యాంగం చూపిన చివరి న్యాయమార్గాన్ని వినియోగించాలనే విజ్ఞప్తిమాత్రమే. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేశిల్పులు. వారి అనుభవాన్ని గౌరవిస్తూ, విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే సమతుల్య పరిష్కారాలను అన్వేషించడం భారత ప్రజాస్వామ్య పరిపక్వతకు నిదర్శనం అవుతుంది. భారత విద్యావ్యవస్థ బలోపేతంకావడం, రాజ్యాంగంపై ప్రజలవిశ్వాసం మరింత పెరగడం, చట్టం మానవీయ విలువల మధ్య సమతుల్యత సాధించడం. అదే నిజమైన ప్రజాస్వామ్య విజయం. అదే భారత రాజ్యాంగస్ఫూర్తి. అదే లక్షలాది మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజం ఆశించే న్యాయం. ●

# శ్వేతసౌధం మసకబారుతున్న దృశ్యం



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచానికి మకుటాయమానమైన ఆ శ్వేత సౌధం కూలుతున్న దృశ్యం గల్ఫ్‌లో స్పష్టంగా గోచరిస్తోంది. ఇరాన్ యుద్ధంలో అపజయంతోబాటు, గల్ఫ్ నుంచి ఇరవై సైనిక స్థావరాలను ఖాళీ చేయడంతో అమెరికా పతనం ప్రారంభం కాబోతోంది. దాదాపు అర్థ శతాబ్దంగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతం అమెరికా సైనిక వ్యూహానికి కేంద్రంగా ఉంది. బహ్రెయిన్, ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ ఇంకా ఇతర ప్రాంతాలలో ఉన్న అరబ్ దేశాల్లో భారీ అమెరికా స్థావరాలు ఉన్నాయి. చమురు నౌకల రవాణా మార్గాలనునాటి కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ దాడి చేయకుండా రక్షించే నెపంతో అమెరికా సుమారు ఇరవై సైనిక స్థావరాలను గల్ఫ్ ప్రాంతంలో ఏర్పాటు చేసింది. గత ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా ఓటమి అంచులో ఉంది. మూడు రోజుల్లో ఇరాన్‌ను స్వాధీనం చేసుకుంటానని చెప్పిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 110 రోజులైనా ఇరాన్‌ను దారికి తెచ్చుకోలేకపోయాడు. పైగా తన వాచాలత్వంతో నాటో దేశాలను, అరబ్ మిత్ర దేశాలను దూరం చేసుకున్నాడు. అమెరికా ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. అమెరికా శక్తిని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అతిగా ఊహించుకున్నాడు. నాటో, అరబ్ దేశాలు (13)ఇజ్రాయెల్, తను కలిసి దాడి చేస్తే మూడు రోజుల్లో వెనెజులాలాగా ఇరాన్ సాగిలబడి పోతుందని ట్రంప్ కలగన్నాడు. కానీ నాటో మిత్రులుగానీ, అరబ్ దేశాలుగానీ యుద్ధంలో పాల్గొనకుండా ప్రేక్షక పాత్ర వహించాయి. ఇప్పటికే ఆర్థిక మాంద్యాలతో ఇబ్బంది పడుతున్న నాటో దేశాలు ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధం వల్ల వచ్చే అవాంఛనీయ పరిణామాలను ఎదుర్కొనడానికి సిద్ధంగా లేవు. అందుకే ట్రంప్ వ్యక్తిగతంగా దూషించినా బ్రిటన్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఇరాన్ వైపు కన్నెత్తి చూడలేదు. ఇక అరబ్ మిత్ర దేశాల వెన్నుపోటును డోనాల్డ్ ట్రంప్ మాత్రమే కాదు. ప్రపంచంలో రాజకీయ పరిశీలకులు ఎవరూ ఊహించలేక పోయారు. 2025 జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను కాళ్లబేరానికి తీసుకురావడంతో అరబ్ దేశాలకు ఇరాన్‌పై నమ్మకం పెరిగింది. మళ్లీ ఫిబ్రవరి 28న అమెరికా యుద్ధం ప్రారంభించేలోపు అరబ్ దేశాలు ఇరాన్ రహస్యంగా కట్టేసాయి. తాజా యుద్ధంలో అమెరికా సైనిక స్థావరాలను తుక్కుకింద కొట్టేసిన ఇరాన్ అరబ్ భూభాగాలపై కనీసం బజూకారాకెట్లను కూడా ప్రయోగించలేదు. ట్రంప్‌కు తగిలిన మొదటి అతి పెద్ద షాక్ ఇదే. ఇంత కాలం యుద్ధం జరుగుతున్నా అరబ్ దేశాల్లో జనజీవనానికి ఎటువంటి అంతరాయంలేదు. ఇరాన్ దాడిలో కూలిపోవాల్సిన ఖలీఫా టవర్ వెలుగులు



విరజిమ్ముతూనే ఉంది. యుద్ధంలో భారతీయులు సుమారు యాభై మంది చనిపోయారు. కానీ ఒక్క అరబ్ దేశీయుడు కూడా చనిపోలేదు. నాటో నేతలు 'పిరికిపందలు' అంటూ బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేసినా ట్రంప్ సౌదీన యువరాజు సల్మాన్ అబ్దుల్‌ను కూడా బండ బూతులు తిట్టాడు. ఇంగ్లీషులో ఫోర్ లెటర్ వర్డ్ వాడటంతో సల్మాన్ అబ్దుల్‌కు కోపం వచ్చి అమెరికాతో వాణిజ్య లావాదేవీలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. నిన్నటి వరకూ సన్నిహితంగా ఉన్న సౌదీ మూటాముల్లె సర్దుకుని వెళ్లిపొమ్మని అమెరికాకు దారి చూపెడుతోంది. అమెరికా సైనికుల సంఖ్య 13 లక్షలు. కాగా గల్ఫ్ సైనిక స్థావరాల్లో 50 వేలమందిని మోహరించింది. దేశ రక్షణ బడ్జెట్ 800 బిలియన్ డాలర్లలో 60 బిలియన్ డాలర్లు గల్ఫ్‌లో వ్యయం చేస్తోంది. ఆదాయం చెప్పుకోడానికి ఏమీ లేదు. గల్ఫ్ ఆదా చేసిన డబ్బును నౌకాదళ విస్తరణ, సెమీకండక్టర్ పెట్టుబడులు, ఎఐ రక్షణ, సాంకేతికత అభివృద్ధికి కేటాయించవచ్చని నిపుణులు ట్రంప్‌కు హితవు చెబుతున్నారు. అంటే 'మనకు యుద్ధాలు చేయడం రాదు. నోర్మూసుకుని కూర్చో' అని చెప్పడం అన్నమాట. ప్రతిరోజూ రెండు బిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. ఇరాన్ దాడుల్లో ఫిఫ్త్ ఫ్లీట్‌తో సహా రాడార్‌లు అన్నీ ధ్వంసం అయ్యాయి. గల్ఫ్ నుంచి అమెరికా పారిపోతే అంతర్జాతీయంగా తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. గల్ఫ్‌లో చైనా, రష్యాల, భారత్‌ల ప్రభావం పెరుగుతుంది. అమెరికా గుత్తాధిపత్యం పోయి స్వేచ్ఛా వాతావరణం నెలకొంటుంది. విశ్వవ్యాప్తంగా ఈ ప్రభావం ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఇతర దేశాలు సొంత రక్షణ వ్యవస్థలను సమకూర్చుకోవాల్సిందే. గల్ఫ్ దేశాలు డాలర్‌ను వదిలి ఇతర కరెన్సీలలో వ్యాపారాలు చేస్తాయి. డాలర్ విలువ తగ్గడం మొదలవుతుంది. పారిశ్రామిక వేత్తలు అమెరికా సెక్యూరిటీలు కొనడం మానేసి అమ్మకం మొదలుపెడతారు. దీనితో డాలర్ మారకం విలువ పడిపోయి అమెరికా అప్పులు రెట్టింపు అవుతాయి. చివరగా ప్రపంచానికే శిఖరాయమానమైన శ్వేతసౌధ రాజకీయ ప్రాభవం మసకబారుతుంది. అమెరికా వదిలి వెళ్లిపోతే అరబ్ దేశాలపైకూడా దాని ప్రభావం ఉంటుంది. ఇది గమనించి సౌదీఅరేబియా విజన్2030 లో భాగంగా చమురుపై వచ్చే ఆదాయానికిబదులుగా టూరిజం, టెక్నాలజీ, లాజిస్టిక్స్, తయారీ పరిశ్రమలపై ఆదాయం పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. అరబ్ దేశాలకు ముఖ్యంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్‌లకు భద్రత ఉండదు. ఇజ్రాయెల్ ముప్పు ఉంటుంది. ఈ కారణంగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రారు. వచ్చినా అనేక షరతులు విధిస్తారు. ప్రస్తుతం అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొని చైనా మాత్రమేగల్ఫ్ ప్రాంతంలోని పోర్టులు, రిఫైనరీలు, టెలికం, ఇంకా ఇతర మౌలికరంగాలలో పెట్టుబడులు పెడుతోంది. అమెరికా నిష్క్రమించడం చైనాకు ప్రధానంగా కలిసి వచ్చే అవకాశం కాగలదు. ●

# పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి

## 22 మంది పరిస్థితి ఆందోళనకరం



**బ్యాంకాక్,జులై 13:** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో సంభవించిన ఈ ప్రమాదంలో కనీసం 27 మంది మరణించగా, మరో 63 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు బ్యాంకాక్ గవర్నర్ వెల్లడించారు. అధికారుల సమాచారం ప్రకారం, నగర ఉత్తర భాగంలోని పబ్ లో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు భవనం మొత్తం వ్యాపించడంతో అక్కడ ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలను కాపాడుకునేందుకు పలువురు బయటకు పరుగులు తీయగా, మరి కొందరు భవనం లోపలే చిక్కుకుపోయారు. ఘటన స్థలాన్ని సందర్శించిన థాయ్ ప్రధానమంత్రి అనుటిన్ చార్న్‌విరాకుల్ మృతుల సంఖ్యను ధృవీకరించారు. ఆయన మాట్లాడుతూ, 'ఇప్పటివరకు 27 మంది మరణించారు. గాయపడిన చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది' అని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలలో పబ్ ప్రధాన ద్వారం నుంచి భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో లోపల ఉన్న ప్రజలు ప్రాణరక్షణ కోసం పరుగులు తీస్తూ బయటకు వస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం, చాటుచాక్ జిల్లాలోని రోంగ్ బీర్ నా లాట్ ఫ్రావో అనే పబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మొదట కాలిన గాయాలతో ఉన్న ఒక వ్యక్తిని రక్షించినప్పటికీ, అనంతరం భవనం లోపల అనేక మంది చిక్కుకుపోయినట్లు గుర్తించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి పలువురు పబ్‌లోని మరుగుదొడ్లలో దాక్కున్నారని సమాచారం. దట్టమైన పొగ, వేగంగా వ్యాపించిన మంటల కారణంగా వారు బయటకు రాలేకపోయారు. మృతులలో అధికశాతం మంది టాయిలెట్ ప్రాంతంలోనే లభించినట్లు అధికారులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అనేక అగ్నిమాపక బృందాలు వాటర్ కెనాన్ల సహాయంతో సుమారు 30 నిమిషాలపాటు శ్రమించి మంటలను అదుపు లోకి తెచ్చాయి. ప్రమాదం అనంతరం విడుదలైన చిత్రాలలో పబ్ లోపలి భాగం పూర్తిగా కాలిపోయి బూడిదగా మారినట్లు కనిపించింది. కాలిపోయిన బల్లలు, కుర్చీలు, శిథిలాల మధ్య సహాయక బృందాలు గంటల తరబడి సహాయక చర్యలు నిర్వహించాయి. ఈ ఘటనతో థాయ్ లాండ్‌లోని పబ్‌ల భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొద లైంది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ప్రస్తుతం ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మంటలు ఇంత వేగంగా ఎందుకు వ్యాపించాయనే అంశంతో పాటు, పబ్‌లో తగిన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నారు.



## జైషే మహిళా ఉగ్రవాద నెట్‌వర్క్ భగ్నం

### నిఘా వర్గాలు ఛేదించిన భారీ కుట్ర

**న్యూఢిల్లీ,జులై 13:** పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థ, భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన పన్నాగం పన్నింది. ప్రేమ, పెళ్లి పేరుతో భారతీయ మహిళలను వలలో వేసి, వారిని పాకిస్థాన్‌కు తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకోవాలని చూస్తోంది. ఈ కుట్రను భారత నిఘా వర్గాలు (ఐబీ) ఛేదించాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో గతేడాది అక్టోబర్‌లో ఏర్పాటైన జమాత్‌ఉల్‌మోమినాత్ అనే మహిళా విభాగం ఈ కుట్రకు కేంద్రంగా పనిచేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఐబీ అధికారుల కథనం ప్రకారం ఈ ఉగ్రముఠాలోని యువకులు భారతీయ మహిళలతో సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సుమారు ఆరు నెలల పాటు వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ, ప్రేమ నటిస్తూ నమ్మకం పెంచుతారు. తాము నిజమైన ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకుని మంచి జీవితం ఇస్తామని నమ్మిస్తారు. ఈ సమయంలో గూఢచర్యానికి సంబంధించిన సున్నితమైన ప్రశ్నలు ఏవీ అడగకుండా జాగ్రత్తపడతారు. పూర్తిగా వారిని నమ్మించి, పెళ్లికి ఒప్పించిన తర్వాత పాకిస్థాన్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తారు. పాకిస్థాన్‌కు చేరాక, వారిని ఉగ్రవాద భావజాలంతో నింపి, గూఢచారులుగా మార్చి తిరిగి భారత్‌కు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఇలాంటి కార్యకలాపాలు జమ్మూకశ్మీర్‌కే పరిమితం కాగా, ఇప్పుడు ఉగ్రవాదులు తమ దృష్టిని రాజస్థాన్‌పైకి మార్చారు. పాకిస్థాన్‌తో రాజస్థాన్‌కు 1,070 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉండటమే దీనికి ప్రధాన కారణం. శ్రీ గంగానగర్ నుంచి బార్మర్ వరకు విస్తరించిన ఈ సరిహద్దు ప్రాంతాల్లోని యువతుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఐఎస్‌ఐ మద్దతు ఉన్న ఉగ్రవాదులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

## రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సుప్రీం నోటీసు

### 'సిట్' నివేదిక అందివ్వాలని యుపి ప్రభుత్వానికి ఆదేశాలు

### విచారణ జులై 20కి వాయిదా

**న్యూఢిల్లీ, జులై 13:** రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసుపై కొనసాగుతున్న దర్యాప్తుకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ల వాదనలను కోరింది. కేంద్ర, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వారికి అధికారికంగా జ్యుడీషియల్ నోటీసు జారీ చేయవద్దని చేసిన అభ్యర్థనతో భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌నేతృత్వంలోని ముగ్గురున్యాయ మూర్తుల ధర్మాసనం ఏకీభవించింది. కేవలం ట్రస్ట్‌కు మాత్రమే అధికారిక జ్యుడీషియల్ నోటీసు జారీ చేయడానికి కోర్టు పరిమితమైంది.

**నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలి:** తాను ఇప్పటికే కోర్టు గదిలో ఉన్నానని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని మెహతా తెలిపారు. కేసు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును సీల్డ్ కవర్‌లో సమర్పిస్తానని న్యాయాధికారి ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసిందని, అరెస్టులతో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని ఆయన అన్నారు. దీనికి అంగీకరిస్తూ, సిట్ కూర్పువివరాలు స్టేటస్‌రిపోర్టులో ఉండాలని, తదుపరి విచారణ తేదీ అయిన జులై20నదానిని దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

## ఇరాన్ హిట్‌లిస్ట్‌లో 13 మంది విదేశీ నేతలు

### ప్రతీకార నప్రతిజ్ఞ చేసిన సుప్రీం లీడర్



**టెహ్రాన్,జులై 13:** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక హిట్‌లిస్ట్‌ను హమ్‌షహ్రీ అనే పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే హమ్‌షహ్రీ అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. ప్రతీకారం తీర్చుకోవడమా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. హమ్‌షహ్రీ పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే.



## ఎసి కోచ్‌లలో చోరీల ద్వారా రూ.104.51 కోట్ల నష్టం: ఐఆర్‌సిటిసి

**న్యూఢిల్లీ,జులై 13:** భారతీయ రైల్వే లోని రైళ్ల ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే బెడ్‌రోల్ సామగ్రి భారీ స్థాయిలో చోరీకి గురవుతోంది. కొవిడ్ అనంతరం 2022 జనవరి నుంచి 2026 మే వరకు నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా టవళ్లు, దిండ్లు, దుప్పట్లు వంటి కనీసం 1.27 కోట్ల వస్తువులు మాయమైనట్లు ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. సమాచార హక్కు దరఖాస్తుకు 69 రైల్వే డివిజన్లలో 54 డివిజన్లు స్పందించగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రజా ఆస్తులపట్ల నిరక్ష్య ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని విమర్శలు వస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో టవల్‌లు, దిండ్లు, దుప్పట్ల వంటి వస్తువుల చోరీ కారణంగా బెడ్‌రోల్ కాంట్రాక్టర్లకు సుమారు రూ.104.51 కోట్ల నష్టం వాటిల్లింది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఇలాంటి దొంగతనాలు 56 శాతం పెరిగినట్లు వెల్లడైంది. ఈ సమస్యను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు అత్యధికంగా చోరీ చేసిన వస్తువుల్లో ఫేస్ టవల్ మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో 46.54 లక్షల ఫేస్ టవల్స్ మాయమయ్యాయి. వాటి తర్వాత 41.13 లక్షల బెడ్‌షీట్లు, 23.59 లక్షల పిల్లో కవర్లు, 12.95 లక్షల దుప్పట్లు చోరీకి గురయ్యాయి. మరోవైపు బ్యాగులో సులభంగా పెట్టుకోలేని కారణంగా దిండ్లు అత్యల్పంగా చోరీకి గురయ్యాయి.

రైల్వే డివిజన్ల వారీగా చూస్తే బికనేర్ డివిజన్‌లో అత్యధికంగా 25.76 లక్షల వస్తువులు చోరీకి గురయ్యాయి. తర్వాత రాంచీ (9.31 లక్షలు), ఢిల్లీ (8.21 లక్షలు), ముంబై (8.17 లక్షలు), జోధ్‌పూర్ (8.09 లక్షలు), అహ్మదాబాద్ (6.94 లక్షలు) డివిజన్‌లు ఉన్నాయి. పంపిణీ బాధ్యత నిర్వహించే ఏజెన్సీలే ఈ వస్తువుల లెక్కలు చూసుకోవాల్సి ఉంటుందని, కొరత ఏర్పడితే ఆర్థిక భారం కూడా వారిపైనే పడుతుందని రైల్వే ప్రతినిధి తెలిపారు.

## అక్టోబరు 27న ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు

**టెల్ అవీవ్,జులై 13:** ఇజ్రాయెల్‌లో తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2026 అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు ఆ దేశ పార్లమెంట్‌నెస్సెట్ అధికారికంగా ప్రకటించింది. చట్టప్రకారం నిర్ణయించిన గడువు మేరకు ఈ ఎన్నికలు జరగనున్నాయని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతున్నందున పార్లమెంట్‌ను ముందుగానే రద్దు చేసే అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ముందస్తు ఎన్నికలపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. ఇజ్రాయెల్ రాజకీయ చరిత్రలో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గత దాదాపు 40 ఏళ్లలో వివాదాల కారణంగా వాయిదా పడకుండా, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. అలాగే ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం గత 50 ఏళ్లలో పూర్తి నాలుగేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తొలి ప్రభుత్వంగా నిలవనుంది. ఈ ఏడాది మే నెలలో పార్లమెంట్‌ను రద్దుచేసి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన వచ్చినప్పటికీ, అది ఆమోదంపొందకపోవడంతో ప్రభుత్వం తనపూర్తి పదవీకాలాన్ని కొనసాగించింది. 2023 అక్టోబర్‌లో హమాస్ దాడి అనంతరం గాజా, లెబనాన్,ఇరాన్‌లతో జరిగిన యుద్ధాల నేపథ్యంలో జరగనున్న తొలిసార్వత్రిక ఎన్నికలు కావడంతో, ఈ ఎన్నికలను ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంపై జరిగే ప్రజాభిప్రాయ సేకరణగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తమిళనాడులో గోవధ నిషేధం కేసు

### మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ, జులై 13:** 1976 నాటి ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయడం ద్వారా తమిళనాడులో గోవధపై రాష్ట్రవ్యాప్త నిషేధాన్ని తక్షణమే అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై నోటీసులు జారీ చేయడంతో పాటు హైకోర్టు తీర్పు అమలుపై స్టే విధించింది. విచారణ సందర్భంగా, ఆ తీర్పు అమలును నిలిపివేసే మధ్యంతర ఉత్తర్వును జారీ చేయడానికి ముందు, సదరు తీర్పులో "సవరణ్ణ అవసరమని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. బక్రీద్ పండుగ సమయంలో లేదా మరే ఇతర రోజునైనా రాష్ట్రంలో ఎక్కడా ఆవు లేదా దూడను వధించకుండా చూడాలని ప్రధాన కార్యదర్శిని, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు మే 27న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమిళనాడులో పశువుల వధకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల పరిధిని మించి హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వాదించింది.

## 'నేను గాంధీజీని కాను..మళ్లీ చంపేస్తా'

### దోషిగా తేలిన వ్యక్తి కేరళ కోర్టులో వ్యాఖ్యలు



**ప్యాలక్కాడ్, జులై 13:** "మీరు కావాలంటే నన్ను ఉరితీయండి, నాకేమీ అభ్యంతరం లేదు. అవసరమైతే నేను మరికొందరిని కూడా అంతం చేస్తాను. నేను గాంధీజీని కాన్ను అని జంట హత్యల కేసులో దోషిగా తేలిన చెంతమర ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం పాలక్కాడ్ అదనపు సెషన్స్ కోర్టు అతన్ని దోషిగా నిర్ధారించిన కొద్దిసేపటికే అతను ఈ వ్యాఖ్యలు చేశాడు. శిక్షను ఖరారు చేసే ముందు ఏమైనా చెప్పదలచుకున్నారా అని న్యాయమూర్తి అడిగినప్పుడు, ఆ హంతకుడిలో ఎలాంటి పశ్చాత్తాపం గానీ, విచారం గానీ కనిపించలేదు. దానికి బదులుగా, అతను తన చర్యలను సమర్థించుకున్నాడు. "నేను అనుభవించిన పరిస్థితులను మీరూ ఎదుర్కొని ఉంటే, బహుశా మీరు కూడా నేను చేసిన పనే చేసేవార్ను అని కోర్టుతో చెప్పి, "మీకు సరైనద నిపించిన శిక్షను విధించండ్ని అని అన్నాడు. ఈ కేసులో బుధవారం శిక్షను ఖరారు చేయనున్నారు. కేరళలో జరిగిన అత్యంత దారుణమైన ప్రతీకార హత్యల కేసుల్లో ఒకదాని విచారణ ఈ తీర్పుతో ముగిసింది. పాలక్కాడ్ జిల్లాలోని పోతుండిలో జనవరి 27, 2025న సుధా కరన్, అతని 75 ఏళ్ల తల్లి లక్ష్మి ని హత్య చేసినట్లు చెంతమరపై అభియోగాలు నమోదయ్యాయి. తన వివాహ బంధం విచ్ఛిన్నం కావడానికి కారణమని భావించి, 2019లో తన పొరుగింటి మహిళ సజితను నరికి చంపడంతో మొదలైన పగకు ఈ హత్య లు పరాకాష్టగా నిలిచాయి. ఆ కేసులో దోషిగా తేలి రెండుసార్లు జీవిత ఖైదు శిక్ష పడినప్పటికీ, అతను 2022లో బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, చెంతమర బెయిల్ షరతులను ఉల్లంఘించి, మరింత ప్రతీకారం తీర్చుకునేందుకు రహస్యంగా పోతుండికి తిరిగి వచ్చాడు. ముందుగానే సమకూర్చుకున్న కొడవలితో, ఇంటి బయట ఉన్న సుధాకరన్‌ను నరికి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొడుకు ఆర్తనాదాలు విని బయటకు వచ్చిన లక్ష్మి పై కూడా అతను దాడి చేశాడు. హత్యల తర్వాత చెంతమర సమీపంలోని మట్టాయి అడవిలోకి పారిపోయాడు, అక్కడ రెండు రోజుల పాటు సాగిన ముమ్మర గాలింపు తర్వాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఈ జంట హత్యలు ఒక పెద్దకుట్రలో భాగం మాత్రమేనని దర్యాప్తు అధికా రులు తర్వాత వెల్లడించారు. అతని 'హిట్ లిస్ట్'లో విడిపోయిన భార్య, కుమార్తె, పోలీస్ అధికారి అయిన అల్లుడు, బావమరిది, స్థానికంగా ఉన్న మరో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీసులు ఆరోపించారు. విచారణ సమ యంలో 132మంది సాక్షులలో నలుగురు ఫిరాయించిన ప్పటికీ, ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలతో కూడిన ప్రాసిక్యూషన్ 480పేజీల ఛార్జిషీట్ నిర్ణయాత్మకంగా నిలిచింది. కోర్టు వెలుపల, సుధాకరన్ కుటుంబం తాము ఇంకా భయంతోనే బతుకుతున్నా మని, కేరళను దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ నేరానికి మరణశిక్ష కంటే తక్కువ ఏదీ న్యాయం చేకూర్చదని చెబుతూ, మరణశిక్ష విధిం చాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

## సంక్షిప్త వార్తలు

### ఉక్రెయిన్ ప్రధాని యులియా రాజీనామా



**కీవ్, జులై 13:** ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో రాజీనామా చేశారు. ఉక్రెయిన్ మంత్రి మండలిలో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ భారీ మార్పులు చేశారు. దీంతో ఆమె తప్పుకున్నారు. అధ్య క్షుడు జెలెన్‌స్కీ తనకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆమె చెప్పారు. గతంలో ఉక్రెయిన్ ఆర్థిక మంత్రిగా స్విరిడెంకో చేశారు. అయితే 2005 జులైలో ఆమెకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజ ఒప్పందంలో కీలక పాత్ర పోషించినట్లు ఆమెపై గతంలో ఉక్రె యిన్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. సంక్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌కు నాయకత్వం వహిం చడం గౌరవంగా భావిస్తున్నట్లు స్విరిడెంకో తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

### డ్రాగన్ విస్తరణ వాదం అక్రమమే: 14 దేశాల ప్రకటన



**మనీలా, జులై 13:** వివాదాస్పద దక్షిణ చైనా సముద్రప్రాంతంలో చైనా ప్రాదేశిక విస్తరణ యత్నాలు అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని అమెరికా, బ్రిటన్,మరో 12 దేశాలు పేర్కొన్నాయి. చైనా వ్యవహరిస్తున్న తీరు ప్రాంతీయ సుస్థిరతకు విఘాతం కలిగిస్తోందని తెలిపాయి. బీజింగ్ చర్యలను సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సముద్ర చట్ట ఒప్పందం ప్రకారం ద హేగ్‌లో ఏర్పాటైన వివాద పరిష్కార న్యాయస్థానం (ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్) 2016 జులై 12న వెలువరించిన తీర్పును ఆ ప్రకటన గుర్తు చేసింది. గుర్తించిన చైనా ప్రాదేశిక ప్రాంతాలకు వెలుపల, దక్షిణ చైనా సముద్ర జలాల్లోని వనరులపై చైనాకు ఎలాంటి హక్కులు లేవని పదేళ్ల నాటి ఆ తీర్పు పేర్కొంది.

### రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలపై విపక్షాల దుమారం



**న్యూఢిల్లీ,జులై 13:** యోగా గురువు బాబా రాందేవ్ చేసిన 'హిందూ రాష్ట్రం' వ్యాఖ్యలు దేశవ్యా ప్తంగా రాజకీయ, మతపరమైన చర్చలకు దారితీశాయి. భారతీయులందరి పూర్వీకులు ఒక్కరేనని, అందువల్ల హిందూ రాష్ట్రం అనే భావనపట్ల మైనారిటీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. రాందేవ్ వ్యాఖ్యలపై విపక్ష నేతలు, మత పెద్దల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న బాబా రాందేవ్, 2009లో తాను ఇస్లామిక్ దేవ్‌బంద్‌ను సందర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు.

### మానససరోవర్ యాత్రలో యమద్వార్ కీలకఘట్టం



**డెహ్రాడూన్,జులై 13:** ప్రపంచంలో అత్యంత పవిత్రమైన తీర్థయాత్రల్లో కైలాస మానససరోవర యాత్రలో తొలి ఆధ్యాత్మిక ఘట్టంగా నిలిచేది యమద్వారం. టిబెట్‌లోని నగారి ప్రాంతంలో, దర్చెన్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో 4,750 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశం కైలాస యాత్ర ప్రారంభ బిందువుగా భావిస్తారు. పాప విముక్తికి సంకేతం యమద్వారం అంటే యమ ధర్మరాజు ద్వారం అనిఅర్థం. ఈ ద్వారంలోనుంచి వెళ్లడం వల్ల భౌతిక బంధాలను విడిచిపెట్టి ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టినట్లుగా భావిస్తారు.

### ఎర్రకోట పేలుళ్ల కేసు మృతుల అంత్యక్రియలకు ఢిల్లీ కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ, జులై 13:** గత నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారుబాంబు పేలుడులో మరణిం చిన 11 మందికి సంబంధించిన అవశేషాలను దహనం చేయడానికి నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్‌ఐఎ)కి ఢిల్లీకోర్టు సోమవారం అనుమతినిచ్చింది. ఆత్మాహుతి దాడిలో మరణించిన, పేలుడు పదార్థాలతో నిండిన కారు డ్రైవర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధించిన శరీర భాగాలను కూడా దహనం చేయడానికి ప్రత్యేక న్యాయమూర్తి పితాంబర్‌దత్ అనుమతించారు. బాధితుల మతప రమైన విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, వారి శరీర భాగాలను పూర్తి గౌరవంతో దహనం చేయాలని కోర్టు పేర్కొంది.

### విమాన చార్జీల దోపిడీపై సుప్రీం సీరియస్

**న్యూఢిల్లీ, జులై 13:** విమాన టిక్కెట్ల ధరలలో ఏకపక్ష, మితిమీరిన హెచ్చుతగ్గులను అరికట్టేందుకు చర్యలు కోరుతూ దాఖలైనపిటిషన్‌పై విచారణ జరుపుతూ, ఛార్జీలను నియంత్రించడానికి రూపొందించిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది.

## దేశవ్యాప్తంగా గోవధ నిరోధక చట్టం అమలు చేయాలి

### సుప్రీంకోర్టులో పిల్.. విచారణకు నిరాకరణ

**న్యూఢిల్లీ, జులై 13:** గోవధ నిరోధక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా వధశాలలను నియంత్రించాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుప్రీంకోర్టు సోమవారం ఉపసంహరించుకున్నట్లుగా కొట్టివేసింది. ఇప్పటికే ఉన్న ఏదైనా కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించిన పక్షంలో, ధిక్కారచర్యలను ప్రారంభించడమే సరైన పరిష్కారమని పేర్కొంది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది. "ఏదైనా ఉత్తర్వును ఉల్లంఘించినట్లయితే, ధిక్కార పిటిషన్ దాఖలు చేయండ్ని అని జస్టిస్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్టేట్ ఆఫ్ గుజరాత్ వర్సెస్ మీర్జాపూర్ మోతీ ఖురేషీ కస్సాబ్ జమాత్ (2005) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గోవధ వ్యతిరేక చట్టాలను అమలు చేయాలని కేంద్రాన్ని, అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను (యుటిలను) ఆదేశిస్తూ మాండమస్ రిట్ జారీ చేయాలని ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) కోరింది. అంతేకాకుండా, వధశాలల నియంత్రణకు మార్గదర్శకాలను జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న వధ వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని కూడా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది బరున్ కుమార్ సిన్హా ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## మన్మోహన్‌సింగ్ ఆత్మహత్య చేసుకుంటానన్నారు

### మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషి పుస్తకంలో ప్రస్తావన



**న్యూఢిల్లీ,జులై 13:** మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎస్‌వై ఖురేషీ తన కొత్త పుస్తకం "నేను నాభారత్..100 తీపిగుర్తులు" పేరిట రాసిన పుస్తకంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికర సంఘటనను వెల్లడించారు. 2012 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంపై కొందరు కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలపై తాను తీవ్ర ఆందోళన వ్యక్తం చేశానని, ఆ విషయం తెలుసుకున్న మన్మోహన్ సింగ్ తనను అత్యవసరంగా కలవాలని కోరినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను 4.5 శాతం నుంచి 9 శాతానికి పెంచుతామని అప్పటి కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ యూపీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉన్న సమయంలో కొత్త హామీలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. నాలుగు రోజుల పాటు ఇరుపార్టీల వాదనలు విన్న ఎన్నికల సంఘం ఖుర్షీద్‌ను తప్పుబడు తూ కఠిన చర్యలు తీసుకుంది. అనంతరం కొందరు కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం అహంకారంగా వ్యవహరి స్తోందంటూ వ్యాఖ్యలు చేశారని ఖురేషీ తెలిపారు. ఎన్నికల సంఘంపై మంత్రుల వ్యాఖ్యలు సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఖురేషీ అప్పటి ప్రధానమంత్రి మీడియా సలహాదారు హరీష్ ఖరేకు వివ రించారు. మరుసటి రోజే ప్రధానమంత్రి కార్యా లయం నుంచి ఫోన్ రావడంతో సాయంత్రం మన్మోహన్ సింగ్‌ను ఆయన కలిశారు. ఆ సందర్భంగా మన్మోహన్ సింగ్ తీవ్ర ఆవేదనతో హరీశ్ చెప్పింది నిజమైతే మీరు అలా అనుకుంటే నేను ఆత్మ హత్య చేసుకుంటా అని చెప్పారని ఖురేషీ తన పుస్తకంలో పేర్కొ న్నారు. ఆ వ్యాఖ్యలు తన గురించికాదని, కొందరు మంత్రుల ప్రవర్తన గురించేనని వివరిం చగా నాకు ఈ విషయం అసలు తెలియదు. తెలిసి ఉంటే వారిని తీవ్రంగా మందలించేవాణ్ని. ఇకపై ఏ సమస్య ఉన్నా నేరుగా నాకు ఫోన్ చేయండి అని మన్మోహన్ సింగ్ చెప్పినట్లు వెల్లడించారు.

## భార్య విసిరిన మొబైల్ తలకు తగిలి భర్త మృతి

**భువనేశ్వర్/బలాంగీర్:** ఒడిశాలోని బలాంగీర్ జిల్లాలో కుటుంబ కలహం విషాదాంతానికి దారితీసింది. దంపతుల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చగా, భార్య ఆగ్రహంతో మొబైల్ ఫోన్‌ను భర్తపై విసిరినట్లు తెలుస్తోంది. ఆ ఫోన్ తలకు బలంగా తగలడంతో అతడు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు వెంటనే బలాంగీర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి (డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్) తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని భావించి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే అతని ఆరోగ్య పరిస్థితి విషమించగా మరోసారి అత్యవసర చికిత్స కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిం చారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ అతని ప్రాణాలను కాపాడలేకపోయారు. చివరకు అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పింఛన్ కోసం వెళితే బ్యాంకు ఖాతాలో రూ.1500 కోట్లు

**ముజఫరాపూర్,జులై 13:** వృద్ధాప్య పింఛను, దివ్యాంగ పింఛను తీసుకునేందుకు బ్యాంకు కేంద్రానికి వెళ్లిన తండ్రీకొడుకులు తమ ఖాతాల్లో కనిపించిన భారీ మొత్తంచూసి అవాక్కయ్యారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సక్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ధాటియా సిహో గ్రామానికి చెందిన కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు గ్రామంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రానికి వెళ్లారు. ఆయనతో పాటు దివ్యాంగ పింఛను పొందుతున్న కుమారుడు కూడా ఉన్నాడు. పింఛను నగదు తీసుకున్న అనంతరం ఇద్దరూ తమ బ్యాంకు ఖాతాల్లో మిగిలిన బ్యాలెన్స్‌ను పరిశీలించగా, అక్కడ కనిపించిన మొత్తం వారిని అవాక్కయ్యేలా చేసింది. బ్యాంకు ఖాతా వివరాల ప్రకారం, కామేశ్వర్ మిశ్రా ఖాతాలో సుమారు రూ.759 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ఇదే తరహాలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా దాదాపు అంతే మొత్తం నమోదై రూ.1,500 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ప్రస్తుతం ఈ ఘటనకు గల అసలు కారణం తెలియరాలేదు. బ్యాంకింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం లేదా సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఈ భారీ మొత్తం ఖాతాల్లో కనిపించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# 30 రోజులకు పైగా జైల్లో ఉంటే వారి పదవులు రద్దు కావడం మంచిదే

## 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఏపి ప్రభుత్వం సంపూర్ణ మద్దతు

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులల స్థాయి, ఇతర ఉన్నత ప్రజాప్రతినిధుల పదవులు ఉండి తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు అయి నెల రోజులకు మించి జైల్లో ఉన్న వారి పదవులు ఆటోమేటిక్‌గా రద్దయ్యేలా ప్రతిపాదించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఎపి సమాచార, పౌరసంబంధాల శాఖ, సిఎంఒ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉటంకిస్తూ సమాచారపత్రాన్ని విడుదల చేశాయి. ఈ బిల్లు ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు అవినీతిని అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యగా నిలుస్తుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో ప్రవేశపెట్టిన ఈ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీ ముందు రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను అధికారికంగా వెల్లడించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించాల్సిన బాధ్యత ఉందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

తీవ్రమైన నేరాల ఆరోపణలతో జైలులో కొనసాగుతున్న వ్యక్తులు ప్రజా పదవుల్లో కొనసాగడం వల్ల పాలనా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 30 రోజులకు మించి జైలులో ఉన్న ప్రజాప్రతినిధుల పదవులను రద్దు చేసే నిబంధన ప్రజా ప్రయోజనాలను పరిరక్షించే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నట్లు వెల్లడించింది. ఈ చట్టాన్ని అమలు చేసే సమయంలో రాజకీయ ప్రేరేపిత కేసుల కారణంగా నిర్దోషులు ఇబ్బందులు పడకుండా తగిన భద్రతా నిబంధనలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసం నమోదు చేసే కేసుల ఆధారంగా ప్రజాప్రతినిధుల పదవులు కోల్పోయే పరిస్థితి రాకుండా చట్టంలో స్పష్టమైన రక్షణ కల్పించాలని అభిప్రాయపడింది. అవినీతి సుపరిపాలనకు, ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల విశ్వాసానికి ప్రధాన అడ్డంకిగా మారిందని ప్రభుత్వం పేర్కొంది.

అవినీతి కారణంగా ప్రభుత్వ నిధులు దారి మళ్లడం, అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కావడం, సంక్షేమ పథకాల అమలు దెబ్బతినడం వంటి ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని వివరించింది. రాజ్యాంగం నిర్దేశించిన నిబద్ధత, పారద ర్శకత, జవాబుదారీతనం, రూల్ ఆఫ్ లా సూత్రాల ఆధారంగా పరిపాలన కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఉన్నత పదవుల్లో అవినీతిని నియంత్రించడమే కాకుండా పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. అజ్ఞాత లేదంటే రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులు రాజ్యాంగ అనిశ్చితికి దారి తీయకుండా జాగ్రత్త వహించాలని ఎపి ప్రభుత్వం పేర్కొంది. విశ్వసనీయ ఆధారాలతో కూడిన ఫిర్యాదులనే పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దర్యాప్తులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఎపి ప్రభుత్వం పేర్కొంది. దాని వల్ల కోర్టు ప్రొసీడింగ్స్ నిరవధికంగా పెండింగ్‌లో పడకుండా ఉంటాయిని ఎపి ప్రభుత్వం పేర్కొంది. రాజ్యాంగబద్ధ పాలనను పటిష్ఠం చేయాలంటే ఈ ప్రతిపాదనలకు విస్తృత స్థాయిలో మద్దతు లభించడం అవసరమని పార్లమెంటరీ సంయుక్త కమిటీ ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

# విద్యుత్ సమస్యల పరిష్కారంతో వినియోగదారుల హర్షం

## ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం పట్ల నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు అబ్దుల్ అజీజ్, హరనాథ్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా నెల్లూరు జిల్లాకు చెందిన వినియోగదారుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య ఉందని డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా విన్నవించిన అనతికాలంలోనే సమస్యను పరిష్కరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అనంతపురం జిల్లాకు చెందిన వినియోగదారుడు హరనాథ్ బాబు మాట్లాడుతూ తమ విద్యుత్ సర్వీసుకు సంబంధించిన బిల్లింగ్ సమస్యను సిఎండి దృష్టికి తీసుకెళ్లిన రోజే సమస్యను పరిష్కరించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా 53 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారని ఆ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపులు వంద శాతానికి చేరుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఆన్లైన్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు వీలుగా విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను దశలవారీగా మూసివేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్‌ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వంతోనే మేలు



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసిపి అధినేత జగన్ రవీంద్ర ప్రశ్నించారు. సోమవారం టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి, ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్య కారుడు చిన్నా అందించిన సమాచారంతో 72గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీమెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ.3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. ఐదేళ్లలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు.

# తిరుచానూరు పద్మావతి అమ్మవారికి వజ్రాలతో కూడిన బంగారు హారం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరానికి చెందిన భక్తుడు శ్రీనివాస సోమవారం తిరుచానూరు లోని పద్మావతి అమ్మవారికి సుమారు 56.8 గ్రాముల బరువున్న వజ్రాలతో కూడిన బంగారు హారాన్ని ఆలయ అధికారులకు విరాళంగా సమర్పించారు. ఈ హారం విలువ సుమారు 12.50 లక్షలు రూపాయలు ఉంటుంది. అనంతరం ఆలయ అధికారులు దాతకు వేదాశీర్వచనం అందించి, పద్మావతీ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ లు సురేష్, రమేష్, మునిచెంగల్ రాయులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఆలయ ఇన్స్పెక్టర్ చలపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.4.41 కోట్లు విరాళం

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్ కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.4.41 కోట్లు విరాళంగా అందించింది. సోమవారం ఆ సంస్థ ఛైర్మన్ పొట్టి వేంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఎస్.రాజమోళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీ కుమారి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరిలకు విరాళం డిడిలను అందజేశారు.

**ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం:** తిరుపతికి చెందిన శ్వాసకోశ వైద్యుడు డాక్టర్ సింగపాటి సుబ్బారావు ఆయన కుమారుడు సింగపాటి సాయికృష్ణ పేరుపై సోమవారం వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలో ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిని అందజేశారు.

## ఎస్వీ గోశాలకు మగ గుర్రం విరాళం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడు మదురైకు చెందిన భక్తుడు వడివేలు ముకుంధన్ టిటిడి ఎస్వీ గోశాలకు ఒక మగ గుర్రాన్ని విరాళంగా అందజేశారు. ఈ గుర్రానికి అవసరమైన శిక్షణ పూర్తి చేసిన అనంతరం, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలో వినియోగించనున్నారు. సోమవారం ఉదయం దాత ఈ గుర్రాన్ని టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.ఎన్. శివకుమార్‌కు అప్పగించారు. ఎస్వీ గోశాలలో విరాళం ఇచ్చిన గుర్రంతో కలుపుకుని ఐదు గుర్రాలు ఉన్నట్లు గోశాల డైరెక్టర్ శివకుమార్ తెలిపారు.

## నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డీకాసులవాడికి ఈనెల 17వ తేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వ తేదీ మంగళవారం నేడు ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయం లోపల ఆనంద నిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం శుద్ధిచేస్తారు. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 17వ తేదీ విఐపి బ్రేక్ రద్దుచేశారు. 16న ఎలాంటి సిఫార్సులు స్వీకరించరు. 17వ తేదీ ఆణివార ఆస్థానం సందర్భంగా పుష్పపల్లకిపై మలయప్ప ఊరేగనున్నారు.



# ఆగస్టులో శ్రీవారి పవిత్రోత్సవాలు

## - ఒకే టిక్కెట్‌పై మూడురోజులు భక్తులకు దర్శనాలు


**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవ మూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలు ఈ ఏడాది వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఏటా మూడురోజుల పాటు ఆలయంలోపల కల్యాణోత్సవ మండపంలో (సంపంగి ప్రాకారం) జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకా రోజు టిక్కెట్లు పొందిన గృహస్థ భక్తులను ఈ సేవకు అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి పెద్దలు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను ఐదువేల రూపాయలు (రూ.5వేలు) చేశారు. ఈ టిక్కెట్ ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని ఏడుకొండలస్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాలకు సంబంధించి సేవా టిక్కెట్లపై ఒకే టికెట్ పొందిన గృహస్థ భక్తులు మూడు రోజులు సేవలో పాల్గొనే అవకాశం కల్పించింది. తిరుమలేశుని ఆలయంలో ఈ ఏడాది ఆగస్టు 23 నుండి 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించేలా నిర్ణయించారు. ఆగస్టు 22న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనల, ఉత్సవాల్లో భక్తులువల్లగానీ, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగు తాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా ఆగమ శాస్త్ర ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొనాలని భావించే భక్తులకు ఈ నె 21వ తేదీన గురవారం ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసే టికెట్ ను ఇద్దరు గృహస్థ భక్తులకు కలిపి 5వేల రూపాయలు చెల్లించి కొనుగోలు చేయవచ్చు. టికెట్లు పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడు రోజులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి జరిగే స్నపన తిరుమంజనంలో, చివరి రోజున పూర్ణాహుతిలో పాల్గొనే అవకాశం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో ఆయా రోజుల్లో ఉదయం 7 గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయంలోపలకు అనుమతిస్తారు. ఈ ఏడాది వినూత్నంగా భక్తులకు వరుసగా మూడు రోజులు ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శించుకునే అవకాశం కలగడంతో పెద్దసంఖ్యలో భక్తులు సద్వినియోగం చేసుకుంటారని టిటిడి అంచనా వేస్తోంది.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేలా...

# కారేరీష్టి వరుణయాగం జరిపిస్తారా!?

## - అన్నప్రసాదంలో పప్పు మెనూకు ఆమోదం వస్తుందా! - నేడు టిటిడి బోర్డు సమావేశం

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో దాదాపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవక పోవడంతో జనం విలవిల్లాడిపోతున్నారు. సాధారణంగా జులై నెలనుండి వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు తగ్గి కాస్త వేడినుండి ఉపశమనం కలుగుతుంది. అలాంటిది ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ప్రభావం కూడా ఆశాజనకంగా లేదు. దీంతో జులై రెండవ వారంలో కూడా వర్షాలు చినుకు అనేది లేకపోవడంతో ప్రజలు ఏప్రిల్,మేనెల ఎండలను చవిచూస్తున్నారు. ఓ వైపు సూర్యుని వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మరోవైపు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కూడా మరీ దారుణంగా ఉన్నాయి. తాగునీటికి కూడా జనం అల్లాడిపోయే పరిస్థితులు రానున్నాయనే ప్రమాద ఘంటికలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో టిటిడి రుత్వికులు, అర్చకులు,వేదపండితులు వర్షాల కోసం కారేరీష్టి వరుణయాగం జరిపించడం పరిపాటి. అలాంటిది ప్రస్తుతం ఉన్న టిటిడి బోర్డుగానీ, టిటిడి ఉన్నతాధికారులు కూడా అలాంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంపై శ్రద్ధ చూపడంలేదు. పైగా ఆగమశాస్త్రపండితుల సలహాలు కూడా తీసుకోవడంలేదంటే పరిస్థితి ఏంటనేది అర్థమవుతుంది. అస్సలు బడ్జెట్‌లో ధార్మిక కార్యక్రమాలకు కేటాయించే నిధులకు గణాంకాలు(లెక్కలు)ఉండవు. మరీ యాగాలు చేపట్టేందుకు టిటిడి ఎందుకు నిర్లక్ష్యంగా ఉందనేది భక్తుల్లోనూ వినిపిస్తున్న వాదనలు.



దేశంలో సకాలంలో వర్షాలు కురవాలని, రాష్ట్రం దేశం సుభిక్షంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో కారీరిష్టి యాగం,వరుణ జపం, పర్జన్య శాంతి హోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటి. హిందూ సనాతన ధర్మం ప్రకారం వర్షాల కోసం వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఈ యాగాన్ని అత్యంత పవిత్రంగా చేపడతారు. 32 మందికి పైగా వేద, శ్రౌత, స్మార్త పండితులు అత్యంత నిష్ఠతో ఈ యాగ కార్యక్రమాలను పూర్తి చేస్తారు.

నేడు మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగే బోర్డు సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. రానున్న సెప్టెంబర్ నెలలో శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటం, ఆ తరువాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తిరుమలలో ఏర్పాట్లు, మాఢవీదుల్లో విస్తృత సౌకర్యాలు కల్పించే అంశాలపై కూలంకుషంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు రెండవది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి బోర్డు పలు విషయాలపై అజెండా రూపొందించింది.. టిటిడిలో ఉద్యోగాల ఖాళీల భర్తీ విషయంగా కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.



# గాయని ఎస్.జానకి చిరస్మరణీయురాలు

**గుంటూరు కల్చరల్, జులై13 ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు మద్దు వెంకటస్వామి, వారి బృందం నక్షత్రగాయని ఎస్.జానకిని కోల్పోవడం సనీ రంగానికి ఒక తీరని లోటన్నారు. వారి జ్ఞాపకాలను తలచుకుంటూ 2013 ఫిబ్రవరి 24న గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహించిన ఎస్.జానకీ కార్యక్రమం అత్యంత అద్భుతంగా కిక్కిరిసిన జనంతో జరిగింది. వారు సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, అనేక మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. పుర ప్రముఖులు సంస్థవారు ఎస్.జానకినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం నిర్వహించిన కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. 11-7-2026న ఎస్.జానకి పరమపదించడం ఒక తీరని లోటుగా భావిస్తూ గుంటూరు జిల్లా సంగీత కళాకారులతో, తమ కుటుంబ సభ్యుల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నట్లు వెంకటస్వామి తెలిపారు.

# ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్లు జైలు



**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో బాటు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఎడిజె న్యాయమూర్తి జస్టిస్ నరసింహమూర్తి తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించారు. 2017లో భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో 01/2017 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో రేణిగుంట మండలానికి చెందిన గునిశెట్టి పుట్టాలయ్య(38), యల్లమందకు చెందిన పెట్లూరి రాజయ్య(30), చిన్నగొట్టిగల్లు మండలవాసి గడ్డంవారి మణికంఠ (27) ముద్దాయిలుగా ఉన్నారు. జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలు చేస్తున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్" విధానం ద్వారా కేసును సమర్థవంతంగా నడిపించడంతో నేరం రుజువై న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

# పట్టపగలే మహిళపై కత్తితో దాడి




**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగరంలో సోమవారం మధ్యాహ్నం పట్టపగలే ఆటోలో వెళుతున్న ఓ మహిళపై దాడి జరిగింది. తిరుపతి రూరల్ ముత్యాల రెడ్డి పల్లి పంచాయతీ ప్రైమరీ హాస్పిటల్ ఎదురుగా ఈ సంఘటన జరగడంతో స్థానికులు భయంతో వణికిపోయారు. ఎంఆర్‌పల్లికీ సమీపంలోని వైకుంఠపురంలో నివాసముంటున్న హిమబిందు ఆటోలో వస్తుండగా ఓ కారు అడ్డగించింది. కారులో నుండి దిగిన వ్యక్తి ఆటోలో ఉన్న మహిళపై కత్తితో దాడిచేశాడు. మహిళ రెండు చేతులు అడ్డు పెట్టి ఆటో నుండి దిగి కాపాడండి అంటూ హోటల్ లోకి పరుగులుతీసింది. స్థానికులు ఆమెను రక్షించి రుయా ఆస్పత్రికి తరలించారు. హిమబిందు భర్త మహమ్మద్ షరీఫ్ విదేశాలలో ఉండగా ఆమె ఇద్దరు పిల్లలతో వైకుంఠపురం వద్ద నివాసముంటుంది. విషయం తెలుసుకున్న ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నగదు లావాదేవీల విషయంలో జరిగిన గొడవల వల్లే ఈ హత్యాయత్నంకు దారి తీసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆనందదాయని అవగాహనలో హాస్యవల్లరి



**గుంటూరు కల్చరల్, జులై 13 ప్రభాతవార్త:** హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిదని అది మనల్ని నవ్విస్తుంది,కవ్విస్తుంది, ఆనంద పరవశుల్ని చేస్తుందని అది మన పరిచయాలను పెంచుతుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు పలువరు మాట్లాడుతూ అన్నారు. సంస్థ కార్యాలయంలో 141వ హాస్యవల్లరి కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. కార్యక్రమాన్ని కవి, రచయిత బండికల్లు జమదగ్ని ప్రారంభిస్తూ ఆనందానికి సూచిక, ఆహ్లాదానికి సంకేతం నవ్వు అని గతంలో నవ్వు నాలుగు విధాల చేటు అనేవారని ఇప్పుడు నవ్వు నలభై విధాల గ్రేటు అంటున్నారన్నారు. ప్రముఖ హాస్యవిషయాల విశ్లేషకులు ఆర్.వి.వేంకటేశ్వర్లు మాట్లాడుతూ నవ్వులేని జీవితం దుర్భర దారిద్ర్యంతో సమానమన్నారు. రచయిత్రి టి.పద్మావతి, హాస్యప్రియులు సిహెచ్ బాలకృష్ణ, కెవిస్ ప్రసాద్ తదితరులు తమ జోక్స్, కామెడీ స్కిట్స్‌తో అలరించారు. కార్యక్రమంలో నవ్వుల జల్లులు, పిసినారులు వర్థిల్లాలి, అఖిల మూర్ఖుల దినోత్సవం అనే రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా అందర్ని కడుపుబ్బ నవ్వించారు.

# ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ట్రస్ట్‌లలో ప్రాణదానం ఒకటి. ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు సోమవారం బెంగళూరుకు చెందిన యువ వ్యాపార వేత్త వికేష్ విరాళం అందించాడు. తిరుమలలో టిటిడి ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం డిడిని అందజేశారు.

# ఆమ్లెట్ గొడవ ప్రాణం తీసింది!

## శ్రీకాకుళంలో అత్త వేధింపులతో కోడలు ఆత్మహత్య

**శ్రీకాకుళం, జులై 13 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అత్తా కోడళ్ల మధ్య తలెత్తిన ఓ చిన్న గొడవ చినికి చినికి గాలివానలా మారి, ఓ వివాహిత ప్రాణాలు తీసుకునేంత దారుణానికి దారితీసింది. ఆమ్లెట్ విషయంలో మొదలైన వివాదం, అత్త వేధింపులు, భర్త మద్దతు కరవవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేటలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఆదివారంపేటకు చెందిన కోనాడ నాగరాజు స్థానిక వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతనికి పొందూరు మండలం బొడ్డేపల్లికి చెందిన షర్మిల (26)తో యేడాది క్రితం వివాహం జరిగింది. వివాహం తర్వాత దంపతులు ఉమ్మడి కుటుంబంతో కలిసి ఆదివారంపేటలోనే నివసిస్తున్నారు. అయితే, పెళ్లయిన నాటి నుంచి అత్త దమయంతికి, కోడలు షర్మిలకు మధ్య తరచూ చిన్న చిన్న విషయాలకే గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భర్త నాగరాజు జోక్యం చేసుకోకుండా మౌనంగా ఉండేవాడని తెలుస్తోంది. ఈ నెల 8వ తేదీన నాగరాజు పని ముగించుకుని ఇంటికి రాగా, భర్తకు భోజనం వడ్డిస్తూ షర్మిల ఒక ఆమ్లెట్ వేసి పెట్టింది. అయితే, తన చిన్న కొడుకుకు ఆమ్లెట్ ఎందుకు వేయలేదంటూ అత్త దమయంతి కోడలితో గొడవకు దిగింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పెద్ద వివాదంగా మారింది. ఆ సమయంలో కూడా నాగరాజు ఏమీ మాట్లాడకపోవడంతో షర్మిల తీవ్రంగా నొచ్చుకుంది. శనివారం కూడా ఇదే విషయమై ఇంట్లో మరోసారి గొడవ జరిగింది. తరచూ అత్త వేధిస్తుండటం, చిన్న విషయానికే గొడవ పడుతుండటం, అన్నింటికన్నా ముఖ్యంగా కట్టుకున్న భర్త తనకు అండగా నిలబడకపోవడంతో షర్మిల తీవ్ర మనస్థాపానికి గురైంది. అందరూ నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయాన్నే షర్మిల విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేవలం ఆమ్లెట్ కోసం మొదలైన గొడవ ఒకరి ప్రాణాన్ని బలిగొనడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లక్ష్యం

## ఈగల్ చీఫ్ ఎ.కె. రవికృష్ణ



**విశాఖపట్నం, జులై 13 ప్రభాతవార్త:** గంజాయి సాగు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈగల్ విభాగం చేపట్టిన "పల్లె బాటలో ఈగల్" కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చేపట్టారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని కొత్తవలస గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఈగల్ అధికారులు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 20 వరకు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈగల్ చీఫ్ ఏ.కే. రవికృష్ణ తెలిపారు. ఆపరేషన్ చైతన్యం ద్వారా గంజాయి సాగు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డ్రోన్ సర్వేలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లతో గంజాయి సాగును గుర్తించి నిర్మూలిస్తున్నామని వివరించారు. గంజాయి నిర్మూలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్న ఆయన, ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అధునాతన సాంకేతికతను వినియోగించి ఈగల్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, రాష్ట్రంలో గంజాయి సాగుతో పాటు వినియోగం కూడా గణనీయంగా తగ్గిందని ఏ.కే. రవికృష్ణ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు.

# పోలీసుల విచారణలో నోరు విప్పని గమన

## 17న విచారణకు హాజరుకావాలని నోటీసులు

**గన్నవరం(కృష్ణా), జులై 13 ప్రభాతవార్త:** ఉపా కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న ప్రశ్న రావణ్‌కు సన్నిహితంగా ఉంటున్న ప్రశ్న ఛానల్ సీఈఓ గమన, ఇంద్రసేనా చౌదరిలు పోలీస్‌ల విచారణలో నోరు విప్పటంలేదు. గన్నవరం పోలీసులు రెండురోజులుగా వీరిద్దరిని విడివిడిగా విచారిస్తున్నా ఫలితం లేకపోవటంతో పోలీసులు సాంకేతిక అంశాల ఆధారంగా విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. గన్నవరం ఇన్‌చార్జ్ డిఎస్పీ ధరేంద్ర ఆధ్వర్యంలో సిఐ శివప్రసాద్ ఆది, సోమవారాల్లో గమన, ఇంద్రసేనా చౌదరిలను సుదీర్ఘంగా విచారించారు. నక్సల్స్‌తో ఎవిధమైన సంబందాలు ఉన్నాయి, ఎవరి ప్రోద్భలంతో ప్రభుత్వ వ్యతిరేక వీడియోలు రూపొందిస్తున్నారు. పవన్‌కళ్యాణ్‌ను ఎందుకు దుర్భాషలాడుతున్నారు. మీకు ఆర్థికంగా సహకారం ఎవరిస్తున్నారు తదితర 15 ప్రశ్నలు పోలీసులు సంధించారు. పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు వీరిద్దరూ మౌనమే సమాధానంగా మారింది. ప్రశ్న కార్యాలయానికి ఉచితంగా గది ఎందుకు ఇచ్చారన్న ప్రశ్నకు భవనం ఖాళీగా ఉంటుందని, తమ బంధువు గమన అడగటంతో ఉచింతగా ఇచ్చానని ఇంద్రసేన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అంతకు మించి ఏప్రశ్నకూ సమాధానాలు ఇవ్వలేదు. గత రెండురోజులుగా ఉదయం నుండి సాయంత్రం వరకు విచారణ జరిపినా ఫలితం లేకపోవటంతో పోలీసులు సాంకేతిక అంశాల ఆధారంగా కేసు విచారణ జరపాలని నిర్ణయించారు. దీంతో వీరిద్దరినీ ఈనెల 17న మరోమారు విచారణకు హాజరుకావాలని నోటిసు ఇచ్చి సోమవారం సాయంత్రం పంపించి వేసారు. ఇదిలా ఉండగా రావణ్ ఫోన్‌లో డేటా రికవరీ ద్వారా వచ్చిన వీడియోలలో భాధితుల వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

# ఉలవపాళ్లలో చోరీ కలకలం

## - రూ.2 లక్షల నగదు, రెండు సవర్ల బంగారం, రెండు ట్రాక్టర్లలో డీజిల్ అపహరణ



**దగదర్తి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** దగదర్తి మండలంలోని ఉలవపాళ్ల ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారాన్ని అపహరించడంతో పాటు బయట నిలిపి ఉంచిన రెండు ట్రాక్టర్లలోని డీజిల్‌ను కూడా దొంగిలించారు. బాధితుడు చల్లా నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరులో కూరగాయలు, పండ్ల వ్యాపారం చేస్తూ వ్యవసాయ పనుల కోసం రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ట్రాక్టర్ నెలవారీ వాయిదా చెల్లించేందుకు ఆదివారం సాయంత్రం సుమారు రూ.2లక్షల నగదును ఇంట్లోని బీరువాలో ఉంచి నెల్లూరుకు వెళ్లారు. రాత్రి సుమారు 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చిన నాగేశ్వరరావు ముందుగా బయట నిలిపిన ట్రాక్టర్లలో డీజిల్ దొంగిలించబడినట్లు గుర్తించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉండటంతో పాటు అందులో దాచిన రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారం కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై బాధితుడు దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# 2వ దశ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జాబ్ కేలండర్

# తయారీ సన్నద్ధతపై సిఎస్ సమావేశం



**సచివాలయం, జులై 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండోదశ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జాబ్ క్యాలెండర్ తయారీ సన్నద్ధతపై సోమవారం ఏపి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధ్యక్షతన కార్యదర్శులు, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రెండవ దశ జాబ్ క్యాలెండర్‌కు సంబంధించి భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఈ-హెచ్‌ఆర్‌ఎం, లోకల్ కేడర్ ఆర్గనైజేషన్‌కు అనుగుణంగా నోటిఫికేషన్, నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్ అన్ని కేడర్లలో ప్రాధాన్యత కేటగిరిలకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రిపరేషన్, ఎలాట్‌మెంట్ ఆఫ్ పెర్సన్స్ ఏపిపిఎస్సీ ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీలకు ఇండెంట్స్ పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అన్ని అంశాల్లో ఉద్యోగులతో పూర్తి స్నేహపూర్వకంగా మర్యాద పూర్వకంగా వ్యవహరించి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సర్వీసెస్ మరియు హెచ్‌ఆర్‌ఎం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మాట్లాడుతూ రెండవ దశ జాబ్ కేలండర్‌కు సంబందించి భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఈహెచ్‌ఆర్‌ఎం, లోకల్ కేడర్ ఆర్గనైజేషన్‌కు అనుగుణంగా నోటిపికేషన్ నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్ తదితర అంశాలకు సంబంధించిన టైమ్‌లైన్‌ను వివరించారు. నిర్దేశిత టైమ్‌లైన్ ప్రకారం ఉద్యోగుల కేటాయింపు తదితర చర్యలు పూర్తి చేయాలని, జీవోలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. స్పెషల్ సిఎస్‌లు బి.రాజశేఖర్, కృష్ణబాబు, జి.జయలక్ష్మి, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు

# స.హ. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

## • రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవిబాబు



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 13 ప్రభతవార్త:** సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్థవంతంగా అమలు చేసి, దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవి బాబు సూచించారు. సోమవారం నెల్లూరు పట్టణంలోని చెముడుగుంట జెడ్పీ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, విక్రమ సింహపురి యూనివర్సిటీ, విద్యుత్ భవన్, డీఈఓ కార్యాలయం, జిల్లా పరిషద్, డిపివో, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, జిల్లా రిజిస్ట్రార్, డియంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, డిఎస్పీ, కలెక్టరేట్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) అమలుపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో చట్టం అమలుకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సమాచార హక్కు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలకమైన చట్టమని పేర్కొన్నారు. చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందించడం ప్రతి ప్రజా సమాచార అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పీలేట్ అధికారి వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డు ప్రదర్శించాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని కార్యాలయ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసి, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ రవి బాబు స్పష్టం చేశారు.

# ప్రభుత్వంపై తిరుగుబాటు కాదు, కార్యకర్తల ఆవేదన వ్యక్తం చేసా

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం, జులై 13 ప్రభాతవార్త:** రెండురోజుల క్రితం పిఏసిఎస్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను చేసిన వాఖ్యలు ప్రభుత్వానికి, టిడిపికి వ్యతిరేకంగా కాదని టిడిపి నాయకులు, కార్యకర్తల ఆవేదనను తాను బహిరంగ వేదికపై వ్యక్తపరిచానని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ వివరించారు. సోమవారం సాయంత్రం ఆయన విజయవాడలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో టిడిపి వ్యతిరేకులకు కాంట్రాక్టులు ఇవ్వటంపై కార్యకర్తల ఆవేదనను తాను వ్యక్తపరిస్తే కొన్ని యూట్యూబ్ ఛానళ్ళు, నీలిమీడియా దానిని చిలువలు పలువలుగా చిత్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. విమానాశ్రయం టెండర్ వ్యవహారంలో తాను ఏవ్యక్తికైనా టెండర్ ఇప్పించేందుకు ప్రయత్నించినట్లుగాని సిఫార్సు చేసినట్లుగాని నిరూపిస్తే మరుక్షణం పదవికి రాజీనామా చేస్తానని తనపై ఆరోపణలు చేసేవారు నిరూపించాలని సవాల్ చేసారు. విమానాశ్రయ ఎడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ హోదాలో తాను ఎడ్వయిజరీ కమిటీ సమావేశానికి హాజరయ్యానని మిగిలిన పనులకు టెండర్ ఇవ్వటం, వ్యయం పెరగటంపై ఆసమావేశంలో చర్చకు వచ్చినట్లు చెప్పారు. ఇదే అంశంలో బందరు, విజయవాడ పార్లమెంటు సభ్యులు సైతం దీనిపై ప్రశ్నలు వేసారని గుర్తుచేసారు.

ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికే తీసుకువెళతానని స్పష్టం చేసారు. ప్రత్యర్థులతో సంబందాలు ఉన్నవారికి కాంట్రాక్టులు దక్కుతున్నాయని గన్నవరంలో ఐదేళ్ళపాటు పార్టీకోసం కష్టపడి కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్ళిన కార్యకర్తలకు ఆవేదన ఉందని, వారంతా తమ ఆవేదనను తన దృష్టికి తెస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. విజయాడయిరీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపి బాద్యులపై చర్యలు తీసుకోవాలని తాను అసెంబ్లీలోనే ప్రస్తావించిన సంగతిని ఈసందర్భంగా యార్లగడ్డ గుర్తుచేసారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బయటకు రాని వ్యక్తులు ఇప్పుడు టిడిపి నాయకులమంటూ తిరగటం తీవ్ర అభ్యంతరకరమన్నారు.

# తిరుపతిలో తెలుగుతమ్ముళ్ల ఆక్రోశం

# మీడియా ప్రతినిధులపై దాడి



**తిరుచానూరు, జులై 13 ప్రభాతవార్త:** తిరుపతికి సమీపంలోని తిరుచానూరు మార్గంలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన అన్నమయ్యజిల్లా తంబళ్ళపల్లి, పుంగనూరు నియోజక వర్గాల సమన్వయ సమావేశం రచ్చరచ్చగా మారింది. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జిలను నిర్ణయించేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హోటల్‌లో సమావేశం జరుగుతున్న సమయంలో మీడియా కెమెరామెన్‌లు లోపలకు వెళ్ళేందుకుచూడగా కొందరు పుంగనూరుకు చెందిన తెలుగుతమ్ముళ్ళు అడ్డుకుని పిడిగుద్దులుతో దాడిచేశారు. టిడిపి శ్రేణుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఇలా జరగడంతో మీడియా నివ్వెరపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఘర్షణలు శృతిమించి మీడియా వారిపై కూడా అమానుషంగా దాడి చేయడం జరిగినది. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన తెదేపా పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవ పడుతున్న క్రమంలో ఆ దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై తెలుగు తమ్ముడు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దాడి చేయడమే కాకుండా వాళ్ళ దగ్గర ఉన్న కెమెరాలు మొబైల్ ఫోన్లు లాక్కునే ప్రయత్నం చేసి బీభత్సం సృష్టించారు. వెంటనే స్పందించిన మీడియా ప్రెస్ క్లబ్ వారు సంఘటన స్థలానికి చేరుకొని పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వెంటనే రాష్ట్ర మంత్రులు జనార్ధన్, మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, సాప్ చైర్మన్ రవి నాయుడు మీడియా మిత్రులను పరామర్శించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడే విధుల్లో ఉన్న డిఎస్పీకి మీడియా ప్రతినిధులు మురళి, బాలచంద్ర, జగన్ తదితర మీడియా నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు స్పందించి వెంటనే వారిపై తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# సారూ... మా పొట్ట కొట్టొద్దు!

## • ఆసుపత్రి వద్ద ఆక్రమణలు తొలగింపు • బాధితుల అడ్డగింపుతో ఉద్రిక్తత



**అనంతపురం క్రైమ్, జులై 13 ప్రభాతవార్త:** రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి మాది. సారూ మా పొట్ట కొట్టకండి.. కొన్నేళ్లుగా తాత్కాలిక అవాసాలు ఏర్పాటు చేసుకొని టీ కొట్టులు, టిఫిన్ సెంటర్లు పెట్టుకొని బతుకుతున్నాం.. మాకు ఇదే జీవనదారం.. రోజంతా కష్టపడి వచ్చిన సంపాదనతోనే పూట గడుస్తుంది.. దయచేసి మా టీ కొట్టులు టిఫిన్ సెంటర్లు తొలగించకండి అంటూ బాధితులు మునిసిపల్ అధికారులు పోలీసులకు విన్నవించుకున్నారు. అయినా ప్రజల సౌకర్యార్థం మేరకు తప్పని పరిస్థితి అంటూ పోలీసుల సాయంతో మునిసిపల్ అధికారులు రోడ్డు ఆక్రమణలపై కన్నెర్ర చేశారు. ఇదంతా నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జిల్లా సర్వజన ఆసుపత్రి ఎదుట సోమవారం చోటుచేసుకుంది. సోమవారం ఉన్నపలంగా మునిసిపల్ అధికారులు రోడ్డుకిరువైపులా వున్న ఆక్రమణలను జెసిబి సాయంతో వాటిని తొలగించేందుకు ఉపక్రమించారు. అయితే స్థానిక టూ టౌన్ పోలీసుల బందోబస్త్ మధ్య వాటిని తొలగించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ప్రజల ఫిర్యాదు మేరకే చర్యలు తీసుకున్నాం.. మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు అందడంతో ఈ చర్య చేపట్టాము. ఆసుపత్రి ముందు ఉన్న ఆక్రమణల కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, అలాగే ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, ప్రజల భద్రత, సౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేలా ఈరోజు ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు. ప్రజల భద్రత, సౌకర్యం, ట్రాఫిక్ సౌలభ్యం ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

# మత్స్యకారుల సేవలో కీలక నిర్ణయం

## 5,910 మంది లబ్ధిదారులకు రూ.11.82 కోట్లు మంజూరు

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 సంవత్సరానికి "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం కింద సముద్ర వేట నిషేధ కాల భృతి విడుదలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)ను సోమవారం విడుదల చేసింది. ఈ పథకం కింద మొదటి విడతలో 1,28,388 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో సాంకేతిక, ఇతర కారణాల వలన మిగిలిన 5,910 మంది లబ్ధిదారులకు రూ.11.82 కోట్లు మంజూరు చేసింది. మొత్తంగా 1,34,298 మంది మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందనుంది. సముద్ర వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ భృతిని ప్రభుత్వం అందిస్తోంది. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి జీవనోపాధి భద్రత కోసం తీసుకున్న కీలక నిర్ణయంగా ఈ జీవో నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# మహిళల నాయకత్వ అభివృద్ధిపై మంత్రి లోకేష్‌కు స్పష్టమైన దూరదృష్టి

## - మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల నాయకత్వ అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ కు స్పష్టమైన దూరదృష్టి ఉందని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. సోమవారం అమరావతి కరకట్ట వద్దనున్న ముఖ్యమంత్రి నివాసములో మంత్రి నారా లోకేష్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్ల అమలు నేపథ్యంలో మహిళల నాయకత్వ వికాసం, సమాజంలో మహిళలకు లభించాల్సిన మద్దతు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మహిళల గౌరవాన్ని కించపరిచే సోషల్ మీడియా వ్యాఖ్యల విషయంలో సొంత పార్టీకి చెందిన వారిపైనా రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలనే మంత్రి లోకేష్ సంకల్పం అభినందనీయమని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. మాటల్లో, చేతల్లో, సైగల్లో ఎలాంటి రూపంలోనైనా మహిళలను అవమానించే చర్యలను సహించబోమని రాష్ట్ర నాయకుడిగా నారా లోకేష్ ఇచ్చిన పిలుపు మహిళల స్థితిగతుల్లో సానుకూల మార్పునకు దోహదపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

# స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పేరిట మోసం

# రూ.21.7 లక్షలకు టోకరా

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట విజయవాడ, సింగ్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి లక్షలాది రూపాయలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విజయవాడ అజిత్ సింగ్ నగర్, డాబాకొట్ల సెంటర్సమీపంలో నివసిస్తున్న 46ఏళ్ళ వయస్సున్న సయ్యద్ సలీం అనే వ్యక్తికి ఫోను ద్వారా పరిచయమైన ఒక వ్యక్తి ఫిడెలిటీ ఇంటర్నేషనల్ అనే సంస్థకు చెందినదిగా పేర్కొంటూ ఒక వాట్సాప్ గ్రూపులో చేర్పించారు. ఆ గ్రూప్ సభ్యులు అడ్మినిస్ట్రేటర్లు, పెట్టుబడి సలహాదారులుగా నటిస్తూ తాము నిజమైన ఆర్థిక నిపుణులుగా పరిచయం చేసుకున్నారు. స్టాక్ మార్కెట్, ఐ.పి.ఓ. పెట్టుబడుల ద్వారా అధిక రాబడిని ఆశచూపించారు. రోజూ వివిధ వ్యక్తులకు ఈ పెట్టుబడుల ద్వారా లక్షలాది రూపాయలు లాభాలు వస్తున్నట్లు వాట్సప్ గ్రూపు మెసేజ్ ల ద్వారా నమ్మించారు. ఇది నిజమని నమ్మిన సలీం తను కూడా వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు ఫోను వ్యాలెట్ ద్వారాపలుమార్లుగా మొత్తం రూ.21లక్షల 70వేలు చెల్లించారు. తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి వివరాలు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి ప్రశ్నించడంతో అసలు బండారం బయటపడింది. ఇంకా డబ్బు జమ చేస్తే తిరిగి వస్తుందంటూ బూటకపు మాటలు చెబుతూ ఉండటంతో బాధితుడు విజయవాడ పోలీసులను ఆశ్రయించాడు. విజయవాడ, అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎరువుల కొరతలేదు: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి కావాల్సిన పరిమాణంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా స్పష్టం చేసారు. జిల్లాలో ఎరువుల కొరత ఉందంటూ వదంతులు సృష్టించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపిఏఐయంఎస్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా అందస్తున్నట్లు చెప్పారు. రైతు తన భూమి విస్తీర్ణానికి సంబందించిన అంతమేరకు సరిపడా ఎరువులు అందస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను ఒకేసారి కాకుండా మూడుదఫాలుగా అందిస్తామన్నారు. ఎరువుల సరఫరాలో ఇబ్బందుల ఎదురైతే 9154970454 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో జిల్లావ్యవసాయఅధికారి విజయకుమారి, ఉద్యానశాఖాధికారి బాలాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నేటితో సర్‌కు లాస్ట్:** సర్ కార్యక్రమం మంగళవారంతో ముగుస్తుందని ఓటర్లు తమ వద్ద ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను తక్షణమే బిఎల్ఓలకు అందచేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 17,13,445 ఓటర్లకు గానూ 16,35,148 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ చేసినట్లు చెప్పారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

## - మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

**కావలి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** దేశంలో పిఎం నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రబత్వం ఏపిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు, ప్రాంతీయ రాజకీయాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. గత 12 ఏళ్ళుగా పిఎం పరిపాలనలో ప్రజలకు చేకూరిన లబ్ది ఏమి లేదని విమర్శించారు. ఆయన రామాలయ నిర్మాణం కోసం దేశ వ్యాప్తంగా ప్రతి ఇల్లు, గ్రామం కోటీశ్వరుల నుంచి వేల కోట్ల రుపాయల చందాలు వసూలు చేశారన్నారు. అయితే ఆ నిధుల్లో 75శాతం మేర అవినీతి జరిగిందని యూపి ప్రజలే చెప్పుకోవడం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణకు ఆదేశించిన దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ నిధులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ తరపున ఆయన డిమాడ్ చేశారు.

# 15న ఐటిఐ కాలేజీలో జనరల్‌పూల్ కౌన్సెలింగ్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** విజయవాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 15వతేదీ జనరల్‌పూల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్‌టీఆర్‌జిల్లా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ యం.కనకారావు సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఐటిఐ కోర్సుల్లో చేరేందుకు ధఖాస్తు చేసుకుని ఇప్పటి వరకు సీటు రాని అభ్యర్ధులు, గత కౌన్సిలింగ్‌కు హాజరుకాని అభ్యర్ధులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# సెమీస్‌లో సూపర్ పవర్స్ సమరం




ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్‌కప్ చివరి స్టేజ్‌కు చేరుకుంది. ఇపుడు ఫుట్‌బాల్ ప్రపంచం చూపంతా సెమీస్‌పైనే.. నాలుగు దిగ్గజాల మధ్య పోరు ఆసక్తి రేపుతోంది. డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో పాటు రన్నరప్ ఫ్రాన్స్, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, ఇంగ్లాండ్ జట్లు సెమీస్‌కు వచ్చాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత విజయవంతమైన, బలమైన జట్లుగా పేరుగాంచిన ఈ నాలుగు దేశాలు ఒకే టోర్నీలో చివరి నాలుగులో నిలవడం అభిమానుల్లో ఉత్కంఠను పెంచింది.

(వార్త క్రీడా విభాగం)

ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి గ్రూప్ దశలో 48 జట్లు పోటీపడ్డాయి. రౌండ్ ఆఫ్ 32, ప్రిక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్స్‌లో వడపోత తర్వాత నాలుగు జట్లు మిగిలాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అర్జెంటీనా దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టగా, 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీస్‌కు దూసుకొచ్చింది. ఇక 16 ఏళ్ల తర్వాత స్పెయిన్ (2010 విజేత) సెమీస్‌లో అడుగుపెడితే, అటు మాజీ చాంపియన్ ఇంగ్లాండ్ కూడా తన దూకుడైన ఆటతీరుతో సెమీస్‌లో అడుగుపెట్టింది. ఇప్పటి దాకా తమకు ఎదురైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ వచ్చిన ఈ నాలుగు జట్లు నువ్వా నేనా అన్న రీతిలో సెమీస్‌లో తలపడనున్నాయి.

**ఫ్రాన్స్ వర్సెస్ స్పెయిన్**

మొదటి సెమీఫైనల్లో ఫ్రాన్స్-స్పెయిన్ తలపడనున్నాయి. యువ స్టార్ లామిన్ యమాల్ నాయకత్వంలో దూసుకెళ్తున్న స్పెయిన్, కిలియన్ ఎంబాపె నేతృత్వంలోని ఫ్రాన్స్‌కు గట్టి సవాల్ విసరనుంది. రెండు జట్లూ దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను ఓడిస్తూ సెమీస్‌కు చేరుకున్నాయి. ఎంబాపె అన్నీ తానై ఫ్రాన్స్‌ను నడిపిస్తున్నాడు. ఈసారి ఫిఫాలో ఆడిన 6 మ్యాచ్‌ల్లో 8 గోల్స్, మూడు అసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. ఎంబాపె తర్వాత ఒస్మేన్ డెంబ్లీ కూడా ఫ్రాన్స్‌కు బలమైన ఆటగాడు. ఫార్వార్డ్ ప్లేయర్ అయిన డెంబ్లీ ఆరు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్, రెండుఅసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. ఇక స్పెయిన్ తరఫున కెప్టెన్ రోడ్రితో పాటు యామినే లమాల్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు. వీరిద్దరితో పాటు మైకెల్ ఒయర్‌జబాల్ (ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు గోల్స్), గోల్ కీపర్ ఉనైయి సిమోన్‌లు కూడా తమదైన ఆటతో ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

**అర్జెంటీనా వర్సెస్ ఇంగ్లాండ్**

మరో సెమీఫైనల్లో ఇంగ్లాండ్-అర్జెంటీనా మధ్య భారీ పోరు జరగనుంది. కెప్టెన్ లియోనెల్ మెస్సీకి ఇది అత్యంత కీలక మ్యాచ్‌గా మారగా, హ్యారీ కేన్ సారథ్యంలో ఇంగ్లాండ్ తమ తొలి ప్రపంచకప్ లక్ష్యాన్ని సాధించాలని పట్టుదలగా ఉంది. ఈ మ్యాచ్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ హ్యారీకేన్ ఈసారి ఎలాగైనా ఫిఫా ప్రపంచకప్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు.ఆరు మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్‌తో పాటు ఒక అసిస్ట్ చేసి ఆ జట్టు తరఫున గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. హ్యారీకేన్‌కు తోడుగా జూడ్ బెల్లింగ్‌హామ్ కూడా కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. బెల్లింగ్‌హామ్ కూడా ఆరు గోల్స్ చేసి హ్యారీకేన్‌తో సమానంగా ఉన్నాడు. ఇక డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాకు కర్త, కర్మ, క్రియ.. లియోనల్ మెస్సీ. మెస్సీ ఆరు మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో రెండో స్థానంలో ఉన్నాడు. మెస్సీతో పాటు ఎమిలో మార్టినేజ్, జులియన్ అల్వరెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్‌లు అర్జెంటీనా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఇరు సెమీఫైనల్ విజేతలు జులై 19న జరిగే ఫైనల్లో తలపడ తాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌కు కొత్త ఛాంపియన్ ఎవరో తేలే ముందు జరిగే ఈ రెండు సెమీస్ ఫైట్స్ అభిమానులకు అసలైన ఫుట్‌బాల్ పండుగగా నిలవనున్నాయి. గత ఫిఫా ప్రపంచకప్ లాగే ఈసారి ఫైనల్లో అర్జెంటీనా, ఫ్రాన్స్ పోరును చూస్తామా లేక స్పెయిన్, ఇంగ్లండ్ ఆట చూస్తామా అనేది మరో రెండు రోజుల్లో తేలిపోనుంది. మొత్తానికి సెమీస్‌లో ఫుట్‌బాల్ దిగ్గజాల సమరం సర్వత్రా ఆసక్తి రేపుతోది.



## భారత్ బాక్సర్ల పంచ్‌కు15 మెడల్స్

**జకార్తా, జులై 13:** ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరుగుతున్న ఆసియా అండర్-19, అండర్-23 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పవర్ పంచ్‌లతో విరుచుకుపడుతున్నారు. అద్భుత ప్రదర్శనతో 15మెడల్స్ ఖాయం చేశారు. అండర్-23 పురుషులు,మహిళల విభాగాల్లో మొత్తం ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్‌కు చేరుకున్నారు. మరో ఏడుగురు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు ఖాయం చేసుకున్నారు.

మహిళల అండర్-23 విభాగంలో నిషా (54 కేజీలు) దక్షిణ కొరియాకు చెందిన హ్యాజూ లీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. నికితా చంద్ (60 కేజీలు) జపాన్‌కు చెందిన సారీ కొకుఫును ఓడించగా.. కాజల్ (65 కేజీలు) కిర్గిజ్‌స్తాన్‌కు చెందిన గుల్జినా మెల్స్‌వెక్‌పై ఏకపక్ష విజయం సాధించింది. ముస్కాన్ (75 కేజీలు) ఉజ్బెకిస్థాన్‌కు చెందిన టోయిరోవా ఓయ్షాపై 5-0 తేడాతో గెలవగా, ప్రియాంక (80 కేజీలు) కజకిస్థాన్‌కు చెందిన పనార్ సెయిట్‌ఖాంకిజీపై 5-0 స్కోరుతోనే విజయం సాధించింది.

ఇక పురుషుల అండర్-23 విభాగంలో విశ్వనాథ్ సురేశ్ (50 కేజీలు) ఫిలిప్పీన్స్ ప్రత్యర్థిని 5-0తో చిత్తు చేశాడు. గంగా(55 కేజీలు) జపాన్ బాక్సర్‌పై 3-2 స్ప్లిట్ డెసిషన్‌తో గెలిచి ఫైనల్‌కు చేరాడు. వంశజ్ (65 కేజీలు) కిర్గిజ్‌స్తాన్ ప్రత్యర్థిపై 4-1 తేడాతో విజయం సాధించి బంగారు పతక పోరుకు అర్హత సాధించాడు.

మహిళల అండర్-23 విభాగంలో తను (51 కేజీలు), ప్రాచి (57 కేజీలు), శివాని (70 కేజీలు), నైనా (80 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో హితేష్ (70 కేజీలు), నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (90 కేజీలు) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

## భారత్, ఇంగ్లాండ్ తొలి వన్డే

### నేటి మధ్యాహ్నం 3.30 గంటలకు

**బర్మింగ్‌హామ్, జులై 13:** టీ20 సిరీస్ ఓడిన టీమిండియా... ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి వన్డే బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకుంది.

స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై భారీ అంచనాలు ఉన్నాయి. వీరిద్దరితో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేరిక భారత్ బ్యాటింగ్‌ను పటిష్టం చేసింది. టాప్ ఆర్డర్ బలంగా మారింది. జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్ వంటి పేసర్లు భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులో చేరడం భారత బౌలింగ్‌ను పటిష్టం చేయనుంది. గాయంతో హర్షిత్ రాణా సిరీస్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం లభించింది.

ఇంగ్లండ్ జట్టులో జో రూట్ పునరాగమనం చేయనున్నాడు. బెన్ డకెట్, జేకబ్ బెతెల్ ఆరంభంలో వేగంగా పరుగులు సాధించగలరు. టీ20 సిరీస్‌లో పరుగుల వరద పారించిన కెప్టెన్ హారీ బ్రూక్స్, జోస్ బట్లర్ జోడీ మధ్య ఓవర్లలో జట్టుకు కీలకం కానుంది. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సాధారణంగా తొలి ఓవర్లలో పేసర్లకు కొంత సహకరిస్తుంది. కొత్త బంతిని సమర్థంగా ఎదుర్కొన్న జట్టుకు భారీ స్కోరు చేసే అవకాశం ఉంటుంది.




## భారత్ అమ్మాయిల చారిత్రక టెస్ట్ విజయం

**లండన్, జులై 13:** లార్డ్స్ టెస్ట్‌లో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. చారిత్రక టెస్ట్‌లో 270 పరుగులతో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం అందుకున్నారు. మూడో రోజే విజయం ఖాయమైనా... నాలుగో రోజు తొలి సెషన్‌లో మిగతా నాలుగు వికెట్లు కూల్చి టీమిండియా గెలుపును ఖాతాలో వేసుకుంది.

ఓవర్‌నైట్ స్కోరు ఆరు వికెట్లకు 130 పరుగులతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్‌ను లంచ్ లోపే భారత బౌలర్లు కుప్పకూల్చారు. 52 పరుగులకు మరో రెండు పరుగులు జోడించిన అమీ జోన్స్(80 బంతుల్లో 54)ను స్నేహ రాణా అవుట్ చేసి నాలుగో రోజు వికెట్ల పతనానికి నాంది పలికింది. ఆతర్వాత ఇస్సీ వాంగ్(1), లూరెన్ బెల్(0)లను వెంటవెంటనే దీప్తి శర్మ అవుట్ చేసింది. మరో ఎండ్‌లో సోఫీ ఎస్సెల్‌స్టోన్(66 బంతుల్లో 50రన్స్) ధాటిగా ఆడుతూ కాసేపు భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. చివరికి అర్ధసెంచరీ చేసిన ఎస్సెల్‌స్టోన్‌ను స్నేహ రాణా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 186 పరుగుల వద్ద ముగిసింది. చివరి నాలుగు వికెట్లు 56 పరుగులకే పడిపోయాయి.

అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 రన్స్ చేయగా, ఇంగ్లాండ్ 170 పరుగులకు ఆలౌటైంది. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 341/7 వద్ద డిక్లేర్ చేసింది. 115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని 457 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు. క్రాంతి గౌడ్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... మొత్తం ఏడు వికెట్ల ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. తొలి టెస్టు మ్యాచ్‌లో యస్తికా భాటియా (113) సెంచరీ సాధించింది. ఓపెనర్ స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలతో మెరిసింది. లార్డ్స్‌లో భారత మహిళా జట్టు తొలిసారి టెస్టు ఆడటంతో క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ హాజరయ్యారు.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 285**(మంధాన 83, హర్మన్‌ప్రీత్ 58, దీప్తి శర్మ 57, సోఫీ 3/68); **రెండో ఇన్నింగ్స్: 341/7డిక్లేర్డ్** (మంధాన 70, యాస్తికా113, రిచాఘోష్ 50 నాటౌట్); **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 170**(అమీజోన్స్ 52, బ్రంట్ 44, క్రాంతి5/37, సయాలీ 2/40, స్నేరాణా 2/41); **రెండో ఇన్నింగ్స్ 186**(అమీ జోన్స్ 54, సోఫీ 50,స్నేరాణా 4/42, క్రాంతి 2/54).




## ఐటీ షేర్లలో జోష్
## స్వల్ప లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ


**ముంబయి,జులై 13:** తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ నేపథ్యంలో కంపెనీలకు సంబంధించిన వార్తలపైనే ఇన్వెస్టర్ల ఫోకస్ నిలవడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు చివరికి కోలుకుని స్వల్పంగా పెరిగాయి. ఐటీ షేర్ల లో బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధాన మద్దతుగా నిలిచాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3.59 శాతం ఎగిసిపడగా, టీసీఎస్ 5.51 శాతం లాభపడటం ఈ రంగానికి ఊతమిచ్చింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు కూడా పెరిగాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 47.04 పాయింట్లు పెరిగి 77,616.40 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 4.10 పాయింట్లు లాభపడి 24,211 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.90, భారతి ఎయిర్‌టెల్ 0.87, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83 ప్రధానంగా సూచీలపై ఒత్తిడి తెచ్చిన షేర్లుగా నిలిచాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.02 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,335 షేర్లు లాభపడగా, 2,068 షేర్లు నష్టపోయాయి. 201 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.3800తో పోలిస్తే 95.6700 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026నాటి పసిడి సెటిల్‌మెంట్‌ధర 0.94 శాతం తగ్గి రూ.1,42,133 వద్దకు చేరింది.కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2.33 డాలర్లు పెరిగి 78.34 డాలర్లకు చేరింది.

ఐటీ షేర్లలో భారీ ర్యాలీనిఫ్టీ ఐటీ సూచీ 3.59 శాతం పెరిగి 29,015.85 వద్ద ముగిసింది.వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 5.62 శాతం లాభపడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 5.51, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 5.15, ఇన్ఫోసిస్ 3.24 , టెక్ మహీంద్రా 3.24, ఎంఫాసిస్ 3.01, కోఫోర్జ్ 2.67,పర్సిస్టెంట్ సిస్టమ్స్ 2.63,విప్రో 1.68, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.68 చొప్పున లాభపడ్డాయి. ఎల్‌టీఎం షేరు కూడా 2.25 శాతం పెరిగింది.కంపెనీల వారీగాఎన్ఎండీసీ షేరు 0.80 శాతం తగ్గింది.ఫినో పేమెంట్స్ బ్యాంక్ షేరు 19.64 శాతం ఎగసింది. జస్ట్ డయల్ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఎల్అండ్‌టీ ఫైనాన్స్ షేరు 1.07 శాతం పెరిగింది. 2026 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 28.72 శాతం పెరిగి రూ.902.47 కోట్లకు చేరగా, మొత్తం కార్యకలాపాల ఆదాయం 22.38 శాతం వృద్ధితో రూ.5,212.92 కోట్లుగా నమోదైంది.స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ 1.35 శాతం లాభపడింది.


63 మూన్స్ టెక్నాలజీస్ 7.81 శాతం ఎగసింది.అవాంటెల్ 1.42 శాతం పెరిగితే బజాజ్ కన్స్యూమర్ కేర్ 1.53 శాతం తగ్గింది. ఇండస్ టవర్స్ 0.71 శాతం లాభపడింది.ఐపీఓ అప్‌డేట్‌సాయంత్రం 4:27 గంటల నాటికి లేజర్ పవర్ ఇన్‌ఫ్రా ఐపీఓకు భారీ స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ చేసిన 2.55 కోట్ల షేర్లకుగాను 99.17 కోట్ల షేర్లకు బిడ్లు అందాయి. దీంతో ఈ ఇష్యూ 38.76 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధర బ్యాండ్‌ను రూ.203-214గా నిర్ణయించారు.

## ఒక్కనెలలో భారత్ ఎగుమతులు
## 40.41 బిలియన్ డాలర్లు



**న్యూఢిల్లీ, జులై 13:**భారత్ ఎగుమతులు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 15.5 శాతం పెరిగి 40.41 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, విలువైన ఖనిజాల దిగుమతులు గణనీయంగా పెరగడంతో దేశ వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లకు పెరిగింది.వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాణిజ్య గణాంకాలను వెల్లడిస్తూ, జూన్ నెలలో దిగుమతులు సుమారు 31శాతం పెరిగి 70.84 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని దీంతో వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లుగా నమోదైందన్నారు. పశ్చిమాసియా దేశాలకు భారత్ ఎగుమతులు కూడా జూన్ నెలలో 7.29 శాతం పెరిగి సుమారు 5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు,సేవల కలిపిన మొత్తం ఎగుమతులు 11.37శాతం వృద్ధితో 232.73 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతఏడాది ఇదే కాలంలో ఈ విలువ 208.98 బిలియన్ డాలర్లుగా ఉంది.తొలి త్రైమాసికంలో ఎగుమతులు 15.92శాతం పెరిగి 129.32 బిలియన్ డాలర్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అవి 111.57 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. నాన్‌పెట్రోలియం ఎగుమతులు కూడా బలమైన వృద్ధిని నమోదు చేశాయి. ఏప్రిల్‌జూన్ కాలంలో ఇవి 12.44 శాతం పెరిగి 106.30 బిలియన్ డాలర్లకు చేరగా, గత ఏడాది ఇదే కాలంలో 94.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు జూన్‌లో20.74శాతం పెరిగి 11.48బిలియన్ డాలర్లకు చేరాయి.గత ఏడాది ఇదే నెలలో ఇవి 9.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.ఎలక్ట్రానిక్ వస్తు వుల ఎగుమతులు 18.93శాతం పెరిగి 4.93బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## హెచ్‌సిఎల్ టెక్ నికరలాభం రూ.4624 కోట్లు




**న్యూఢిల్లీ,జులై 13:** దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను సోమవారం ప్రకటించింది.ఈ త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల నిష్క్రమణ రేటు 12.5 శాతం నుంచి 12.7శాతానికి పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 12.8 శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా తగ్గింది. తొలి త్రైమాసికంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,292 మందికి తగ్గి 2.24 లక్షలకు చేరుకుంది. కంపెనీ 1,056 మంది కొత్త ఉద్యోగులను నియమించుకుంది. మూలధన వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపైనే సంస్థ దృష్టి కేంద్రీకరించినట్లు యాజమాన్యం తెలిపింది.ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే, కంపెనీ స్టాండ్‌అలోన్ నికర లాభం 3 శాతం పెరిగి రూ.4,624 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 1.8 శాతం వృద్ధితో రూ.34,579 కోట్లుగా నమోదైంది. కంపెనీ నికర లాభం రూ.4,529 కోట్లు, ఆదాయం రూ.34,326 కోట్లుగా ఉండొచ్చని భావించగా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వాటిని మించి ఫలితాలను నమోదు చేసింది.వడ్డీ, పన్నులకు ముందు లాభం కూడా 3.8 శాతం పెరిగి రూ.5,831 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసికంలో ఇది రూ.5,620 కోట్లుగా నమోదైంది.రూ.12 మధ్యంతర డివిడెండ్‌షేర్‌హోల్డర్లకు శుభవార్తగా కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.12 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించి జూలై 17, 2026ను రికార్డ్ తేదీగా నిర్ణయించింది. అర్హులైన వాటాదారులకు డివిడెండ్ మొత్తాన్ని జూలై 27, 2026న చెల్లించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ షేర్ ధర 4.91 శాతం పెరిగి రూ.1,221.20 వద్ద ముగిసింది.

కార్మిక రాజ్య బీమా సంస్థ
Employees' State Insurance Corporation



"కార్మికులందరికి ఉదారమైన మరియు సమగ్ర సామాజిక భద్రత వ్యవస్థను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది."
నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

దేశవ్యాప్తంగా
శ్రమ జీవుల ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేయటం

ప్రారంభోత్సవం
నూతన ఓపిడి బ్లాక్, ESIC ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ
మరియు
వర్చువల్ గా ప్రారంభోత్సవాలు

100 పడకల ESIC ఆసుపత్రి, శ్రీ పెరుంబుదూర్, తమిళనాడు
100 పడకల ESIS ఆసుపత్రి, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్
200 పడకలకు విస్తరించబడిన ESIC ఆసుపత్రి, బెల్టోల, గువాహటి, అస్సాం
ESI దవాఖానా మరియు బ్రాంచి కార్యాలయం, కోట, రాజస్థాన్
ESI దవాఖానా, భవానిమండి, రాజస్థాన్
ESI దవాఖానా మరియు బ్రాంచి కార్యాలయం, సురేంద్రనగర్, గుజరాత్

డా. మన్సుఖ్ మాండవియా
కార్మిక మరియు ఉపాధి మరియు యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రివర్యులు, భారత ప్రభుత్వం
చేతుల మీదుగా

మంగళవారం, జులై 14, 2026 I ESIC ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ

పథకం లాభాలు
- దాదాపు 53 లక్షల లబ్ధిదారులకు లాభం
- గరిష్ఠ పరిమితి లేకుండ నగదురహిత వైద్య సదుపాయం
- ఇంటి సమీపంలోనే అధునాతన వైద్య పరికరాలతో నాణ్యమైన ఆరోగ్య సేవలు
- ESI దవాఖానాలు మరియు బ్రాంచి కార్యాలయాలలో ఒకే గొడుగు కింద నగదు లాభాలు మరియు ప్రాథమిక ఆరోగ్య సేవలు




మరింత సమాచారం కోసం సందర్శించండి: https://www.esic.gov.in/
లేదా ఫోన్ చేయవలసిన టోల్-ఫ్రీ నంబర్ 1800-11-2526
కార్యక్రమం ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్కాన్ క్యూఆర్ కోడ్

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



# ముఖ్యమంత్రికి నాగలి బహూకరించిన అన్నం దేవుల చంటి

**కడియం, జూలై 13 (ప్రభాతవార్త)** ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల ఆధునీకరణ పనులకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కడియం మండలం,మాధవరాయుడుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ అన్నం దేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చి చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే బుచ్చి చౌదరి సమక్షంలో మాజీ సర్పంచ్ చంటి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రైతు సంస్కృతికి ప్రతీకగా నిలిచే నాగలిని బహూకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైతు పట్ల గౌరవం, వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ బహూకరణ ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధి, గ్రామీణాభివృద్ధికి నాంది పలికే ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల ఆధునీకరణ కార్యక్రమంలో అన్నం దేవుల చంటి పాల్గొనడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంటి సేవలను కొనియాడుతూ మాధవరాయుడుపాలెం గ్రామ ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి మరింత మేలు చేకూర్చాలని ఆకాంక్షించారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం | మంగళవారం 14 జూలై 2026 | I


# రూ.150 కోట్లతో ధవళేశ్వరం బ్యారేజి 117 గేట్ల ఆధునీకరణ పనులకు శ్రీకారం..

**గోదావరి డెల్టా రైతాంగాన్ని ఆదుకుంటున్న రైతు బాంధవులు ముఖ్యమంత్రి చంద్రబాబు..**

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**

**ఆత్రేయపురం, జూలై 13,(ప్రభాత వార్త).** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాతగా, రైతు పక్షపాతిగా, అధికారం అంటేనే బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయడానికి భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తూ నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 నూతన గేట్ల ఏర్పాటు, మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత రైతులు చేసుకున్న అదృష్టమని ఎమ్మెల్యే బండారు కొనియాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పిచ్చుకలంకలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి సభలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ప్రసంగిస్తూ రైతు ఇరిగేషన్ శాఖామంత్రిగా ఉంటే ఆ శాఖ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా ప్రశంసించారు. నాడు కాటన్ మహాశయుడు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు అన్నం పెడితే,ఈ బ్యారేజీని కాపాడటానికి నేడున్నారని అంటూ 117 గేట్ల ఆధునీకరణ పనులు రూ.150 కోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారని, ఈ ప్రాంత ప్రజల పట్ల రైతుల పట్ల ఆయనకున్న మమకారాభిమానాలకు ఇది నిదర్శనమన్నారు. వైసిపి గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో బ్యారేజీ గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని, బేరింగు కూడా బిగించలేదని, చిన్న చిన్న మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో బ్యారేజీ అస్తిత్వమే ప్రమాదంలో పడిందన్నారు. ఈ అంశాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యారేజీకి ఎటువంటి ప్రమాదం జరగకూడదు, గోదావరి డెల్టా రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఆలోచనతో బ్యారేజీ ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టిసీమతో కృష్ణ డెల్టాకు ఊపిరి పోశారన్నారు. వెలిగోడు నిర్వాసితులకు పరిహారం అందజేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారని ప్రశంసించారు. నీటిపారుదల రంగం, రైతు సంక్షేమానికి నిమ్మల కృషి చేస్తున్నారన్నారు. గత గొడ్డలి పార్టీ పరిపాలనలో రాష్ట్రంలో చేసిన ఆర్థిక విధ్వంసాన్ని, అరాచకాలను సరిదిద్దడానికి తన అపారమైన అనుభవంతో అనునిత్యం ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని, రాష్ట్రాన్ని చక్కదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. సెంట్రల్ డెల్టాను కాపాడడానికి లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కోరితే వెంటనే రూ.74.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అభినవ కాటన్ దొరలా, అపర భగీరథునిలా గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు సైతం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కాటన్ ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను కాపాడే శక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకే మాత్రమే ఉందన్నారు. బిందు సేద్యం, ప్రకృతి సేద్యం, వ్యవసాయ ఆధునీకరణ అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వాడపల్లి దేవస్థాన అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బండారు కోరారు. అలాగే పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఏటిగట్ల బలోపేతానికి నిధులు కేటాయించాలని, నదీపాత నివారణకు, కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన స్థలం కేటాయింపు, కొత్తపేట ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణానికి నిధులు కేటాయింపు, వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. పేరూరు వై జంక్షన్ నుంచి రావులపాలెం జాతీయరహదారి వరకు మధ్యలో ప్రతిపాదించిన జాతీయ రహదారి త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ పనులన్నీ చేపడతానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు,మండల తెలుగుయువత అధ్యక్షులు వెత్సా అనీల్ కుమార్, పి ఎస్, రాజు, ఏపుగంటి వెంకటేష్, పెద్ద ఎత్తున రైతులు, టీడీపీ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.







## పోలవరం పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు





**దేవీపట్నం, జూలై 13 (ప్రభాతవార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టు పరిధిలో నిర్మాణంలో ఉన్న 960 మెగావాట్ల పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. దేవీపట్నం మండలం అంగులూరు వద్ద పవర్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస కార్యక్రమాలు, కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ప్రాజెక్టు పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ జిల్లాలో చేపడుతున్న పునరావాస కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు.

# 6 నెలలుగా జీతాలు లేక ఆకలితో అలమటిస్తున్న పారిశుధ్య కార్మికులు

**కార్మికుల ఆకలి వెతలు పట్టించుకోని పంచాయతీ అధికారులు**

**జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు సహకారంతో జిల్లా గ్రీవెన్స్‌లో పిర్యాదు**



**శంఖవరం జూలై 13 ప్రభాతవార్త** శంఖవరం మండలంలోని కొంతంగి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ముగ్గురు పారిశుధ్య కార్మికులకు గడిచిన 6 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబ జీవనం ప్రశ్నార్థకంగా మారిపోయింది. వారి జీతాలు నేటి సమాజంలో పెరిగిన ధరలకు చాలీచాలని రీతిలో ఉండగా, అవి కూడా గడిచిన ఆరు నెలలుగా వారికి జీతాలు ఇవ్వకపోగా, కనీసం అధికారులు చొరవ చూపకపోవడం శోచనీయం. తమకు జీతాలు ఇప్పించండంటూ ఎన్ని సార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకున్న నాధుడే లేరని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేసారు. దీనితో పారిశుధ్య కార్మికులు తమ కష్టాలను స్థానిక జనసేన నేత, రైల్వే డివిజనల్ వినియోగదారుల సలహా మండలి సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు వద్ద మొర పెట్టుకున్నారు. దీనితో పంచాయతీ కార్మికులను వెంట పెట్టుకుని జిల్లా కేంద్రం కాకినాడలో ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ లో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇప్పించండంటూ పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ జీతాలు లేకుండా ఏ ఉద్యోగి అయినా ఎన్నాళ్ళు పని చేస్తారని, ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందించే పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు అధికారులకు ఎందుకు మనస్సు రావడం లేదని, వారి శ్రమకు తగిన ఫలితంగా జీతాలు ఇస్తున్నామా... అని ప్రశ్నించారు. వారికీ కుటుంబాలు ఉన్నాయని, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు వారికి ఉంటాయన్నారు. ఇప్పటికైనా సహృదయంతో జిల్లా అధికారులు కొంతంగి పారిశుధ్య కార్మికుల ఆకలి వెతలను గుర్తించి, వారికి తక్షణమే బకాయి జీతాలు చెల్లించి, ప్రతీ నెలా సమయానికి జీతాలు మంజూరు చేయాలన్నారు.

# ఆక్వా రైతాంగ సమస్యలపై వైకాపా పోరాటం.

**ధరల స్థిరీకరణ చేయాలి.**

**పార్లమెంట్ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం.**

**ఈనెల 15న భీమవరంలో జరిగే రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలి.**



**తాళ్ళరేవు, జూలై 13 (ప్రభాతవార్త):** ఆక్వా రైతాంగ సమస్యల పరిష్కారానికి వైఎస్ఆర్సిపి ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. తాళ్ళరేవు మండలం అరటికాయ లంకలో వైకాపా రాష్ట్ర రైతు విభాగం ఆధ్వర్యంలో అమలాపురం పార్లమెంట్ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ పొన్నాడ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు ఆక్వా రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆక్వా ఫీడు ధరలను తగ్గించి ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు ఆక్వా రైతులకు కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలో రొయ్యల కౌంట్ ధరలు స్థిరంగా ఉండేవని, ప్రస్తుతం పెట్టుబడికి తగిన ధరలు లేక ఆక్వా రైతాంగం వెంటి లేటర్ పై ఉందని అన్నారు. అలాగే ఈ నెల 15న భీమవరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోయే సభకు ఆక్వా రైతాంగం పెద్ద ఎత్తున తరలిరావాలని జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో, ఆయన వెంటనే ఆక్వా రైతుల సమస్యలపై స్పందించి ఫీడ్ ధరలను తగ్గించడంతో పాటు ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు పిల్లి బోస్, జక్కంపూడి విజయలక్ష్మి, పితాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ప్రజలకు ఇచ్చిన బుడబుక్కల హామీలను జగ్గిరెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జున్నూరి రామారావు, కార్యదర్శి పెట్ల సూర్యనారాయణ రాజు, చింతలపాటి శ్రీనివాసరాజు, పాముల రాజేశ్వరి దేవి, చింతా అనురాధ, పినిపే శ్రీకాంత్, పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, ఏడిద సుబ్బు, ఢిల్లీ నారాయణ, ఉంగరాల సంతోష్, కాదా గోవిందకుమార్, పందిరిపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నుండి నిధులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**జగ్గారపు మల్లికార్జున**



**కాకినాడ రూరల్ , జూలై 13(ప్రభాత వార్త):** రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమై తొమ్మిదో స్థానంలో ఉందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లిఖార్జున పేర్కొన్నారు. ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో మల్లికార్జున మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలు, బూతుల దాడులు చేసుకోవడం కంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మల్లిఖార్జున, ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు కేవలం జనసేనకే పరిమితం కాదని,కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉపయోగిస్తున్న బూతు భాషను మార్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి మరిన్ని నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీకి వ్యతిరేకంగా పోరాడిన జడ శ్రావణ్ కుమార్ ని ఇప్పుడు విస్మరిస్తున్నారని ఆయన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తమ జె.బి.పి పార్టీ కూడా కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని ప్రజా ప్రతినిధులు బూతు పురాణాలు మానుకుని రాజకీయ విభేదాలను పక్కనబెట్టి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని జగ్గారపు మల్లిఖార్జున హితవు పలికారు.

## వైభవంగా అగస్త్యేశ్వర స్వామివారి రథయాత్ర



**రామచంద్రపురం,జూలై 13(ప్రభాతవార్త):** పట్నంలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రథయాత్ర ఘనంగా నిర్వహించారు.రథయాత్రలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.ఆలయంలో మంత్రి సుభాష్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో ఉండాలని,రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.అనంతరం రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి సేవలందించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ,ఈవో సీహెచ్ సత్యనారాయణ,ఆలయ కమిటీ సభ్యులు,కూటమి పార్టీ నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు..

**నిత్యాన్న పథకానికి రూ,1,00,008/- విరాళం...**



**ఆత్రేయపురం, జూలై 13,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. ఉదయం మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, బాలబోగం, గోపూజ, అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం, నివేదన, తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. పెద్దాపురం చెందిన మాదె లలిత, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,008/- వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్ లు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.



# గోదావరి జిల్లాల జీవనాడి

**▸▸ కాటన్ బ్యారేజ్ - ఏపీ ప్రభుత్వం చారిత్రక ఘట్టానికి శ్రీకారం**

**▸▸ విధ్వంసం నుండి వికాసం వైపు**

**▸▸ చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమం అందిస్తుంది... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**





**ఆత్రేయపురం, జూలై 13,(ప్రభాత వార్త).** గోదావరి జిల్లాల జీవనాడి కాటన్ బ్యారేజ్‌కు 117 కొత్త గేట్లు ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. 152 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పనులకు రైతుల ఉత్సాహం మధ్య సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. 1847 లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన ధవళేశ్వరం ఆనకట్ట మరోసారి ఆధునీకరణ కు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పిచ్చుకలంక వద్ద రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన-బీజేపీ మూడు పార్టీలు రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తున్నాయని , ప్రధాని మోదీ-నేను-పవన్ కళ్యాణ్ నాడు ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని అన్నారు.విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తూ చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని విధంగా సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ కు ఫ్యాన్స్ ఎక్కువ... జనంలోకి వచ్చిన కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భుజం నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నారు. ముంబై వెళ్లి పవన్ కళ్యాణ్ ను పరామర్శించాను. పూర్తిగా విశ్రాంతి తీసుకోకుండా జనంలోకి వస్తానని డిప్యూటీ సీఎం అంటున్నారు.విశ్రాంతి తీసుకోమని చెప్పాను... ఆరోగ్యం బాగుంటే మరింత బాగా ప్రజల కోసం పని చేయవచ్చని సూచించానని తెలిపారు. మోదీ-నేను-పవన్ ఆలోచన లక్ష్యం అభివృద్ధి-సంక్షేమమే. ఈ నెలలో తల్లికి వందనం కింద డబ్బులు జమ చేస్తాం... ప్రతి నెలా పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్నాం... అన్నదాత సుఖీభవ నిధులను రైతులకిచ్చాం.పోలవరం డయా ఫ్రం వాల్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం గోదావరి పాలు చేశారు. 2014-19 మధ్య కాలంలో 72 శాతం మేర పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. గత ప్రభుత్వం కేవలం 2 శాతం పనులు మాత్రమే చేపట్టింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వమే కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేది.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 89 శాతం మేర పనులను పూర్తి చేశాం. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తాం.. వారికి ఆనందం కలిగిస్తాం. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లిస్తాం. ఇప్పటికే ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. గడచిన 2 ఏళ్ల కాలంలో ఇరిగేషన్ కోసం రూ. 24 వేల కోట్లు ఖర్చు పెట్టాం. తుంగభద్ర డ్యాంకు 36 కొత్త గేట్లు బిగించాం.. పట్టిసీమ వల్ల జీవితాలు మారాయి. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. నదులను పూజించడం.. ప్రకృతి అనుసంధానం కావడం మన వారసత్వం.. సంస్కృతి. పుష్కర ఘాట్లను పూర్తి స్థాయిలో నిర్మిస్తాం.గోదావరి జిల్లాల్లో చేపలకు మంచి ధర లభిస్తుంది.. ఆక్వా రైతులకు రూ. 1.50కే విద్యుత్ అందిస్తున్నాం. గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో పామాయిల్ వేస్తున్నారు... కోకో పంటల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కోవూరులో త్వరలోనే కోకో సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. గోదావరి పుష్కరాల నిమిత్తం రాజమండ్రిలోనే రూ.1,200 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారు. టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఇంటింటికి కుళాయి ద్వారా నీరును అందించే పథకాన్ని అమలు చేస్తున్నాం. రైతులు కట్టాల్సిన పంటల బీమాను గత ప్రభుత్వం కట్టలేదు.ఎల్ నినో వల్ల వాతావరణ మార్పులు వస్తున్నాయి... 25 శాతం వర్షపాతం తక్కువ పడింది... నదుల్లోకి నీళ్లు రావడం లేదు. వాతావరణ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని దానికి అనుగుణంగా వ్యవహరించాలి. పిచ్చుక లంక, బొబ్బర్లంక ప్రాంతాల్లో టూరిజాన్ని అభివృద్ధి చేస్తాం.గోదావరి డెల్టా ఆధునికీకరణ చేపడతాం... చివరి భూములకు నీళ్లందిస్తాం... కోనసీమకు రైల్వే లైన్ వచ్చేలా చేస్తాం.గతంలో ఎప్పుడూ లేనటువంటి విధ్వంసాన్ని గత ప్రభుత్వం చేసింది. వాటిని సరి చేస్తున్నాం... పరిశ్రమలు తెస్తున్నాం.. రోడ్లను మరమ్మత్తులు చేస్తున్నాం. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి... ప్రజల ఆశీర్వాదం, భగవంతుడి కరుణతో మరింత అభివృద్ధి చేస్తాం. రాష్ట్రాన్ని బ్బందులు సృష్టించేందుకు కులాలు, మతాల మధ్య కొందరు చిచ్చు పెడుతున్నారు. గత పాలకులు గంజాయిని ప్రోత్సహించారు. గంజాయిని ప్రోత్సహించే వారిని అదుపులోకి తీసుకుంటాం.గంజాయి మత్తులో ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. నాకు రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ తో సమస్య లేదు... కానీ ఇప్పుడు గొడ్డలి పార్టీతోనే సమస్య వస్తోంది. పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోంది. సోషల్ మీడియా వాళ్లకు గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లకు గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోంది.. వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోంది. మంచి చేస్తే ఆదరించే స్వభావం గోదావరి ప్రజల సొంతం. 1999లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 21 స్థానాలకు గానూ 20 స్థానాలను గెలిపించారు. 2024 ఎన్నికల్లో అదిరే మెజార్టీలు ఇచ్చారు.. కూటమి మీద గోదావరి జిల్లాల వారికి ఉండే అభిమానం ఇది అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే,గోరంట్ల బుచ్చయ్య చౌదరి మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు,మండల తెలుగుయువత అధ్యక్షులు వెత్సా అనీల్ కుమార్, పి ఏ సి ఎస్, అధ్యక్షులు, నాగిరెడ్డి సత్యనారయణ, నరాలశెట్టి సుబ్బలక్ష్మి వెంకన్న,పి ఎస్, రాజు, ఏపుగంటి వెంకటేష్, పెద్ద ఎత్తున రైతులు, టీడీపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



## కాకినాడ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని గా డాక్టర్ కె. అనిత నియామకం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 13 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా నూతన వైద్య, ఆరోగ్య శాఖ అధికారినిగా డాక్టర్ కె. అనిత నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిపాలనా కారణాల రీత్యా సివిల్ సర్జన్ల (జనరల్ లైన్) బదిలీలు, పోస్టింగ్‌లలో భాగంగా సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీకాకుళంలో ఇన్చార్జ్ డిఎం అండ్ హెచ్ ఓ గా పనిచేస్తున్న ఆమెను కాకినాడకు బదిలీ చేశారు. వైద్య రంగంలో డాక్టర్ అనితకు సుదీర్ఘ అనుభవం ఉంది. 1998 - 1999 వరకూ ఏలేశ్వరంలో మెడికల్ ఆఫీసర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి పలుచోట్ల విధులు నిర్వహించి ప్రస్తుతం శ్రీకాకుళం సి.ఎస్.ఆర్.ఎమ్ ఓ గా బదిలీ అయి, అక్కడ ఇన్చార్జ్ డి ఎం హెచ్ వో విధులు నిర్వహిస్తూ, ఇప్పుడు పూర్తిస్థాయి బాధ్యతలతో కాకినాడ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా రానున్నారు.

# సకల కళా కోవిదుడు ఆదిమూలం

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్.**



**కడియం, జూలై 13 (ప్రభాతవార్త)** అన్ని కళలలో ప్రావీణ్యం పొందడం కొందరికే సొంతం అవుతుందని ఆ కోవకే చెందిన వాడు, సకల కళా కోవిదుడు ఆదిమూలం సాయిబాబా అని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా జన్మదిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆదిమూలం సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడిగా, జనసేన నాయకుడిగా, రాజమండ్రి రూరల్ ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా వివిధ రంగాలలో తన సత్తా చాటుకోవడం ఆయనకు ఆయనే సాటిని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలు, కళారత్న పురస్కారాలు ప్రకటిస్తూ కళాకారులను గౌరవిస్తుందని పేర్కొన్నారు. కళాకారులకు పుట్టినిల్లు అయిన రాజమండ్రి పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. రాజకీయ నాయకుడిగా, గాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్న ఆదిమూలం ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. అలాగే రాజకీయ పార్టీలకు వివిధ రంగాలకు చెందిన వారిని ఒకే వేదిక పైకి తీసుకువచ్చిన సాయిబాబా చేస్తున్న సమాజ సేవ ఎటువంటితో ఇట్టే చెప్పవచ్చునని అన్నారు . ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారితో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పనులు చేయిస్తే


# కఠిన చర్యలు తప్పవు

**హాస్టల్ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**పోలవరం జిల్లా ప్రతినిధి, జూలై 13 ప్రభాత వార్త.** ఎటపాక మండలం గౌరిదేవిపేటలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో పనులు చేయించిన ఘటనపై జిల్లా కలెక్టర్ తీవ్రంగా స్పందించారు.జరిగిన ఘటనపై శాఖ పరమైన విచారణ చేపట్టిన అనంతరం సంబంధిత హాస్టల్ సంక్షేమ అధికారి పై ప్రాథమిక విచారణలో నిర్లక్ష్యం వెల్లడైన నేపథ్యంలో హాస్టల్ వసతి గృహ సంక్షేమ అధికారి ఏ. దుర్గా పవన్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు లేదా ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థులతో ఎలాంటి వ్యక్తిగత లేదా శ్రమతో కూడిన పనులు చేయించడం ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పిల్లల హక్కులు, వారి భద్రత, గౌరవాన్ని కాపాడటం ప్రతి అధికారికి బాధ్యత అని అన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలోని ఏ పాఠశాల లేదా వసతి గృహంలో జరిగినా బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టంచేశారు.

## చింతూరు ఫారెస్ట్ డివిజన్‌లో డ్రోన్ తో సీడ్ బాల్స్.



**చింతూరు, జూలై 13: ప్రభాతవార్త** చింతూరు అటవీ డివిజన్ లో డ్రోన్ సహాయంతో సీడ్ బాల్స్ ను సోమవారం వెదజల్లారు.అడవిలో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో సీడ్ బాల్స్ తో మొక్కలను పెంచటానికి ఏపి లో ఈ కార్యక్రమం తొలి సారిగా చింతూరు డివిజన్ ప్రారంభించారు.చింతూరు డి. ఎఫ్. ఓ.రవీందరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచడం, పచ్చదనాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా వేలాది సీడ్ బాల్స్‌ను సిద్ధం చేశారు.మొత్తం 37000 సీడ్ బాల్స్ ఈ డివిజన్లో వేదజల్లినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి సీడ్ బాల్స్ తయారీ, వాటి వినియోగం, వర్షాకాలంలో వాటిని విసరడం ద్వారా మొక్కల పెంపకానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతూరు రేంజ్ అధికారి ఎస్.ఏ.కే.ఆజాద్. అకినవు ఎనాలిటికల్ సంస్థ ప్రతినిధులు పూలపర్తి జానకి,సుబ్బారావు, అటవీ శాఖ సిబ్బంది బిక్షం,జంపన్న రాజు,శ్రీనివాస్, శరణ్య తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

"I GUNIPE SOBHAN BABU (NEW NAME )maiden Name GUNIPE SOBHANA BABU(old name), D. NO. 4-176,DIVAN THOTA, PENUGUDURU (V), KARAPA (M), KAKINADA DISTRICT -533016,AP."Now changed my name from GUNIPE SOBHANA BABU (old) to GUNIPE SOBHAN BABU (new name ). Hence forth to I will be calld as GUNIPE SOBHAN BABU (new name )for all purpose.

## "ఇ క్రాప్" నమోదు అయిన రైతులకు యూరియా సిద్ధం.

### సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్

**రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త** రాజవొమ్మంగి సొసైటీ ద్వారా ఎరువులు, యూరియా కోసం వచ్చే రైతులు తమ పంటల నమోదు ( ఇ. క్రాప్ ) చేయించుకొని వచ్చేవారికి యూరియా, ఇతర ఎరువులను పొందవచ్చునని అన్నారు. పంట నమోదు కాని రైతులకు ఎరువులు ఇవ్వబడవని ఆయన అన్నారు. ఇంకా నమోదు చేయించుకొని రైతులు సచివాలయ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలని కేశవ్ సూచిస్తున్నారు.

## 14, 15 తేదీల్లో పొలం పిలుస్తోంది

### ఏ. ఓ. చక్రధర్



**రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో ఈ నెల 14 తేదీన రాజవొమ్మంగి, దూసరపాము, 15 తేదీ న జడ్డంగి, తంటికొండ గ్రామల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఏ. ఓ. చక్రధర్ తెలిపారు. రైతులకు పంటల నమోదు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఎరువుల కొనుగోలుపై కార్యక్రమాల్లో వివరిస్తామని ఏ. ఓ. అన్నారు.

## అంతర్వేది నరసింహుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం..



**సఖినేటిపల్లి జూలై 13, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు నిర్వహించు నిత్యాన్నదానము నకు చింతలమోరి గ్రామ వాస్తవ్యులు దొడ్డా వెంకట రాజ్యలక్ష్మి వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116. లు శాశ్వత విరాళముగా సమర్పించియున్నారు. వారికి శ్రీ స్వామి వారి దర్శనానంతరము, శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదముల ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి అందజేసినారు. ఈ కార్యక్రమంలో ధాత కుటుంబ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల వివరాల ధృవీకరణకు 14న ఆఖరి గడువు: తాసిల్దార్ తేజస్విని



**అడ్డతీగల, జూలై 13, ప్రభాతవార్త** అడ్డతీగల తహసీల్దార్ తేజస్విని తెలిపిన వివరాల ప్రకారం, ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని, ధృవీకరించుకోవడానికి జూలై 14 సాయంత్రం లోపు ఆఖరి అవకాశం ఉంది. అందువల్ల ఓటర్లందరూ తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు బీఎల్ఓ అవసరమైన వివరాలను అందించి, ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.?అడ్డతీగల మండలంలో మొత్తం 42 పోలింగ్ స్టేషన్లు, 42 మంది బీఎల్ఓలు ఉండగా, ఇప్పటివరకు 30,693 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో ఓటర్ల డిజిటైజేషన్ ప్రక్రియ ఇప్పటికే 100 శాతం పూర్తి కాగా, ఈఎఫ్ (జుఖీ) డిజిటైజేషన్ ప్రక్రియ 84.39 శాతం పూర్తయిందని తహసీల్దార్ తేజస్విని వివరించారు. ఓటర్లు ఈ గడువును ఉపయోగించుకుని తమ వివరాలను వెంటనే ధృవీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## అన్నదాతల ముఖాల్లో ఆనందం

### ఘనంగా వరి విత్తనాల పంపిణీ



**అడ్డతీగల,జూలై 13, ప్రభాతవార్త** అడ్డతీగల గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా రైతులు సకాలంలో విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని నాయకులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండల టీడీపీ అధ్యక్షుడు జర్త వెంకటరమణరెడ్డి, జనసేన నాయకుడు తాటికొండ రాజేంద్ర, పుడిగి ఆదిలక్ష్మి, చిత్తోజి బాబునమ్మ తదితరులు సచివాలయ సిబ్బంది పాల్గొని రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి. శ్రీవరం



**రావులపాలెం, జూలై 13 (ప్రభాతవార్త) :** రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి. శ్రీవరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతకుముందు మన్యం జిల్లాలోని గుమ్మ లక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై రావులపాలెంకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ వి. శ్రీనివాసరావు బదిలీపై ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. శ్రీవరం మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, నైపుణ్యాభివృద్ధి, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కళాశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. భాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్. అరుణ్ కుమార్, అధ్యాపకులు చినబాబు, రాజేంద్ర, శ్రీనివాస్, దుర్గాదేవి, సౌజన్య తదితరులు అభినందించారు.

## 31 న కలక్టరేట్ ధర్నా ను జయప్రదం చేయండి



**జగ్గంపేట జూలై 13 (ప్రభాతవార్త )** ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 31 న అంగన్వాడీలు కలక్టరేట్ వద్ద నిర్వహించే స్కీం వర్కర్ల ధర్నా ను జయప్రదం చేయాలని అంగన్వాడీల సంఘం జిల్లా కార్యదర్శి ఈ చంద్రావతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక నెహ్రూ కాలనీ అంగన్వాడీ కేంద్రం వద్ద ఎం.శ్యామలసంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, స్కీం వర్కర్ల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకరాలు కల్పించిండించాలనే డిమాండ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని అంగన్వాడీలు ఈ ధర్నా ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వై వి రాజేశ్వరి, కమిటీ సభ్యులు లక్ష్మి, కృపాభాయ్, వెంకటలక్ష్మి, జ్యోతి, నాగదుర్గ, రామలీల వరలక్ష్మి, పాల్గొన్నారు.

## అదనపు నూతన గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం సిటీ, జూలై 13( ప్రభాతవార్త)** తాను మాటలతో కాలక్షేపం చేసే మనిషిని కాదని మాట ఇస్తే ఖచ్చితంగా చేసి చూపిస్తానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. రూ 20 లక్షల సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన మోరంపూడి స్పెషల్ మున్సిపల్ పాఠశాలలో ప్రారంభించిన 9, 10 తరగతిలో గదులను రెస్ట్ రూమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ పేపర్ మిల్ సి ఎస్ ఆర్ నిధులతో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు బెంచీలు బాలికల కోసం విశ్రాంతి గది ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో మోరంపూడి ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానిక ప్రజలు నాయకులు తన కోరిన ప్రధాన డిమాండ్ 9వ 10వ తరగతులను ఈ పాఠశాలలో ప్రారంభించాలని కోరారని ఇచ్చిన మాట ప్రకారం 9 10 తరగతుల అనుమతి కోసం విద్యాశాఖ మంత్రి లోకేష్ కోరడం జరిగిందని ఆయన సహకారంతో అనుమతులు తీసుకొచ్చామని వివరించారు. విద్యార్థులు తమ ప్రాంతములను ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం లభించిందని అన్నారు. తమ పిల్లలు 9 10 తరగతిలో కోసం మోరంపూడి దాటి దూర ప్రాంతం వెళ్ళవలసి వస్తుందని తమ దృష్టికి తీసుకుంటే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఈ ఈ స్కూలులో ప్రస్తుతం పదవ తరగతిలో 30 మంది విద్యార్థులు ఉన్నారని వారంతా 500 కు పైగా మార్పు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్ వల్ల ప్రభుత్వ పాఠశాలలో గణనీయమైన ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేపర్ మిల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి జయ కుమార్ 10వ డివిజన్ ఇంచార్జ్ వీరభద్ర రావు ప్రెసిడెంట్ పంచట్ల శివప్రసాద్ కార్యదర్శి వాసంశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## రాయితో తలపై బాది యువకుడి హత్య..?



**రావులపాలెం, జూలై 13 (ప్రభాతవార్త) :** రావులపాలెం కొత్తకాలనీలో ఆదివారం అర్ధరాత్రి యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. అను సాయి అలియాస్ నల్ల సాయి (23) అనే యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు రాయితో తలపై బలంగా బాది హత్య చేసినట్లు సమాచారం. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకున్న సిఐ జి. రమేష్ బాబు, ఎస్సై చంటి పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో కొత్తకాలనీ ప్రాంతంలో తీవ్ర కలకలం నెలకొంది.

## ఊర్లకులపాడులో బి. ఆర్. సి కేంద్రాన్ని ఇ డి తనిఖీ



**రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త** ఊర్లకులపాడు నోడల్ బి. ఆర్. సి సెంటర్ ను సోమవారం ప్రకృతి వ్యవసాయ ఈ. డి. బాబూరావు నాయుడు, డి. పి. యం. రాబిన్ తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. పెరటి తోటల విత్తనాలు, సిరిదాన్యాలు విత్తనాలను పరిశీలించి సూచనలను ఇచ్చారు. పోలవరం శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జీడిమామిడి తోటల్లో పి. యం. డి. ఎస్. పద్దతి వివిధ పంటల సాగును పరిశీలించారు. రత్నరాజు, ప్రేమ్ కుమార్ ల పరిధిలో క్షేత్ర స్థాయిని పరిశీలన చేశారు. ఈకార్యక్రమంలో ఎఫ్. యం. టి. నాగరాజు, రత్నరాజు, లక్ష్మణ్ రెడ్డి, ఐ. సి. ఆర్. పి లు లోవలక్ష్మి, నరసయ్య, కాసులమ్మ, సతీష్ పాల్గొన్నారు.

## కూటమి నాయకుల మద్యం దందాను ఆపాలి.

### జనసేన నాయకులు వీర.



**తాళ్లరేవు, జూలై 13( ప్రభాతవార్త ):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో కూటమి నాయకులు చేస్తున్న మద్యం దందాను ఆపాలని కూటమి ప్రభుత్వ భాగస్వామి అయిన జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, తాళ్ళరేవు వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) అధ్యక్షులు విల్ల వి.వి. ఆదినారాయణ(వీర) అన్నారు. సోమవారం తాళ్లరేవులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలో బ్రాందీ షాపుల సిండికేట్ చేస్తున్న వ్యవహారాలను బహిర్గతం చేశారు. తాను సిండికేట్ లో భాగస్వామిగా ఉంటూ కూడా అక్కడ జరుగుతున్న పరిస్థితులపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎమ్మార్పీ రేటు కన్నా బ్రాందీ షాపుల్లో రూ.10లు అదనంగా అమ్ముతున్నారని, బెల్ట్ షాపుల్లో రూ.30 నుండి రూ.40 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. యానం నుంచి అక్రమ మద్యం సైతం బెల్ట్ షాపుల్లో అమ్ముతున్నారు. దీనివల్ల ప్రజలు అధిక ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు. అధిక ధరలకు అమ్మడం ద్వారా వచ్చిన సొమ్ము లు ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు నెలనెలా మామూలు ఇస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని వీర వెల్లడించారు. ఒక్కో మద్యం దుకాణం నుండి నెలకు ఎక్సైజ్ అధికారులకు రూ. 62వేలు, పోలీసులకు రూ.15వేలు ఇస్తున్నారని తెలిపారు.అధిక ధరలకు మద్యం అమ్మకాలు ఆపాలని, బెల్టు షాపుల్లో యానం మద్యం అమ్మకాలు లేకుండా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మామూళ్ల మత్తులో పడి అధికారులు చర్యలు తీసుకోకపోతే తాను జనసేన తరపున జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ దందాలలో కూటమి నాయకులు రోళ్ల చక్రవర్తి, మంద కృష్ణ అలియాస్ నాని, కోడూరి ఆదినారాయణ చౌదరి, జవ్వాది తాతాజీ ఉన్నారన్నారు. కూటమి నాయకులు చేస్తున్న దందాలలో మరిన్ని అంశాలను త్వరలో మీడియాకు తెలియజేస్తానని పరోక్షంగా కూటమి నాయకులకు విల్ల వీర హెచ్చరికలు జారీ చేశారు.

## పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:

### రైతు బీమా జీవో వెంటనే విడుదల చేయాలని వినతి:



**జగ్గంపేట జూలై 13 (ప్రభాతవార్త )** తూర్పుగోదావరి జిల్లాలో పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం కలిశారు. రైతుల పంటలకు బీమా సదుపాయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే తన వ్యక్తిగత కార్యదర్శి రాజమౌళిని పిలిచి రైతు బీమాపై జీవో జులై ఆరో తేదీన ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయడం జరిగిందని అనౌన్స్మెంట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉత్తర్వు జారీ అయినప్పటికీ ఇప్పటివరకు బహిరంగంగా విడుదల కాలేదని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వివరించారు. వెంటనే ఉత్తర్వును విడుదల చేసి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి రైతు బీమా జీవోను విడుదల చేశారు. రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల తరపున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని మరో సంవత్సరం అంటే రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు సంవత్సరానికి పొడిగించారు. ఖరీఫ్ రెండు వేల ఇరవై ఆరు మరియు రబీ రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు సీజన్లకు ఇది వర్తిస్తుంది. రైతులు తమ ఇష్టంతో స్వచ్ఛందంగా బీమా కోసం నమోదు చేసుకోవచ్చు. క్లస్టర్ మరియు సీజన్ స్థాయిలో ఈ విధానం అమలవుతుంది. పాత జిల్లాల నిర్మాణం ప్రకారమే ఈ పథకం అమలవుతుంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల బీమా అమలుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. తూర్పుగోదావరి జిల్లాల క్లస్టర్ తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాలు ఒకే క్లస్టర్ కిందకు వస్తాయి. ఈ క్లస్టర్ కు బీమా కంపెనీగా ఐసిఐసిఐ లోంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని నియమించారు.

**ఖరీఫ్ రెండు వేల ఇరవై ఆరు చివరి తేదీలు**

వరి తప్ప ఇతర అన్ని పంటలకు: జూలై ముప్పై ఒకటి రెండు వేల ఇరవై ఆరు
వరి పంటకు: ఆగస్టు పదిహేను రెండు వేల ఇరవై ఆరు వరకు తమ పంటలను బీమా చేయించుకోవచ్చని తెలియజేశారు

## పటవల స్మశాన వాటిక ఆక్రమణను అడ్డుకోవాలని ధర్నా..



**తాళ్లరేవు, జూలై 13( ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల గ్రామంలోని దళిత పేటలో స్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సర్వే జరిపి స్మశానాన్ని గ్రామానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ తాహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో దళితులకు గతంలో సర్వే నెంబరు 254/16 లో సుమారు 5 ఎకరాలు స్థలం ఉందన్నారు. ఆ స్థలంలో కొంత భూమిని కాకినాడ కి చెందిన మహిళ సాధనాల రాణి ఆక్రమించుకుందన్నారు. దీంతో పాటు దళిత గ్రామానికి ఆనుకుని ఉన్న మురుగు కాలువ తూములు అనధికారికంగా మూసివేసిందని తెలిపారు. దీనివల్ల గ్రామంలో మురుగు నీరు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్మశాన స్థలాన్ని ఆక్రమించడంతోపాటు మురుగు కాలువను మూసివేసి గ్రామ దళితులను వేధిస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాహసీల్దార్ వీరభద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతుల అప్పారావు, నేల లక్ష్మణరావు, గుత్తాల శ్రీనివాస్, ఎం నూకరాజు, ముద్రే సత్యనారాయణ, ఎన్ సత్యనారాయణ, బి శ్రీను, ఎన్ నాగు, రాయుడు ప్రసాద్, వాకపల్లి వీర్రాజు, పలువురు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాదుల బారిన పడకండి...వైద్యులు



**మామిడికుదురు.జూలై 13(ప్రభాతవార్త)** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాదుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లూటుకుర్రు పిహెచ్సీ వైద్యాధికారిణి ఫణి శైలుష సూచించారు. సోమవారం లూటుకుర్రులో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ,మానవహారం నిర్వహించారు.నివాస ప్రాంతాల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.దోమలను నిర్మూలించడం వల్ల డెంగ్యూ వ్యాధిని అరికట్ట వచ్చన్నారు. పాత్రలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కెవి సూర్యనారాయణ,పిహెచ్సీ ఉద్యోగులు, ఏఎన్ఎం,ఎంఎల్హెచ్పీలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


## పాడి రైతు ఇంట.. పుంగనూరు పంట..

**16 అంగుళాల పుంగనూరు దూడను చూసేందుకు ఆసక్తి..**



**అంబాజీపేట, జూలై 13, (ప్రభాతవార్త):** బుడిబుడి అడుగులు,చలాకి గెంతులతో సందడి చేస్తున్న ఆ పుంగనూరు పెయ్యి దూడను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట కొర్ల పాటివారిపాలెంనకు చెందిన పాడిరైతు సూదాబత్తుల లక్ష్మణరావు (బుజ్జి) ఇంట సోమవారం సుమారు 16 అంగుళాల పుంగనూరు పెయ్యి దూడ జన్మించింది. ఈ సందర్భంగా పాడి రైతు లక్ష్మణరావు మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం పశువుల బేరగాడు నుండి దేశవాళీ ఆవును కొనుగోలు చేశానని, ఈ దేశవాలి ఆవు, పుంగనూరు ఆంబోతు కలయిక ద్వారా ఏడు పుంగనూరు దూడలు పుట్టాయని తెలిపారు.వాటిలో ఒక పెయ్యి దూడ,రెండు గిత్త దూడలను రైతులుకు అమ్మగా మరో రెండు గిత్తలను అచ్చువేసి వదిలేసానని తెలిపారు. మిగిలిన రెండు దూడలలో ఒకటి పెయ్యి దూడ కాగా మరొకటి గిత్త ఉందన్నారు. ఆ పెయ్యి ఆవుకు ఏడాది క్రితం ఒక పెయ్యి దూడ పుట్టిందని, మరల ఇప్పుడు పుంగనూరు పెయ్యి పుట్టిందని సంతోషం వ్యక్తం చేస్తూ లక్ష్మణరావు తెలిపారు. అల్లారు ముద్దుగా ఉన్న దీనిని పెంచుకుంటానని తెలిపారు. వీటి నిర్వహణకు రోజుకు మూడు నుండి నాలుగు వందల రూపాయలకు వరకు ఖర్చు అవుతుందని, వీటి ద్వారా వచ్చే పాలను శివాలయాలకు, భక్తులకు ఉచితంగా అందజేస్తానని పాడి రైతు లక్ష్మణరావు తెలిపారు.

## యోగాలో వాతాడి బ్రదర్స్.... అదుర్స్.



**తాళ్లరేవు, జూలై 13 (ప్రభాతవార్త):** యోగా పోటీల్లో తాళ్ళరేవు మండలం తాళ్లరేవు గ్రామానికి చెందిన వాతాడి బ్రదర్స్ అదుర్స్ అనిపించారు. కోకనాడ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూలో ఆదివారం జరిగిన ట్రెడిషనల్ యోగ ఈవెంట్లో వాతాడి యోగ విష్ణు రామ్ కళ్యాణ్ ఆర్టిస్టిక్ సోలో, ట్రెడిషనల్ రెండు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించగా, వాతాడి రమణ మంజునాథ ట్రెడిషనల్ విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా తాళ్ళరేవు లో కూటమి నాయకులు నడింపల్లి వినోద్, వాసంశెట్టి శ్రీనివాస్, కుడిపూడి దుర్గాప్రసాద్, అద్దేపల్లి సత్తిరాజు వాతాడి బ్రదర్స్ ను దుస్సాలవాల తో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సతీష్ రాజు, బండారు శ్రీనివాస్, వడ్డీ విజయ్ కుమార్ వాతాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ లో 150 అర్జీలు స్వీకరణ



**రాజమహేంద్రవరం సిటీ, జూలై 13( ప్రభాతవార్త)** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 150 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో ఆయన ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిబంధనలు మేరకు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ కి సంబంధించి 61 అర్జీలు స్వీకరించగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 35 హోం శాఖకు 19 పశు సంవర్ధక పాడి పరిశ్రమ మత్స్య శాఖకు 7 ఇంధన శాఖకు నాలుగు అర్జీలు అందాయి. జల వనరులు పురపాలక పట్టణ అభివృద్ధి వ్యవసాయ సహకారం వైద్య ఆరోగ్య మహిళ శిశు సంక్షేమం నైపుణ్యాభివృద్ధి శిక్షణ పాఠశాల విద్య స్వర్ణ గ్రామం స్వర్ణ అవార్డ్ గృహ నిర్మాణం తదితర శాఖ కూడా అర్జీలు అందజేయని వివరించారు. రెవిన్యూ క్లినిక్ కు సంబంధించిన అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆర్ ఎం ఎం ప్రేమ కుమార్ పి భాగ్యలక్ష్మి లు స్వీకరించారు.

**నగరపాలక సంస్థ లో 19 అర్జీలు స్వీకరణ:**

నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి 19 అర్జీలు స్వీకరించగా వాటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 8 రెవిన్యూ కి సంబంధించి ఒకటి టౌన్ ప్లానింగ్ సంబంధించి ఆరు పబ్లిక్ హెల్త్ ఒకటి మెప్మా కు ఒకటి అందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ సెక్రెటరీ శైలజ వల్లి సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి మేనేజర్ అబ్దుల్ మాలిక్ రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకోండి..

### గడువు ముగియడానికి ఒక్క రోజే

**ఎన్యూమరేషన్ పత్రాలు వెంటనే సమర్పించండి**

**కడియపులంక ప్రజలకు ఆరేటి వెంకట్రావు విజ్ఞప్తి**



**కడియం, జూలై 13 ( ప్రభాతవార్త)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణకు గడువు ముగియడానికి ఇంకా ఒక్క రోజే మిగిలి ఉందని, కడియపులంక పంచాయతీ పరిధిలోని అర్హత కలిగిన ప్రతి ఓటరు అప్రమత్తంగా వ్యవహరించి తమ వివరాలు నింపిన పత్రాలను సంబంధిత బీఎల్‌వోకు వెంటనే అందజేయాలని వైఎస్సార్సీపీ నాయకులు ఆరేటి వెంకట్రావు పత్రికా ప్రకటనలో కోరారు. ఎన్నికల సంఘం అధికారులు ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ చాలావరకు పూర్తయిందని వెల్లడిస్తున్నారని ఆయన తెలిపారు. అయినప్పటికీ ఇంకా కొంతమంది ఓటర్లు తమ పత్రాలను సమర్పించలేదని, అలాంటి వారు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగిసేలోపు తప్పనిసరిగా సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి పత్రాలు అందజేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీ చివరి గడువు కావడంతో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని ఆయన అన్నారు. గడువులోపు ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించకపోతే ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే పత్రాలు సమర్పించిన వారు తమ వివరాలు నమోదు అయ్యాయో లేదో సంబంధిత బీఎల్‌వో వద్ద ఒకసారి నిర్ధారించుకోవాలని సూచించారు. కడియపులంక గ్రామ పరిధిలోని యువత, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు సహా ప్రతి అర్హ ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో వ్యవహరించాలని, కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారికి కూడా ఈ సమాచారాన్ని చేరవేసి ప్రతి ఒక్కరూ గడువులోగా పత్రాలు సమర్పించేలా సహకరించాలని ఆరేటి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. "ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి ఓటరు తన హక్కును కాపాడుకునేందుకు ఎన్యూమరేషన్ పత్రాలను వెంటనే సమర్పించి బాధ్యతాయుత పౌరుడిగా వ్యవహరించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

## కనీస వేతనాల కోసం కలెక్టరేట్ల వద్ద ఆందోళన

### జూలై 30, 31 కార్యక్రమాల జయప్రదానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ పిలుపు

**కాట్రేనికోన జూలై 13 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండల సిఐటియు మండల కమిటీ సమావేశం స్థానిక కార్యాలయం వద్ద బీ.పార్వతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని షెడ్యూల్ పరిశ్రమలు, సంస్థలు, షాపింగ్ మాల్స్, ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్స్ అంగనవాడి, ఆశ, ఎండిఎం, స్కూల్ స్వీపర్లు, యానిమేటర్లు, మున్సిపాల్ , వీఆర్ఏలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు . 2014 నుండి రాష్ట్రంలో కనీస వేతనాల పెంపు లేదని, దీని వలన సుమారు 50 లక్షల మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.చట్ట ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేతనాలు సవరించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా వేతనాలు పెంచే నిర్ణయం చెయ్యకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. ధరలు పెంచే నిర్ణయం వలన ప్రభుత్వాలకు ఎలాంటి భారం కాదని, ఇది ప్రైవేటు కంపెనీలు, సంస్థల యజమానులు భరించాల్సిందని కాని ప్రైవేట్ సంస్థల యజమానులకు లొంగిపోయిన ప్రభుత్వ పెద్దలు కార్మికులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల పెట్రోల్, గ్యాస్, డీజిల్ ఇతర నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయని ఆ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజననిర్వాహకులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లకు కూడా వేతనాలు పెరుగుదల లేదని దీనివలన ఆయా రంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్స్ కు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని డిపార్ట్మెంట్లలో ఉన్న కార్మికులు మరియు ఉద్యోగులకు 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయస్సు పెంచి, ప్రతి ఒక్కరికి రిటైర్మెంట్ బెనిఫిట్ మరియు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంపుదలకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జూలై నెల అంతా సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి జూలై 30 ,31న అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మికులంతా ఈ ప్రచారం, ఆందోళనలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ విత్తనాల రాంబాబు,పి సీతమ్మ ,టి దుర్గ, శాంతకుమారి, జి అనంతలక్ష్మి ,కే సూర్యకుమారి పాల్గొన్నారు.

## సాగునీటి కష్టాల నుండి గట్టెక్కించండి.. సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట, జూలై 13, (ప్రభాతవార్త):** వైనతేయ,గౌతమి నదీపాయల నడుమ ఉన్న పి.గన్నవరం నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సాగునీటి కష్టాల నుండి గట్టెక్కించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కోరారు. తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు సోమవారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వేమగిరి గ్రామంలోని హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలిసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గోదావరి డెల్టా అభివృద్ధికి కొత్త దశ,దిశ లభించిందన్నారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనుల ప్రారంభం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన బ్యారేజీ పునరుద్ధరణ కోసం వెంటనే రూ.150 కోట్లు కేటాయించడం రైతుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమన్నారు.అలాగే పి. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పలు సాగునీటి లాకులు (గేట్లు) శిథిలావస్థకు చేరుకున్నాయని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాటిని అత్యవసరంగా పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వెల్లడించారు.

మరిన్ని వార్తలు 6లో

# ఇర్రిపాక శివకేశవుల ఆలయానికి పోటెత్తిన భక్తజనం



జగ్గంపేట, జులై 13 (ప్రభాతవార్త ) వందేళ్లకు ఒకసారి వచ్చే సోమావతి అమావాస్య, మాస శివ రాత్రి, ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావడంతో జగ్గం పేట మండలం ఇర్రిపాక తిరుమల తిరుపతి దేవ స్థానములు శివకేశవుల ఆల యం భక్తులతో కిటకిటలాడింది. ఏలేరు నది ఒడ్డున ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఏలేరు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. కోటి లింగేశ్వర స్వామికి అర్చన, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మల్లికార్జున స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం మహా శైవాక్షయోగం ఏర్ప డిందని, ఆ రోజు చేసే శివారాధనకు విశేష ఫలితాలు ఉంటాయని పురో హితులు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ధర్మకర్త, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని....

### కుడా చైర్మన్ తలాటం సత్య పారాయణ పూజలు



కాకినాడ రూరల్, జూలై 13 (ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల భుజానికి సంబంధించి శస్త్ర చికిత్స ముంబై హాస్పిటల్ లో విజయవంతం కావడంతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం సత్య ఆధ్వర్యంలో కొత్తపేట నూకాలమ్మ గుడి ఆవరణలో విష్ణు సహస్రనామాలు, లలిత పారాయణం వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీశ్రుష్టపురిరాణి సేవా సంఘం వారి ఏర్పాటుచేసిన పారాయణం వీక్షించేందుకు భారీ ఎత్తున జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ తమ అధినాయకుడు పవన్ కళ్యాణ్ నూతన ఉత్సాహంతో ప్రజా సేవలోకి తిరిగి రావాలని కోరుకుంటూ పారాయణం పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళలు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలపై వివక్ష, హింస తగ్గాలంటే మహిళా సంఘాలు మరింత బలపడాలి..!

### రాష్ట్ర ఐద్వా సహాయక కార్యదర్శి సిహెచ్ రమణి


### కూనవరంలో ఘనంగా ఐద్వా 2వ మండల మహాసభ



కూనవరం, జూలై 13, ప్రభాతవార్త : సమాజంలో మహిళలపై వివక్ష, హింస పూర్తిగా తగ్గాలంటే మహిళా సంఘాలు పూర్తిగా బలపడాలని ఐద్వా రాష్ట్ర సహాయక కార్యదర్శి సిహెచ్ రమణి అన్నారు. పోలవరం జిల్లా కూనవరం మండలం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 2 వ మహాసభను సోమవారం స్థానిక మార్త శ్రీరామమూర్తి భవన్లో నిర్వహించారు. ఈ మహాసభ కు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడులు అరికట్టేందుకు ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆమె అన్నారు. మహిళలకు రక్షణ, గౌరవం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కూడా అన్నారు. తర్వాత ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడారు. ఐజీవల మండలంలోని కాన్యాకూటాట్ గ్రామంలో పాము కాటుతో మృతి చెందిన సమ్మక్క ప్రియ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆమె డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రస్తావిస్తూ గ్రామాల నుండి ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించే నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు అక్కడ ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. మహిళలకు అన్ని ప్రజాప్రతినిధుల సంస్థలలో 33 శాతం రిజర్వేషన్ పూర్తిగా అమలు చేయాలని అన్నారు. మహాసభకు ముందుగా టేకులబోరు గ్రామం నుండి కూనవరం వరకు మహిళలు భారీ ర్యాలీని, మానవహారాన్ని నిర్వహించారు. మహాసభలో నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షురాలిగా గుండం బుచ్చమ్మ, కార్యదర్శిగా అమ్మాజీ, కోశాధికారిగా నాగమణి, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలం ఎంపీటీసీ అమ్మాజీ, మాజీ సర్పంచ్ నాగమణిలను సన్మానించడం జరిగింది. ఈ మహాసభకు మహిళా సంఘం నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జయసుధ, సమ్మక్క, సుబ్బలక్ష్మి, గౌరీ, రాములమ్మ, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చెల్లపిల్ల శతకానికి సీఎం చంద్రబాబు ప్రశంసలు

### ప్రచురణకర్త మార్గాని సత్యనారాయణను అభినందించిన ముఖ్యమంత్రి



కడియం, జూలై 13 (ప్రభాతవార్త) తెలుగు సాహిత్య వారసత్వాన్ని ప్రతిబింబించే శతావధాని చెల్లపిల్ల వెంకటశాస్త్రి శతకం ప్రచురణ సందర్భంగా ఏపీ ఐసీసీ డైరెక్టర్, ప్రచురణకర్త మార్గాని సత్యనారాయణను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. సోమవారం ధవళేశ్వరం హెలిప్యాడ్ వద్ద జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో మార్గాని సత్యనారాయణతో పాటు కవి చిలుకూరి శ్రీనివాసరావు ముఖ్యమంత్రిని కలిసి చెల్లపిల్ల వెంకటశాస్త్రి శతకం ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తెలుగు సాహిత్యానికి శతావధాని చెల్లపిల్ల వెంకటశాస్త్రి అందించిన విశిష్ట సేవలను ముఖ్యమంత్రికి వివరించారు. పుస్తకాన్ని ఆసక్తిగా పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలుగు సాహిత్య పరిరక్షణకు కృషి చేస్తున్న మార్గాని సత్యనారాయణ, కవి చిలుకూరి శ్రీనివాసరావును అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ శతకాన్ని ప్రముఖ హాస్యావధాని డాక్టర్ శంకరనారాయణ రచించగా, కవి చిలుకూరి శ్రీనివాసరావుకు అంకితమిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషా, సాహిత్య సంపదను భావితరాలకు చేరవేసే ఇటువంటి ప్రచురణలు మరింత విస్తృతంగా జరగాలని పలువురు అభిప్రాయపడ్డారు.

# మల్లికార్జున స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు



శంఖవరం జూలై 13 ప్రభాతవార్త భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు మండలంలోని కత్తిపూడి లో గల శివాలయంలో మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం సోమవారం కలిసి రావడంతో శివాలయం లో భక్తుల శివనామ స్మరణ మధ్య మారు మ్రోగింది ఆలయ పురోహితులు వేమకోటి త్రినాధ శర్మ మహాగణపతి పూజ, మహన్యాస పారాయణ, 21 రకాల ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆరుద్ర జన్మ నక్షత్ర సందర్భంగా విశేష అలంకరణ చేసి నక్షత్ర హారతి ,సప్త హారతులతో.. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నందీశ్వరుడికి విశేష అభిషేకం గావించి ప్రత్యేక పూజ నిర్వహించారు మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న ఈశ్వరుడు పద్మ దంపతులు భక్తులకు ఉచిత అన్న ప్రసాదం వితరణ గావించారు పలువురు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భక్తులతో పోటెత్తిన శివాలయాలు**

సోమవారం మండలంలో గల శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి ఏ ఆలయం చూసినా కార్తీక మాసంలో వచ్చే సోమవారము అన్న రీతిగా భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శించుకున్నారు. 27 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పవిత్రమైన రోజుని, ఈ పవిత్ర దినాన్ని "మహా సైవాభ్య యోగము" అంటరాని, గత 225 సంవత్సరములలో తొమ్మిది సార్లు మాత్రమే వచ్చినది ఇటువంటి రోజు మరలా రావాలి అంటే 2053 ఆ తర్వాత వస్తుందని ప్రముఖ ప్రవచనకర్తలు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కావడంతో భక్తులు భారీగా ఆలయాలకు వెళ్లి స్వామివారి దర్శించుకున్నారు

# అంగరంగ వైభవంగా పెద్దాపురం మరిడమ్మ జాతర ఆరంభం

### -మరిడమ్మ జాతరను ప్రారంభించిన దేవాదాయ శాఖాధికారులు



పెద్దాపురం జూలై 13(ప్రభాత వార్త ) కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ఉభయ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గరగల నత్యం, అమ్మవారి రథం. బ్యాండ్ మేళాలు, కోలాటం మధ్య అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. జాతర మహోత్సవాన్ని రాత్రి 8.30 నిమిషాలకు దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్షలు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఘన స్వాగతం పలికారు. దేవాదాయ శాఖాధికారులు ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి జాతరను అమ్మవారి గరగల నృత్యం, కోలాటం, పులి ఆట, సంబరాల్లోని పలు సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. తొలుత పాత పెద్దాపురం (కోటముందు) పురాతన చరిత్ర గల్గి మరిడమ్మ అమ్మవారి వేలసియున్న ఆలయంలో గరగను ఎత్తుకుని పాత పెద్దాపురం సంబరాన్ని ప్రారంభించారు. ఈ ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## రేఖపల్లి ఆరోగ్య కేంద్రంలో మరో వైద్యుడిని నియమించి : ఎంపిపి లక్ష్మి



వి.ఆర్.పురం,జూలై 13,ప్రభాతవార్త మండల కేంద్రం రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఇప్పుడు పనిచేస్తున్న వైద్యాధికారి తోపాటుగా, మరో వైద్యుడిని నియమించాలని, ఎంపిపి లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిపి లక్ష్మి సిపిఎం నాయకుల బృందంతో కలిసి, రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుంటున్న రోగులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులు, వారి వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఒకే ఒక వైద్యులు ఉండటంతో, చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్న రోగులకు వైద్యసేవలు అందించలేకపోతున్నారని చెప్పారు. దీంతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని వారు వాపోయారు. ఈ విషయంపై స్పందించిన ఎంపిపి లక్ష్మి మాట్లాడారు. మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో 11 మంది గిరిజనులు డెంగీ బారినపడి చికిత్స పొందుతున్నారని, అలానే మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో సైతం చాలామంది వైద్యం పొందుతున్నారని అన్నారు. అసలే ఏజెన్సీ గిరిజన మారుమూల ప్రాంతం, అందున డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న దుష్ట్యా, తక్షణమే రేఖపల్లి పి. హెచ్.సి కి మరో డాక్టర్ ను నియమించి, పేద రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాల్సిన అవసరం ఉందని ఆమె ప్రభుత్వాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పూనెం.ప్రతీప్ కుమార్, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సోయం.చిన్నబాబు, ఆ పార్టీ మండల కమిటి సభ్యులు కారం.సుందరయ్య, గుండెపుడి.లక్ష్మణరావు, పోడియం.శ్రీరామ్ మూర్తి, జల్లి.సత్యనారాయణ ,పెస కమిటి ఉపాధ్యక్షులు కుంజా.కన్నయ్య పాల్గొన్నారు.

## బట్లపాలికలో ఉచిత మెగా వైద్య శిబిరం

### ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ అక్కల, గెడ్డం, కాటే.



కె గంగవరం, జులై 13,(ప్రభాతవార్త): కె గంగవరం మండలం బట్లపాలిక గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, సొసైటీ అధ్యక్షులు గెడ్డం బన్నీ ( పల్లపురావు), ప్రజాసేవ అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తెలిపారు. కియో కంపెనీ ద్వారా నిర్వహించబడుతున్న మొబైల్ హాస్పిటల్ ద్వారా సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు సొసైటీ అధ్యక్షులు గెడ్డం బన్నీ తెలిపారు. అలాగే ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ద్వారా సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో అవసరమైన 40 మంది కి ఆపరేషన్ నిమిత్తం కేటాయించిన తేదీలో ఉచిత ఆపరేషన్ నిర్వహించనున్నట్లు కాటే సుబ్రమణ్యం తెలిపారు. అలాగే ద్రాక్షరామాకు చెందిన భీమేశ్వర డెంటల్ హాస్పిటల్ క్రాంతి కుమార్ దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఎఎంసి వైస్ చైర్మన్ దడాల నాగార్జున నాగేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు గోపి సతీష్, వెలిశెట్టి బాబ్జి, గెడ్డం ఆదినారాయణ, వీర ప్రసాద్, శ్రీను, సురవరపు వెంకటరాజు, రవ్వా భూషణం, కాటే సంజీవి,పర్వంశెట్టి గోవిందు, ప్రచార కార్యదర్శి చిల్లె నాగేశ్వరరావు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు తరపట్ల ఆనందరావు, కూరాటి మరిడి, పాము సుబ్రమణ్యం, బద్దా శ్రీను, మోరంపూడి సూర్యప్రకాష్ కియో సంస్థ వైద్యులు డాక్టర్ అనూష, సిబ్బంది జ్యోతి, రాజేశ్వరి, అనూష, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు తవ్వకాలు నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ను కలిసిన పెడపర్తి గ్రామస్తులు.



అనపర్తి జూలై 13(ప్రభాత వార్త) అనపర్తి మండలం పెడపర్తి గ్రామంలో గ్రామ సమీపంలో తవ్వుతున్న చెరువు తవ్వకాలు నిలిపివేయాలని సోమవారం గ్రామస్తులు జిల్లా కలెక్టరు ను తమగోడు వెల్లబుచ్చారు. గతంలో ఒక్కసారి తవ్వకాలు జరుగుతుంటే తాము ఆందోళన చేశామని అప్పుడు తవ్వకాలు ఆపిచేశారని మళ్లీ ఎప్పుడూ వచ్చి తవ్వకానికి ఆర్డర్ వచ్చిందని కుతుకులూరు కు చెందిన ఒక వ్యక్తి గ్రామస్తులను బెదిరించడంతో తాము రాజమండ్రి జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి నట్లు బాధితులు చెప్పారు.తవ్వకాలు పూర్తిగా నిలిపివేసేవరకు తాము పోరాటం ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## బ్యారేజీ గేట్ల ఆధునీకరణ శంకుస్థాపన

### జేగురుపాడునుంచి భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు



కడియం ,జూలై 13 (ప్రభాతవార్త) గోదావరి డెల్టా రైతాంగానికి జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ గేట్ల ఆధునీకరణ పనులకు రూ.152 కోట్ల వ్యయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ధవళేశ్వరానికి తరలివెళ్లారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధి, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని నాయకులు వ్యక్తం చేశారు. గోదావరి డెల్టా సాగునీటి వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా ఈ ఆధునీకరణ పనులు కీలకమని పేర్కొన్నారు. జేగురుపాడు జనసేన గ్రామ అధ్యక్షుడునాగిరెడ్డి రామకృష్ణఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లతో నాయకులు, కార్యకర్తలు ధవళేశ్వరానికి ర్యాలీగా బయలుదేరారు. పిచ్చుకలంకలో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కూటమి శ్రేణులు హాజరై సభను విజయవంతం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కూటమి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "రైతే రాజు – రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి" అనే లక్ష్యంతో ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల ఆధునీకరణతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగునీటి సరఫరా మరింత మెరుగుపడి లక్షలాది ఎకరాలకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్రీ చినబాబు , మారెడ్డి. రమేష్.వనమాలి వెంకట బాలాజీ ,వనమాలి వీర కృష్ణ,తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీకి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## బంగారు మారేడు దళాలతో విశ్వేశ్వరునికి అమ్మ పూజలు



శంఖవరం జూలై 13 ప్రభాతవార్త మండలంలోని కత్తిపూడి లో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది .మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం కలిసి రావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ర్యాలీ సుబ్రహ్మణ్యం కుమార్ శర్మ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ ద్రవ్య రుద్రాభిషేకం ,కావించి స్వామివారిని బంగారు మారేడు దళాలతో పూజల అనంతరం స్వామివారిని అలంకరించారు. వెండి నాగాభరణం, వెండి త్రిశూలం, వెండి పుష్పాల అలంకరణతో స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా విశాలాక్షి అమ్మవారిని విజయవాడ కనకదుర్గ అమ్మవారి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామస్తులు పరిసర గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి నీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గంగవరం మండలంలో దేవాదాయ శాఖ సీ ఈ పర్యటన



కె.గంగవరం, జులై 13, (ప్రభాతవార్త): కె గంగవరం మండలంలోని పామర్రు గ్రామంలో నిర్మాణంలో ఉన్నటువంటి పట్టాభిరామ స్వామి వారి ఆలయాన్ని దేవాదాయ శాఖ సి ఈ తోట దుర్గేష్ కుమార్ సందర్శించారు. పనులు నాణ్యతతో, నిబంధనల ప్రకారం తొందరగా మూడు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ పామర్రు పాణింగపల్లి ,కూళ్ల గ్రామాలలో కొత్తగా సుమారు మూడు కోట్ల రూపాయలతో పనులు నిర్వహిస్తున్నట్లు అన్ని పనులు పునాదుల నిర్మాణంలో ఉన్నట్లు తెలపగా ఇదే డివిజన్లో ఉన్నటువంటి కోరుమిల్లి గ్రామంలో సుమారు మూడు కోట్లతో ఆలయ పనులు జరుగుతున్నాయని వీటన్నిటిని పుష్కరాలలోకి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో దేవరపల్లి వెంకటేశ్వరరావు మోటోరి నాని ,తూము రమేష్ బాబు ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వంటకు గ్యాస్ వాడాలి. యం. ఇ. ఓ. టి. సూరయ్యరెడ్డి




రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త ప్రతీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీకి గ్యాస్ ను తప్పనిసరిగా వాడాలని పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేకంగా ఆదేశాలను జారీ చేశారని రాజవొమ్మంగి మండల విద్యాధికారి.. 2 టి. సూరయ్యరెడ్డి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం రాజవొమ్మంగి మండల విద్యాధికారి కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యం. ఇ. ఓ. సూరయ్యరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22 న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్ కు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ ఒక పండుగలా నిర్వహించాలన్నారు. కిట్లు పొందిన ప్రతీ విద్యార్థితో బయో మెట్రిక్ వేయించాలన్నారు. ఈకార్యక్రమంలో యం. ఇ. ఓ. 2 టి. సూరయ్యరెడ్డి, హెచ్. యం. ఆదిలక్ష్మి, సి. ఆర్పీలు సి. హెచ్.సతీష్, కె.ఆదినారాయణరెడ్డి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులకు చంద్రబాబు శ్రీకారం



ఆత్రేయపురం, జూలై 13,(ప్రభాత వార్త) రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సోమవారం తూర్పు గోదావరి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల పర్యటనలో భాగంగా కడియం నియోజక వర్గం వేమగిరి లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్కు చేరుకుని, అనంతరం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణ రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, గోదావరి డెల్టా సాగునీటి భద్రతకు అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2014--19 మధ్య టీడీపీ ప్రభుత్వం ధవళేశ్వరం బ్యారేజీకి 58 కొత్త గేట్లను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం కేంద్ర జల సంఘం (జఔజ) సిఫార్సుల మేరకు మిగిలిన 117 గేట్లను దశలవారీగా కొత్తవాటితో భర్తీ చేసే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బ్యారేజీ వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గేట్ల బిగింపు పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి మొత్తం పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ప్రస్తుతం సముద్రంలోకి సుమారు 27 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా, కాల్వల ద్వారా 14,700 క్యూసెక్కుల నీటిని సాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి డెల్టాలోని కాల్వల చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమర్థవంతంగా చేరేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.గోదావరి, కోనసీమ ప్రాంతాలు ప్రకృతి సంపదకు, వ్యవసాయ వైభవానికి ప్రతీకలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతాల ప్రత్యేకతను పరిరక్షించడంతో పాటు పర్యాటక, వ్యవసాయ రంగాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటల సాగు కూడా గణనీయంగా పెరుగుతోందని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ధవళేశ్వరం హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, నారాయణ, సుభాష్, శాసనమండలి సభ్యుడు సోము వీర్రాజు , శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఎం. వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బాలరామకృష్ణ, , రుడా చైర్మన్




వెంకటరమణ చౌదరి, టీడీపీ పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, ఏపీఐ, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బురుగుపల్లి శేషారావు తదితర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్,



ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్కిన్సన్స్ బాధితులకు 'యశోద హైటెక్ సిటీ' సరికొత్త సంజీవని....

### మూడు దశాబ్దాల నమ్మకమైన చికిత్సగా నిలిచిన 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' విధానం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై13,ప్రభాతవార్త. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన నరాల క్షీణత రుగ్మత పార్కిన్సన్స్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అత్యుసర పరిస్థితి ఏర్పడింది. అల్జీమర్స్ తర్వాతి స్థానంలో నిలిచిన ఈ వ్యాధి తీవ్రత భారతదేశంలో నానాటికీ పెరుగుతోంది. మనుషుల సగటు ఆయుర్దాయం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ వ్యాధి విస్తృతి మరింత పెరిగి సమాజంపై, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర భారాన్ని మోపే ప్రమాదం పొంచివుంది. మరీ ముఖ్యంగా, గతంలో కేవలం వృద్ధులకే పరిమితమనుకున్న ఈ వ్యాధి, ప్రస్తుత కాలంలో తక్కువ వయసు గల యువతలోనూ విపరీతంగా నిర్ధారణ కావడం వైద్య రంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మెదడులో శారీరక కదలికలను అత్యంత సమర్థవంతంగా నియంత్రించే 'డోపమైన్' అనే రసాయన ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతినడమే ఈ పార్కిన్సన్స్ వ్యాధికి ప్రధాన మూలకారణం. జన్యుపరమైన లోపాలు, పర్యావరణ కారకాల మధ్య జరిగే అత్యంత సంక్లిష్టమైన ప్రతికూల చర్యల వల్లే ఈ రుగ్మత సంభవిస్తుందని అంతర్జాతీయ నిపుణులు నిర్ధారించారు. విశ్రాంతి సమయంలో చేతులు, కాళ్లు వణకడం, కదలికలు పూర్తిగా మందగించడం, కండరాలు బిగుసుకుపోవడం, నడకలో స్థిరత్వం కోల్పోవడం వంటి మోటార్ లక్షణాలతో పాటు మలబద్ధకం, వాసన చూసే శక్తి కోల్పోవడం, తీవ్ర నిద్రలేమి, జ్ఞాపకశక్తి క్షీణత, రక్తపోటు హెచ్చుతగ్గులు వంటి నాన్-మోటార్ లక్షణాలు రోగులను తీవ్రంగా వేధిస్తాయి. ఈనేపథ్యంలో రాజమహేంద్రవరం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హైటెక్ సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, వ్యాధి ప్రారంభంలో మందులతో నియంత్రించినప్పటికీ ముదిరే కొద్దీ ప్రత్యామ్నాయ వైద్య విధానాలు అనివార్యమవు తాయని స్పష్టం చేశారు. వ్యాధి తీవ్రత పెరిగినప్పుడు మందుల ప్రభావం క్రమంగా క్షీణించే తరుణంలో, యశోద హైటెక్ సిటీ అందిస్తున్న డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) శస్త్రచికిత్స విధానం బాధితుల్లో సరికొత్త ఆశలను చిగురింప జేస్తోంది. గత మూడు దశాబ్దాలుగా వైద్య రంగంలో అద్భుతమైన ఫలితాలను ఇస్తూ రోగుల జీవన ప్రమాణాలను పెంచడంలో డీబీఎస్ చికిత్స అత్యుత్తమ ప్రమాణంగా నిలిచింది. మెదడులోని నిర్దిష్ట భాగాలలో సూక్ష్మ ఎలక్ట్రోడ్లను అమర్చి, వాటిని ఛాతీ భాగంలో ఉండే ఒక చిన్న పరికరానికి అనుసంధానించడం ద్వారా మెదడులోని అసాధారణ విద్యుత్ చర్యలను ఈ సాంకేతికత పూర్తిగా క్రమబద్ధీకరిస్తుంది. ఫలితంగా రోగుల్లో వచ్చే వణుకు, కండరాల బిగువు, కదలికల లోపాలు సమర్థవంతంగా అదుపులోకి వస్తాయి. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కోత లేని సరికొత్త సాంకేతికత 'మాగ్నెటిక్ రెసోనెన్స్-గైడెడ్ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్' (ఎమ్మార్జీఎఫ్ యూఎస్) తో పోల్చితే యశోద హైటెక్ సిటీ నిపుణులు సూచిస్తున్న డీబీఎస్ విధానమే అత్యంత సురక్షితమైనది, ప్రయోజనకరమైనది. ఎమ్మార్జీఎఫ్ యూఎస్ విధానంలో మెదడు కణజాలం శాశ్వతంగా మార్చబడి, తిరిగి పూర్వస్థితికి తెచ్చే అవకాశం లేకపోగా, అది కేవలం వణుకును మాత్రమే తాత్కాలికంగా లక్ష్యంగా చేసుకుంటుంది. కానీ డీబీఎస్ చికిత్స మెదడుకు ఇరువైపులా విజయవంతంగా పనిచేస్తూ శరీరంలోని రెండు వైపుల లక్షణాలను నయం చేస్తుంది. కాలక్రమేణా రోగి శరీర తత్వంలో వచ్చే మార్పులకు అనుగుణంగా వైద్యులు ఈ పరికరాన్ని సర్దుబాటు చేసే సదుపాయం ఉండటమే కాకుండా, అవసరమైతే దీని ప్రభావాన్ని పూర్తిగా వెనక్కి తీసుకునే వీలుంది. దశాబ్దాల సుదీర్ఘ ట్రాక్ రికార్డ్ మరియు నిరూపితమైన భద్రత కేవలం డీబీఎస్ వైద్య విధానానికే సొంతం. ఇంతటి అద్భుతమైన వైద్య విధానం అందుబాటులో ఉన్నప్పటికీ, సమాజంలో రోగులతో పాటు సాధారణ వైద్యుల్లోనూ డీబీఎస్ పూర్తి సామర్థ్యంపై సరైన అవగాహన లేకపోవడం విచారకరం. మందులు పూర్తిగా విఫలమైన దశలో ఉన్న రోగులకు డీబీఎస్ స్థిరమైన, అత్యున్నత ఫలితాలను ఇస్తుందని, బాధితులకు కేవలం శారీరక ఉపశమనమే కాకుండా వారి ఆత్మగౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని నిలబెడుతుందని యశోద హైటెక్ సిటీ ఉద్యమ కోర్సు డైరెక్టర్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ రూపమ్ బోర్గోహైన్ నొక్కి చెప్పారు. ఈ ప్రతిష్ఠాత్మక అవగాహన కార్యాచరణలో యశోద హైటెక్ సిటీ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రుక్మిణి మృదుల,, డాక్టర్ శృతి కోలా లతో పాటు యశోద హైటెక్ సిటీ మార్కెటింగ్ హెడ్ డిజిఎం జీ సంతోష్ కుమార్, కోస్టల్ ఏపీ ఎగ్జిక్యూటివ్ వీ సాయి కిరణ్ చురుగ్గా పాల్గొని పార్కిన్సన్స్ పై ఉమ్మడి పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. సరైన సమయంలో యశోద హైటెక్ సిటీ నిపుణుల ద్వారా లభించే ఆధునిక చికిత్సతో పార్కిన్సన్స్ బాధితులు కూడా సమాజంలో సంతోషకరమైన, సంతృప్తికరమైన పరిపూర్ణ జీవితాన్ని గడపవచ్చని నిపుణుల బృందం పిలుపునిచ్చింది.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps